భారతి

అక్టోబరు 1968

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల / ఒక రూపాయి

భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

అక్టోబరు 1968

★

ఆంధ్ర సాహిత్య పరిషత్తు, కాకినాడ.
TELUGU ACADEMY, COCANADA

సంపుటము : 45 : సంచిక : 10 :

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

అక్టోబరు 1968

మధుభిక్షువు

శ్రీ ఇంద్రగంటి భానుమూర్తి

తిమిరతేజస్సు కొడిగట్టేటివేళ,
పక్షుల బారులు స్వచ్ఛాకాశంమీద గజిబిజిగీతలు పుడిమేస్తున్నవేళ,
ఊరి చివరి చెట్టుకింద పిచ్చి బిచ్చగాడు కిన్నెరతీగ సవరించుకొనేవేళ,
ఆశ్రమమంటపాన నీలికోవెలగంట మ్రోగేటివేళ,
అదే వేళ, ఆ వేళే,
మధుభిక్షువు విరివాడకు తరలేటివేళ.

* * *

అదేమో ఆ పెద్దపువ్వులవాడ
ఆ పువ్వులవాడమీద అనురాగంవంటి మృదువైన ఎర్రసంజజాడ —
మల్లీ మాలతీ మొగలీ గులాబీ
అదంతా నానాజాతుల కూడలి.
మధుభిక్షువు ఆ వాడకే వస్తాడు.
వచ్చి, మెత్తనిగొంతుతీగసవరిస్తాడు.

పువ్వు వాకిట్లో —
మొగ్గ ముంగిట్లో —
మనిషి కందనిపాట,
ఏ భాష కందనిపాట,
మనసు కందేపాట,
ప్రతిగుండె పొంగేపాట,
పాడుతూ నిలుస్తాడు,
పువ్వు వాకిట్లో —
మొగ్గ ముంగిట్లో —
అపుడా వాడను పువ్వులు
నిశ్శబ్ద నిస్తబ్దములైన మూగమువ్వలు.

అపుడా వాడను పువ్వులు
స్నేహస్నిగ్ధములైన దివ్వెలు.
అపుడా వాడను పువ్వులు
విరిసిన వెన్నెల రవ్వలు.

పాప జిల్లోకి వెళ్లేదీ,
దేవుడి గుళ్లోకి మళ్లేదీ,
నేల కారిగేదీ,
నగరి కరిగేదీ,
ఆకుచాటుదీకూడవచ్చి మధువిస్తుంది.
ముళ్లమధ్యదికూడ మధురసం తెస్తుంది –
అలాఅలా వాడవాడంతా భిక్షు మధుభిక్షచేసి,
వాటి తేటగుండెల్లో స్మృతిస్వప్నాలు జార్చి,

పాట ముందుగా,
వెనక తానుగా,
తాను ముందుగా,
వెనక పాటగా,
కదలిపోతాడు భిక్షువు.
మలుపులోకి కరిగిపోతాడు భిక్షువు.

*　　　　*

మూడు మున్నీటివాగుల మధ్య,
అందమైన గగననీలిమలమధ్య,
గుండెకాయలా ఒదిగిఉన్న దీవిలోని
తన ఆకుపచ్చని లోకాన,
మధుధామాన్ని నిర్మించుదామనీ
రసజగత్తు సృజించుదామనీ
మొదలుపెట్టాడు భిక్షువు.

అక్కడా వనాలూ, కాననాలూ తిరిగీ
వాగుదాటీ, వంకదాటీ,

కొమ్మకొమ్మనీ పూలరెమ్మనీ
పలుకరిస్తాడు, అడిగి తెస్తాడు.
చేరుస్తాడు.

తీర్చిదిద్ద యత్నిస్తాడు, శ్రమిస్తాడు
రసకోశాన్ని సృజించుదామనీ—
మధుజగత్తు నిర్మించుదామనీ—
అక్కడ నిత్యంచూసే చుక్కలికి తెలుసు
అతడు పాపం నిద్రపోడని.

అక్కడ మూగేచీకట్లకి తెలుసు
ఆతడు పాపం మంచివాడని.
ఆ చుట్టుపట్ల పులులికీ, తోడేళ్ళకీ తెలుసు
అతడు పాపం అమాయకుడని,
తన లోకమేతప్ప తాను ఏమీ ఎరగడనీ.

*　　　　　*　　　　　*

సరళరేఖ సాగిసాగి చటుక్కున ఆగిపోయినట్టుగా
నమ్మినదారి రెండుగా చీలి మలుపులోకి తిరిగి పోయినట్టుగా
మధుభిక్షువు క్రమ నిర్విరామ గతి
ఠక్కున ఆగిపోయింది.
మలుపులోకి తిరిగి పోయింది.
ఆ వేళ నిజంగా విషాదనీరవవేళ.

అతని మాగన్నుకునుకు నిద్రలో
హఠాత్తుగా అపస్వరం ప్రాకినవేళ.
అతడులిక్కిపడి వెంటనే కళ్ళు తెరిచేటప్పటికి
తెరిచి చూసేటప్పటికి—
ఏవుంది—

అతని స్వప్నంకింద పొగలు పెట్టారెవరో
అతని కలకి మంటలు పెట్టారెవరో.
దాన్ని చూడలేకపోయాడు పాపం.
ఆ దృశ్యాన్ని భరించలేకపోయాడు అతడు.
అతని కంఠ సంగీత తంతువు టప్పున తెగిపోయింది.

రైగవిమ్మిన ఆ పొగలలో
చుట్టుముట్టిన ఆ మంటలలో
తన కలలో
తానూ కాలిపోయాడు.
తన కలతోబాటు, మధుధామంతోబాటు,
ఆ కఠిన కిరాతక హస్తంలో తానూ నలిగిపోయాడు
మధుభిక్షువు.

* * *

మధుభిక్షువు కన్నీటి తళుకుతో,
మధుభిక్షువు పాట తొణుకుతో,
విచ్చని ఆ మధువు —
కఠిన కిరాతక హస్తాల్లోంచి మారి,
కర్కోటక కర్కాటకుల హస్తాల్లోకి,
పాలరాతి గూటిలోకి,
విరస రసనా లోకంలోకి —
ఉక్కుచేతుల చెరలోకి —
జారిపోయింది.



'ముఖలింగేశ్వర... త్రికళింగ దేవర'

 శ్రీ జి. ఆర్. వర్మ



మధూకేశ్వరలింగమూర్తి

శ్రీకాకుళంజిల్లా పాతపట్నం తాలూకా ముఖలింగం క్షేత్రానికి టెక్కలి, తిలారు రైలుస్టేషన్‌ల నుండి మోటారుబస్సు ప్రయాణ సౌకర్యమున్నది కాని ప్రయాణీకులకు శ్రీకాకుళంనుండి బస్సులో పోవడమే చాలా సౌకర్యంగా వుంటుంది.

ముఖలింగంలో ఉపాధ్యాయుడు శ్రీ పంచాది భీమేశంబాబు చాల సహాయపడ్డారు. పశువుల కాపరికి రాగిరేకుల గుత్తి దొరుకగా ఆయన ఆ శాసన పరిశోధనకు అరసవల్లిలోనున్న శ్రీ మండా నరసింహం గారికి అందజేశామన్నారు. ఆ శాసనకర్త అనంతవర్మ చోడగంగదేవుడైయుండును, రాజైన తర్వాతదైయ్యుండును కొబట్టి పాఠం పంప



ముఖలింగం : మధూకేశ్వరోదంతం అనుకుంటున్న తోరణ శిల్పం.

మన్నాను. నా యూహ గురితప్పలేదు. ఈతడు రాజైన క్రీ. శ. 1077–8 నాటిది ఈ ముఖలింగ శాసనం. ఆతని తర్వాతి శాసనాలతో పోల్చిన కల్పిత గాథలు, అసంఖ్యాకంగా ఆతని పూర్వరాజుల సంఖ్యలో 'అబద్ధాలు' ఈ శాసనంలో లేవు. ఈ రాజు పూర్వులు కొందరు ఈ శాసనం ప్రకారం త్రికళింగ రాజులు—

'గంగాసామాన్యయుల్లో (1) గుణమహార్ణవ మహారాజ పుత్రుడు, వజ్రహస్తదేవుడు, (2) కుమారుడు గుండమరాజు (3) తమ్ముడు కామార్ణవ దేవుడు, (4) కుమారుడు వినయాదిత్యుడు, (5) కామార్ణవ తనయుడు వజ్రహస్తుడు, (6) జ్యేష్ఠపుత్రుడు కామార్ణవదేవుడు, (7) తమ్ముడు గుండమహీపతి, (8) సవతితల్లికిపుట్టిన (ద్వైమాతుర) మధుకామార్ణవదేవుడు, (9) ద్వితీయ కామార్ణవునకు వైందుబ రాజకన్య వినయా మహాదేవికి పుట్టిన వజ్రహస్తదేవుడు, (10) కుమారుడు రాజరాజు, (11) ఆతనికి జ్యేష్ఠ భార్యయైన రాజేంద్రచోళతనయ రాజసుందరీరాణికి పుట్టి, నగరమున అభిషిక్తుడైన 'మహారాజాధిరాజ' త్రికళింగాధిపతి శ్రీ మదనంతవర్మ చోడగంగదేవుడు (శాసనకర్త). ఈ ముఖలింగ శాసనంలో పూర్వ రాజుల సంఖ్య తాత (వజ్రహస్త) శాసనాలకు చేరువగా నుండుటేగాక చోడగంగుని పూర్వులు పదిమంది పాలించినది సుమారు 184 సంవత్సరాలుకాగా, దేవుని పేరు (గోకర్ణ)తప్ప పూర్వగాంగుల (గంగామల కుల స్తంభమన్నవాడు) గూర్చి ఏవీ సూచన లేదు. చోడ గంగునిరాజ్యం, ప్రాముఖ్యత పెరిగినకొద్దీ ఆతని శాసనాల్లో పూర్వుల సంఖ్య, వంశప్రశస్తి పెరిగినవి. పూర్వరాజుల సంఖ్యావివరాలు తెలుసుకోడానికి తాత (వజ్రహస్తుని) శాసనాలవలె చోడగంగుని ముఖ లింగం రాగిరేకుల శాసనం యదార్థం, ముఖ్యం—

చోడగంగుని పాలనాకాలం క్రీ. శ. 1077–1142 లేక 52. వేంగిరాజరాజు (రాజరాజనరేంద్ర) తనయుడైన రాజేంద్రచోడుని (కులోత్తుంగచోళ చక్రవర్తి) సమకాలీనుడు.

శ్రీకాకుళంజిల్లా కొర్ని (లోప) గ్రామాన లభించిన శాసనాల్లో (క్రీ. శ. 1112) చోడ గంగుని ముఖలింగక్షేత్రంలో దేవాలయంగూర్చిన వివరణ వున్నది.

'......ద్వితీయ కామార్ణవః పంచాశద్వర్షాన్ మహీమండల మమండయత్। తస్య శిరస్కృత త్రివిష్టపమ్ నగరన్నామ పురమాసీత్॥ తస్మిన్ సోపి మధూకవృక్షజనవా దీశస్య లింగాకృతేః కృత్వాఖ్యామ్ మధుకేశ ఇత్యరచయ ప్రాసాదమభ్రంలిహం। యమ్ ద్వారోర్ధ్వ విచిత్రవత్ర లతికాన్ శ్చిత్రాణి వా పశ్యతామ్ సౌధా న్యంబర వర్తినామ్ హ్యపి భవేన్మానమ్ విమానా రుచిః......'

ఇచ్చట కళింగ–త్రికళింగ విషయములను గూర్చి కొన్ని తెలుసుకోక తప్పదు.

కళింగరాజ్యం అనగానే పామరులేగాదు పరిశోధకుల్లో చాలామందికూడా ఓఢ్రం మాట్లాడే ఒరిస్సా (ఒరియా)రాష్ట్రం అనేంతవరకూ రావడం– ఉత్తర కళింగమైన (ఉత్కళ)ప్రాంతం ఒరిస్సాలో చేరి ప్రాంతీయభాషాది దురభిప్రాయం కాక కావచ్చు– కళింగం అంటే ఒరిస్సా, గాంగులు ఓఢ్రులు అన్నంత 'నమ్మకం'లో పునాదులు వేసేశారు.

కర్ణాటరాజ్యంవలె కళింగరాజ్యం వివిధకాలాల్లో వివిధప్రాంతాలకు వర్తించినది. చోడగంగు శ్రీకాకుళం జిల్లా నగరినుండి పాలించినప్పుడు, ఉత్కళరాజు గాక పూర్వం కర్ణాటరాజుగానే భావింపబడెను. కాని కర్ణాటవలె భాషావాచకం గాదు. కురుక్షేత్ర (భారత గాథ) యుద్ధంలో కళింగరాజు కౌరవమిత్రుడు కాబట్టి (చారిత్రకం గాకపోవచ్చును) భారత రచనా కాలానికే సుప్రసిద్ధరాజ్యం.

మౌర్య అశోకచక్రవర్తినాటికి ఆంధ్ర కళింగాల్లో విలసిల్లినది బౌద్ధం–ఈ చక్రవర్తి కళింగ దండయాత్రాదృశ్యాల జూచియే బౌద్ధుడైనది.

కొన్నికాలాల్లో కళింగ అనబడిన రాజ్యాలు చాలా ఉన్నాయి. ఉత్తరకళింగ (కొస్యోధ, ఓఢ్ర భాగాలు కలిపి) ముఖ్య లేక మధ్యకళింగ, దక్షిణ కళింగ (విశాఖ, తూర్పుగోదావరి కలిపి)–త్రికళింగ, సప్తకళింగ కూడా ఉండేవి.

గ్రీకు చరిత్రకారులు (మెగాస్తనీస్) ప్రాచీన

దావిల్లో స్వతంత్రదేశంగా ఉన్న కళింగను కర్లింగా విన్నాకే చరిత్రగా నమ్మడం జరుగుకపోలేదు. గ్రీకులు పేర్కొన్న 'గంగారిడ్డి'లు ఈ కళింగగాంగులే అని మన పరిశోధకులూ వ్రాసేశారు. అది సరికాదేమో! ఉత్తర భారత–ఉత్తరప్రదేశ్, బీహారు ప్రాంతాలనుండి వచ్చి అచటి గంగానదీసంబంధంగా ఇచట గాంగులైనారంటే ఎలా నమ్మగలము? మన పరిశోధకులు కూడా గ్రీకులు పేర్కొన్న 'మక్కొ' (ముఖ్య), 'మోదొ' (మధ్య లేక మధు) కళింగ ప్రజలకు, 'గంగారిడి'లకు ముడిపెట్టారు.

శ్రీకాకుళంజిల్లాతో పొరుగు కొరాపుట్టు, గంజాంజిల్లా భాగాలు కలిపి ముఖ్య లేక మధ్య కళింగమనే నా విశ్వాసం. చాలామంది సమర్థిస్తారనే ఆశిస్తాను. గాంగులనాటి కులవర్తని (కులవంతని), నశాపావర్తని ముఖ్య లేక మధ్య కళింగం–(కోలువర్తని, కొమ్మకవర్తని).

ఈ మధ్య కళింగం వేడు వెనుకబడిన ప్రాంతం, గిరిజనావాసం, పర్వతారణ్యభూమి.


కళింగరాజ్యాలు వివిధకాలాల్లో ఒకటికన్న ఎక్కువగా ఉన్నట్లే కళింగ నగరాలుకూడా ఉన్నాయి.

క్రీస్తుపూర్వకాలంనుండి కళింగలో ఆజీవక–జైనబౌద్ధాలు–అబ్రాహ్మణ లేక అవైదిక లేక అనార్య సంప్రదాయాల కాటపట్టు కావడం వల్లనే కావచ్చు గంగానదీప్రాంతాలకు చేరి (ఆర్యావర్తం) ఆనాటి శ్రోత్రియులు కళింగాన కాలు పెట్టిన అగ్నిష్టోమం (ప్రాయశ్చిత్తం) చేసుకోవాలన్న కారణం.

శాతవాహనుల్లో కొందరి నాటికి కళింగ రాజైన ఖారవేలునినాటికి కళింగం కేవలం ఓఢ్ర రాజ్యంగా ఉన్నట్లు కన్పించదు.

కృష్ణానదీతీరాన్నుండి పాలించిన శాతవాహనులు, ఇక్ష్వాకుల తర్వాత కళింగాన్ని పులిందసేను ఆక్రమించిన కథ ఉంది. ఈ పులిందుడు గిరిజనరాజో, ఆటవికసైన్యాలున్నవాడో కావాలి.

కృష్ణాతీర రాజవంశాలవారి సామంతులో,



ముఖలింగం: వాయువ్యమందున్న చిరుదేవళం – ద్వారతోరణ శిల్పం; కళింగ–విష్ణుకుండిన ఇంద్రుల యుద్ధమా?

బంధువులో మాఠరీపుత్ర—పుళిందసేనుల నోడించినది అనంతవర్మ. పుళిందసేనుడు ఉత్తర ప్రాంతాలకు పోయి (కొంగోదు, కొన్యోధ—నేటి గంజాం పరిసరాలు) కొండల్లో తలదాచుకొనెనట. అతని వంశీయులు కొన్యోధ పాలించిన శిలావంశీ (శైలోద్భవ) యులు. వీరు కళింగరాజులకు బద్ధవైరులేకాదు; వారిని ఓడించి త్రికళింగాధిపతులై అశ్వమేధం కూడా చేసారట.

పడమటికనుమలవైపు విక్రమాదిత్య నాములున్నట్లే తూర్పుకనుమలవైపు అనంతవర్మ నామధేయు లనేకులున్నారు.

గుప్తసామ్రాజ్యమునకు—సముద్రగుప్తుని అలహాబాదు ప్రశస్తిలో పేర్కొనబడిన,—లోబడిన పన్ను రాజ్యాల్లో కొన్ని కళింగప్రాంతాలే—కోసల (దక్షిణ), మహాకాంతార భాగాలు. 'పిష్టపురక మహేంద్రగిరి కొత్తూరకస్వామి దత్తైరండపల్లక దమన' రాజులు త్రికళింగ రాజ్యంలోనివారే.

గుప్త సామ్రాజ్యానంతరం దక్షిణభారతాన రాజకీయంగా పలుకుబడిగలవారు వాకాటకులు. క్రీస్తు పూర్వం శాతవాహనులనాటికే వీరి దాక ఆదిమ (Tribal) జాతి -పాకోటకులనీ పేర్కొనబడినారు. విష్ణుకుండినులతో బాంధవ్యం—కుంతల (కర్ణాట) కళింగాల్లో తమ పలుకుబడికి లోనైనవారి రాజరికం—వాకాటక హరిసేన (క్రీ. శ. 487–510) యుక్తి విజయపరంపర —

హరిసేనునినాడే—నందివర్ధన లేక పుష్కరాధిపతు లనబడిన నలవంశ్యులు నాశనం కాబడి ఆ రాజ్యశిథిలాలపై హరిసేనుని తోడ్పాటున గంగామల కుల (తొలిగాంగులు) రాజుల కళింగరాజ్య నిర్మాణం జరిగెనేమో నని పరిశోధకాభిప్రాయం. వాకాటక వైభవం నశించగా పొరుగు విష్ణుకుండినులు బలహీనులైన కాలాన కళింగగాంగులు విజృంభించియుందురు.

విష్ణుకుండినులు, సమకాలీనులైన తొలి గాంగులు బద్ధవైరులు. కేవల బ్రాహ్మణ సంప్రదాయోద్ధరణకుగాను మాధవవర్మ కళింగముపై దండయాత్ర చేసియుండెను.

త్రికళింగరాజ్యంలో దక్షిణకోసల భాగాలు కలిసినట్లే త్రికళింగ భాగాలు ఆయాకాలాల్లో దక్షిణకోసల భాగాలుగా వుంటూవచ్చాయి. రాయపూర్, బస్తర్ ప్రాంతీయమైనది నాటిదక్షిణకోసల—రాజధాని శరభపురం. శరభరాజవంశం శూలిక లేక సుల్కి జాతి. ఈ 'శరభ'లో శబర నిగూఢం ఐతే గావచ్చును. సుల్కి లేక శూలికలో సలుకి—చాళుక్య స్ఫురిస్తున్నా, ఈ శరభపురాధిపతులు చాళుక్యులు కారు, తక్కువ జాతివారు అన్నారు కొందరు పరిశోధకులు. వీరికి బహుశా చాళుక్యులు బ్రాహ్మణులను పోషించనికాలపు పూర్వవిషయాలు జ్ఞాపకం లేవేమో!

ఇక్ష్వాకులనాటి 'ఖండనలికి రెమ్మణక హిరణకోలో రొఖరూపాన (ద్రవ్యం) భూమిశిస్తు వసూలుచేసే అధికారం అర్థం తొంగిచూస్తుందే!

అశ్వికసైన్యాల పోషించిన, బస్తర్‌రాజుల కుల దేవత పోలే దేవిని పూజించిన శరభపురీయుల నోడించి దక్షిణకోసలాధిపతులైనది సిరిపురం (శ్రీపురం—రాయపూర్‌జిల్లా)నుండి పాలించినది కోసలగుప్తులు. వీరే పాండు, శబర వంశీయులు. మధ్యభారతంలో పండాలు.

ఈ శబర వంశీయులు సమకాలిక గాంగుల బద్ధవైరులేగాదు కళింగరాజ్యప్రాంతాల జయించి త్రికళింగాధిపతులమన్నారు. కోసలగుప్తులనాడు బౌద్ధంతో పాటు ఇతర సంప్రదాయాలు పోషింపబడెను. మహాశివగుప్తుని తల్లి (క్రీ. శ. 7 వ శతాబ్దం) విష్ణ్వాలయ నిర్మాత. నేటి సిరిపురం (రాయపూర్‌జిల్లా) లక్ష్మణేశ్వరాలయం—శరభ వంశీయుల శరభపురం ఈ ప్రాంతానివే. కోసలగుప్త మహాశివగుప్త బలార్జునుల పాలనాకాల సమీపకాలాల్లో దక్షిణ కోసలాధిపతులనేక ఆలయ నిర్మాతలు.

చోడగంగదేవుని అసంఖ్యాక శాసనాల్లో వంశప్రశస్తిలో మొదటి కామార్ణవుడు కళింగాన రాజ్యస్థాపన జేయుటలో ఒకానొక శబరాదిత్య బలాదిత్యు నోడించి గోకర్ణేశ్వరుని కృపచే రాజా కావడం కథ—శబలాదిత్యుడు ఒకానొక కోసలగుప్తరాజా అయ్యుండాలి. కాగా బలాదిత్య నామధేయులు చారిత్రక విషయం—

బినా కామార్ణవు దోడించిన ఆ ఆదిత్య డెవరో సరిగా తెలియదు.

క్రీ. శ 5 వ శతాబ్దంలో ప్రారంభమైన గాంగశకం—శకపరిగణనగా క్రీ. శ. 15 వ శతాబ్దం వరకూ కళింగాన్నేలిన తొలిగాంగులు, మలిగాంగులు వ్యవహరించిన బిరుదుల్లో 'సామంత, అధిరాజ, మహారాజ, మహారాజాధిరాజ, సమస్త కళింగాధిరాజ, త్రికళింగాధిరాజ'—వున్నాయి. వీరంతా చోడగంగునినాటి వరకూ శైవులు.

పశ్చిమ చాళుక్యులు (బాదామి, కళ్యాణకటక) తూర్పు (వేంగీ) చాళుక్యులూ ఒకే కుటుంబంవారు.

పశ్చిమగాంగులు ఇక్ష్వాకు సూర్యవంశీయులమన్న జాహ్నవేయులు. మైసూర్ రాష్ట్ర ప్రాంతం. ఈ జాహ్నవేయుల వంశోత్పత్తి:-రాణి గంగాస్నానం చేయగా గర్భిణి అయిన కథ—క్షమించాలి-గర్భధారణ, సంతానోత్పత్తి కథల్లో ఆధునిక, అనాగరిక విశ్వాసాలనబడే సందర్భంలో అలాంటి కథే తెలంగాణా గోండుల్లో ఉంది. బక్కులవారి అక్కలకథా అలాంటిదే. పాతే గ్రామీణ స్త్రీలు నేడూ 'ఉదకాలాడింది, నీళ్ళోసుకుంది' అంటారు. అర్థం ప్రసవించింది, తల్లి నది— అనేభావం గావచ్చును. జాహ్నవేయులకు గంగానది చాల దూరం—

తొలిగాంగులు తాము 'గంగామలకులుర' మన్నారేగాని మరేగొప్పచెప్పకోలేదు గంగవలె పవిత్రమైన కులం— వీరికీ గంగానదికీ దూరం— కాని మలిగాంగులు ('గంగావామాన్వయ, రూపగాంగ') ముఖ్యంగా చోడగంగు చెప్పకున్న (శాసనాలు) వంశగాథ—గంగానదియే కుమారుని ఇచ్చినదట, ఒక పూర్వరాజుకు కాబట్టి ఆ పేరు. కాని చంద్రవంశం, (ఆత్రేయ గోత్రం) వారు...

ప్రాక్పశ్చిమ గాంగులు ఒకరే అనేందుకు చరిత్రకారులున్నట్లే వేర్వేరుకారా అని ప్రశ్నించే వారెందు కుండరాదు?

కర్నాట ప్రాంతాల్లో కాదంబులున్నట్లే తూర్పున గాంగులనాటి కదంబు (శేడి) లున్నారు. పశ్చిమాన కదంబులు, జాహ్నవేయులు వైరులు, బంధువులు. కళింగాన బంధువులు వైరులు అనే శాసనాధారాల్లేవు.

పశ్చిమ చాళుక్యులు తూర్పునా పాలించారు. అలాంటి చారిత్రకాధారాలు—తూర్పున పాలించిన వైనం పశ్చిమ గాంగ కదంబులకు లేవు. పశ్చిమ చాళుక్యులు తూర్పున దండయాత్ర, రాజ్యస్థాపన చేసేనాటికే తూర్పున గాంగులున్నారు.

కళింగాన తొలిగాంగులు హరిసేనుని కాలాన గాకున్నా రాష్ట్రకూట దండయాత్రల్లోనచ్చి స్థిరపడిన వారైయ్యుందురా?

కళింగ గాంగులు 'గంగారిక్షిస్' కారు. కర్ణాటక ప్రాంతీయు లనేందు కాధారాలు చాలా ఉన్నాయి. కర్ణాటక ప్రాంతాల్లో పశ్చిమ కనుమల ప్రాంతాల్లో పరశురాముని కథ, గోకర్ణ క్షేత్రం, హాలసిగి (పాలాశికా), తలక్కాడు, పర్ణాపురం, వైజయంతి పట్నాలున్నాయి. మధుకేశ్వరుడూ ఉన్నాడంటారు, కాని మైసూరుప్రాంతాల మిత్రుల కాపేరే తెలియదని వ్రాసారు.

కళింగాన దేవుడు మధుకేశ్వరుడు, గోకర్ణేశ్వరుడుగాక పట్టణక్షేత్రనామాలు కర్ణాటకవు పోలికల్లో గోకర్ణ, జయంతి, పలాస (పాలాసిక), తాళ్ళేరు (తలక్కాడు), పర్లాకిమిడి (పర్ణాపుర)యేగాదు, వృక్ష సంబంధంగా, స్థలనామా లనేకం వున్నాయి గార, పాలూరు, బొబ్బిలి, నివ వగైరా.

కర్ణాటానగాని, కళింగానగాని గంగానది లేదు. ప్రతి జీవనదీ గంగానదియే నదీప్రాంతాల వ్యాపించిన నాగరికత గుర్తించినవా రెరుగుదురు—పూర్వం జలం విలువ. కొండవాగులుకూడా గంగ, కులనదులైనాయి. శ్రీనాథుడు గోదావరినే గంగ యన్నాడు. కళింగ గాంగ శాసనాల్లో గంగ యనబడినది వంశధారా (కుల) నదియే— ఆదిమజాతుల్లో గంగ అంటే నది. నది పేరు (గంగ, కృష్ణ, గోదావరివలె) మాత్రంగాదు.

మయూర శర్మ—పల్లవరాజ్యం, ఆ చరిత్ర కలిపయుకాల కథనంచూస్తే కాదంబులకు కదంబ వృక్షం సంకేతం—గోత్రం (totem): కులవృక్షం. దేవక్ అంటారు. ఆంధ్ర అంటె ఆంటరూ అన్నట్లే

కదంబ అంటే మిశ్రమం, సామూహిక సమావేశం—కడిమిచెట్టు.

నదివలె పూర్వజనాంగంలో వృక్షానికీ ప్రత్యేకత వుండేది. శాతవాహనులు సాంకేతికంగా శాతవాహ, ధాన్యపుకంకి (ధాన్యపు కటక) అనే భావాలున్నాయి. చెట్టుపేరిటి జాతులూ, వర్గాలూ చాలా ఉన్నాయి.

కదంబ వృక్షాలు మూడు రకాలు. అశోక వృక్షజాతి. ఒకరకం కడిమిచెట్టు పండ్లు తింటారు. అది కొంకణ (గోవా) ప్రాంతానమాత్రమే ఉందట. మరో రకం నివ. శ్రీకాకుళం జిల్లాలో 'నివగాం' గ్రామాలు చాలా ఉన్నాయి. పశ్చిమాన కల్యాణి చాళుక్యుల శాసనాల్లో 'కదంబ పురి' ఉన్నది. కళింగ గాంగశాసనాల్లో '...నివగ్రామ...శ్రీ మధుకేశ్వరాయ...' జయంతిపురం—ఈ ముఖలింగమే గావచ్చును.

పశ్చిమగాంగుల దైవంకూడా వైజయంతీ క్షేత్ర గోకర్ణేశ్వరుడేనట. వీరు జాహ్నవేయులము, ఇక్ష్వాకు సూర్యవంశీయులము, కాణ్వాయను (గోత్ర) లము అన్నారు. పద్మావతీ భిక్షులు, జైనులు. వీరాదిలో రాయలసీమలో గంగపేరూరునుండి వలస పోయినవారనే వాదం ఉంది.

పశ్చిమగాంగుల 'పన్నాట—పున్నాట' తూర్పున కాన్పించదు. తూర్పున పై వంశం, గోత్రం కాదు.

శాతకర్ణుల తర్వాత హారీతీపుత్ర, మానవ్య గోత్రులమన్నవారు చుటుకుల శాతకర్ణులు (నాగ), వాకాటకులు. కుంతలకదంబ—జాహ్నవేయ చాళుక్యులూ మానవ్యగోత్రులమన్నారు. 'హారీతి'లో బౌద్ధసౌర సంబంధా లున్నవి.

కళింగగాంగుల్లో పై సందర్భం లేదు.

పశ్చిమ గాంగులు నందగిరినాథులమన్నారు, కోలాహలపురాన్ని పేర్కొన్నారు.

కళింగగాంగుల్లో, ముఖ్యంగా కులకథను కొండంతచేసిన చోడగంగు శాసనాల్లో కూడా కోలాహలపురం ఉంది; వంశ పురుషుల్లో ఒకడు కోలాహలుడు. (కోలాల, కోవలాలపుర). అది మైసూర్ కోలారు అని కొందరూ, మహారాష్ట్రలోని కొల్హాపూర్ అని మరికొందరూ నమ్మారు. కళ్యాణి చాళుక్య కుమారసోమేశ్వరుని కొలనుపాక శాసనంలో, త్రిభువన మల్లుని అలవానివల్లి శాసనంలో—కోలాళపుర, కోళూరు నవపురా లున్నాయి. ఈమాత్రం మేనమామ పోలిక లున్న ఊళ్ళ కొల్లూరు, కోళూరు, కొల్లాపురం ఆంధ్రరాష్ట్రంలోనూ కొల్లలుగానే ఉన్నాయి. కోలాహలంగాఉండే పెద్దపట్నం, వర్తకకేంద్రం ఏదైనా కావచ్చును. కాని అది చాళుక్య సంబంధం అనిపించక పోదు. కోల—స్మృతి సాహిత్యంలో వరాహం—ఆది చాళుక్య లాంఛనం. బహుపురాతనకాలాన—చాళుక్యులకు పూర్వకాలాన్నే వరాహం రక్ష (తాయత్తు—Mascot, Talisman) గా వీరులు ధరించిన చిహ్నం.

వేంగీ చాళుక్యులను జూచి చోళు లనుసరించి నట్లే—చాళుక్య చోళగాథలు చోడగంగు వాడుకున్నాడా అనిపించేందుకు పై విషయాలుగాక ఇంకా చెప్పుకోదగ్గవి వుండకపోవు.

* * *

నేటివలె కులం అనేది గతంలో రాజకీయంగా రాజులమధ్య కంచుకోటగా ఉన్నట్లు కన్పించదు. అదే క్షత్రియోపేత బ్రాహ్మణులు, బ్రాహ్మణోపేత క్షత్రియులుగా చాళుక్యయుగం వరకూ చరిత్రకారులు గీచినగీటు. మన ధర్మశాస్త్రాలు చూడండి. బ్రాహ్మణ క్షత్రియులు సమాజంలో ప్రత్యేకత — హక్కులు ఏర్పర్చుకొన్నారు. కాగా 'కాంక్రీట్' గోడ పెట్టారు. నదీమూలం, రాజజన్మకథా తెలియగోరరాదు. గత చరిత్ర చూస్తే పుట్టుకకు ఎవరైనా గావచ్చును. 'శంఖునపోస్తేనే తీర్థం' అన్నట్లుగా బ్రాహ్మణులు లేనిదే రాజుకూడా కొరగానివాడే—వారు దయదలచిన ఆ రాజు సాక్షాత్తు ఏ గవోని (సూర్యచంద్ర)కో వైదిక దైవానికో 'పుట్టినా' డనిపించే కథ. ప్రజాస్వామ్యంలో 'ఓట్లు' శాఖలపంపకం మించిన అవసరం రాజుల మంత్రాంగంలో బ్రాహ్మణులు. వారే నాటి మేధావివర్గం, అన్నీ తెలిసినవారు. తంతు తతంగాలు, మంత్రాలు తంత్రాలతో నాటి సమాజానికి అత్యవసరమైనవర్గం—'రాజు తలచిన దెబ్బలకు కొదవ' ఉండకపోయినా బ్రాహ్మణుడు తలచిన రాజులూ, వారి రాజ్యాలూ క్షణికాలైన కథలూ, చరిత్ర ఉండనే వున్నవి. బ్రాహ్మణులపై క్షత్రియుల తిరుగుబాటు జైనము బౌద్ధము.

కళింగ గాంగు లెవరైనదీ చివరన చూదాం— ఆదిలో 'గంగామలకులం' వారిమన్న తొలిగాంగులు ఆయుధోప జీవనంలో వీరులు, రాజులు అయిన బ్రాహ్మణులేమో అనే సందేహం. వీరు పూర్వుల గూర్చి గొప్పలు చెప్పుకోలేదు శాసనాల్లో దాన గ్రహీతల గోత్రాలున్నాయేగాని శాసనకర్తల గోత్రాలు పేర్కొనబడలేదు.

శాసనాధారంగా తొలిగాంగుల్లో మొదటి వాడుగా గుర్తింపబడినది జిర్జంగి (టెక్కలి—ముఖ లింగం రోడ్డు) శాసనకర్త. ఇంద్రవర్మ. ప్రథమ త్రికళింగాధిపతి—సుమారు క్రీ. శ. 537. ఈ రాజు 'గంగామల కుల గగనతలసహస్రరశ్మి'—గంగ (నది) వలె పవిత్రమైన కులము అనే ఆకాశంపై సూర్యుని వంటివాడు. రాజధాని 'అమరపుర ప్రతిస్పర్ధి శ్రీ మద్దంతాపుర'ము. దేవుడు మధుకేశ్వర, గోకర్ణే శ్వరనాముడుగాక 'పరమేశ్వరుడు'.

పృథ్వీమూలుని గోదావరి శాసనంలో 'ద్విజా తాన్వయ పయోధి సంభూత సితరశ్మి' అనీ, 'అనేక చతుర్దంత గజఘటా సంఘట్ట ప్రాప్త విజయు' డనీ పేర్కొనబడిన ఈ ఇంద్రశర్మ వేంగీ విష్ణుకుండిన ఇంద్రభట్టారకవర్మ సమకాలీనుడని పరిశోధకాభి ప్రాయం. తండ్రి మణల్కుడి మిత్రవర్మ. తెలుగు ప్రాంతాన్ని (కళింగ) తెలుగురాజులైన గాంగుల్ని ఉత్కళుల జేసినట్లే కొందరు ఈ మణల్కుడి సంబంధంగా తమిళప్రాంతాల్లో ఊహించారు. చారిత్ర కంగా 'కుడి, కోడు' అంత్యాక్షరనామప్రాంతాలు ఆంధ్ర కర్ణాటకాల్లో లేకపోలేదు. పాత కుడి, కుటుంబి, కుంభి వగైరా ఒకటే అర్థం; రైతు. రట్ట కుడి—రాష్ట్రకూటపదవీ సూచనాశబ్దంలో ఆయుధ ధారణగల భూస్వామి (రెడ్డి) అర్థం ఉంది.

వేంగి ఇంద్రభట్టారకవర్మ బిరుదావళితో వ్యవహరించినవారిలో నీ ఇంద్రవర్మగాక త్రైకూటక కాలచురిరాజు ప్రతాపశీలుడూ ఉన్నాడు. అంటే ఇద్దరూ కలిసి క్రీ. శ. 530 ప్రాంతాల్లో వేంగీ విష్ణుకుండిన దండయాత్ర తిప్పికొట్టివారనాలి.

క్రీ. శ. 6 వ శతాబ్దం శాసనంలో అనంత వర్మపుత్ర దేవేంద్రవర్మయే ప్రప్రథమంగా మహేంద్ర



మధుకేశ్వరాలయం : తూర్పువైపున నదీదైవతం

గిరిపైనున్న గోకర్ణేశ్వరుని కులదైవంగా పేర్కొ న్నట్లు తోస్తుంది.

తొలిగాంగులందరూ 'సకలభువన నిర్మాణైక సూత్రధారస్య భగవతో గోకర్ణస్వామి నశ్చరణ కమల యుగళ' భక్తులనున్నారు. గాంగశకం 80 నాటి ఉర్లాం శాసనకర్త హస్తివర్మ రాజధాని 'సర్వర్తు సుఖరమణీయాద్విజయ కళింగనగరం'కాని దంతాపుర మనలేదు. తొలిగాంగుల్లో కొందరే త్రికళింగాధి పతులు. రాజధానులు రెండున్నవో, రెండూ ఒకే రాజధానికి చెందినవో అనిపించేట్లు కొందరి శాస నాలు దంతాపుర కళింగ నగరాలనుండి వెల్వడి వున్నాయి. వీరి పేర్లలో ఇంద్ర, హస్తి, దేవేంద్ర— అన్నీ ఇంద్ర సంబంధంగా ఉన్నాయిగాని పశ్చిమ గాంగుల పేరు పోలికల్లేవు.

చీడివలస (గాం. శ. 397) శాసనకర్త దేవేంద్రవర్మయే ప్రప్రథమంగా పూర్వులను పేర్కొ న్నట్లు తోస్తుంది. ఈతడు 'గాంగకుల చూడామణి

సకల కళింగాధిరాజు', కళింగ నగరవాసి. ఇతని ముత్తాత వజ్రి; తాత మారసింహుడు; తండ్రి మహారాజాధిరాజ పరమేశ్వర భూపేంద్ర వర్మ; రాజధాని దంతాపురం. వజ్ర, మారసింహులు చోడగంగు కతిపయకాలపు శాసనాల్లో పేర్కొనబడినారు.

శ్వేతకాధిష్ఠాన (శ్వేటక) రాజధానిగా పాలించిన మరో కుటుంబంకూడా గంగామలకులజులమన్నారు. పశ్చిమగాంగ, కదంబ, చాళుక్యులవలె నందగిరినాథులమన్నారు. కోలాహలపురాన్ని పేర్కొన్నారు. కళింగనగర–దంతాపుర గంగామలకులజుల ప్రశస్తిలో పైసందర్భం కన్పించదు.

క్రీ. శ. 11–12 శతాబ్దాలనాటి (వనే) శాసనకర్తలు ఇంద్రవర్మ, సామంతవర్మ, పృథ్వీవర్మల రాజధాని శ్వేతకాధిష్ఠానం–శ్రీకూర్మం, మరో పేరు శ్వేతగిరి. కాబట్టి ఈ రాజధాని నేటి సాలిహుండాం, శ్రీకూర్మం, సింగపుర ప్రాంతీయం కావాలి.

శాసనలిపి పరిశోధకుల తొలిగాంగులను వేంగి పాలంకాయనులను ఒక తరగతిగా, మలిగాంగులు వేంగిచాళుక్యులను మరో తరగతిగా గుర్తించారు.

గంగానామాన్వయులమన్న మలిగాంగుల రాజ్యపాలనారంభం క్రీ. శ. 8 వ శతాబ్దంగా కొందరి నమ్మకం. వీరు క్షత్రియులుగా పరిగణింపబడినారు.

కళింగగాంగులు ఒకేకాలాన రెండు మూడు వేర్వేరు కుటుంబాలవారు శ్రీకాకుళంజిల్లా పరిసర (గంజాం–కొరాపుట్) ప్రాంతాల్లో రాజధానులుగా పాలించారనిపించేట్లు ఉంది.

కళింగగాంగుల్లో గాంగశకగణనలో వెల్వడిన చివరి శాసనం గా. శ–528 (క్రీ. శ. 1036) నాటిది. కర్త మధుకామార్ణవుడు. తర్వాతి రాజు అన్న (ఇమ్మడి కామార్ణవ) కొడుకైన ముమ్మడి వజ్రహస్తదేవ (క్రీ. శ. 1037–70) రాజు చాలా బలవంతుడు– 'త్రికళింగ మహీభుజం, గంగా నామాన్వయ మూలస్తంభం'.–విక్కాలవలస వగైరా శాసనాల్లో ఈ రాజే తాము చంద్రవంశ్యులమనీ, ఆత్రేయగోత్రజులమనీ చెప్పుకొన్నాడు. ఈయన శాసనాలు దంతాపుర, కళింగ నగరాలనుండి వెల్వడినాయి.

ఈ రాజు నాటికి కళింగగాంగులు వెల్వివిరిసినట్లున్నది, ప్రఖ్యాతులైనట్లున్నది. ఇతర రాజులవలె శాలివాహన శకపరిగణన–

మలిగాంగులు సుప్రసిద్ధులూ, విస్తృతరాజ్యపాలకులూ కాగల్గిన కారణం కోసలగుప్తులూ, కొవ్యోధ (గంజాం, పురీ జిల్లాలు) కైలోద్భవులూ, వేంగి చాళుక్యులు అరివీరభయంకరులు కారు. ప్రక్కలో బల్లెంవంటి వేంగిరాజ్యంతోనే గాదు వైదుంబ (కడపజిల్లా), చోళరాజ్యాలతో రాజకీయ వైవాహిక బాంధవ్యాలు వున్నాయి తొలిగాంగులకు. వేంగి విష్ణుకుండినులు–తర్వాత వేంగి జటాచోడభీముడు కళింగంనుండి కాంచీనగరంవరకూ ఏకచ్ఛత్రం చేశాడు. విమలాదిత్యుని తర్వాత రాజరాజనాటినుండి కళింగగాంగులు బలపడినారు.

మలిగాంగుల పేర్లు పశ్చిమగాంగుల పేర్లను పోలవు సరికదా–పేర్లు, ప్రశస్తిలో శిలాహార చాళుక్యుల పోలిక లెక్కువ.

తొలిగాంగుల్లో మొదటివాడెవరో తెలియనట్లే (శాసనాలు) మలిగాంగుల్లోనూ మొదటివాడెవరో తెలియదు.

క్రీ. శ. 1060 నాటి కంబకాయ శాసనంలో తృతీయ వజ్రహస్త (చతుర్థ అనంతవర్మ) దేవుడు పేర్కొన్న పూర్వులు–(1) గుణార్ణవ (గుండమ) మహారాజపుత్ర వజ్రహస్త, (2) గుండమ (3) కామార్ణవ, (4) వినయాదిత్య, (5) కామార్ణవ (6) వజ్రహస్త, (7) కామార్ణవ, (8) గుండమ, (9) మధుకామార్ణవ, (10) శాసనకర్త.

మధుకేశ్వర ప్రసక్తి తెచ్చినదీ, ప్రప్రథమంగా గాంగుల బృహద్వంశ పురుషులను వివరించినదీ అనంతవర్మ చోడగంగదేవుడే ఈ రాజు క్రీ శ 1077 లో 'నగరము'న పట్టాభిషిక్తుడై విస్తృతరాజ్యపాలనా సౌకర్యానికి రాజధానిని క్రీ. శ 1 35 లో కటకము (ఒరిస్సా)నకు మార్చెను.

చోడగంగు కొన్ని శాసనాలనుబట్టి దానార్ణవ పుత్ర ద్వితీయ కామార్ణవునినాటికే నగరం రాజధానిగా ఉన్నది. అచట మధుకేశ్వరాలయం ఉంది.

ద్వితీయ కామార్ణవుని పాలనాకాలం క్రీ. శ. 1014లో ఆరు నెలలు. వేంగీ చాళుక్య రాజరాజు జీతవి జంపి యుండును.

ఇమ్మడి కామార్ణవుని తండ్రి దానార్ణవుడు ఇమ్మడి వజ్రహస్త, ముమ్మడి అనంతవర్మ అయిన అనియంక భీముడే (క్రీ. శ. 980–1014) కావాలి. వేంగీ చాళుక్య శక్తివర్మ తమ్ముడు విమలాదిత్యుడు అనియంకభీమునికి తోడ్పడినాడు.

చోడగంగు శాసనాల్లో మలిగాంగుల పూర్వులు ...మహేంద్రాచల శిఖర ప్రతిష్ఠితస్య సకల చరాచర గురోః సకలభువన నిర్మాణైక సూత్రధారస్య శశాంక చూడామణేర్భగవతో గోకర్ణస్వామినః ప్రసాదాత్ప్రాప్తైక శంఖ భేరీ పంచమహాశబ్ద ధవళచ్ఛత్ర హేమచామర...' లాంఛనాలతో రాజులైనట్లున్నది. మధుకేశ్వర భక్తులమన్నట్లున్నది.

ఈతని శాసనాల్లోని వంశావళి ప్రకారం (ముఖలింగ శాసనం కాదు) బ్రహ్మకు పుట్టినవారిలో 8 వ తరంవాడైన తుర్వసునకు గంగా (నది) దేవి ఇచ్చిన వాడే నట వీరి వంశకర్త. తర్వాత 16 వ తరం కోలాహలుడు గంగవాడిలో తనపేరిట కోలాహల పురనిర్మాణంచేశాడు. ఇతని తండ్రి ప్రగల్భుడు. తర్వాతివారిలో 81 వ రాజు వీరసింహుడు పుత్రులు కామార్ణవ, దానార్ణవ, గుణార్ణవ, మారసింహ, వజ్రహస్తులు. పైతృక రాజ్యం తిరిగి సంపాదించుకోగల్గియుండీ దాన్ని పినతండ్రికి వదలి దారిలో రాజుల గెల్చుకుంటూ (?) తూర్పునకు పోయి మహేంద్రగిరిపై గోకర్ణస్వామి వరప్రసాదమున శబరాదిత్యు (బలాదిత్య) డనే రాజునుజంపి దంతాపురం రాజధానిగా కామార్ణవుడు కళింగరాజ్య స్థాపకుడాయెనట. బహుశా ఈ కథల నాధారించుకొనే మలిగాంగులు క్రీ. శ. 8 వ శతాబ్దంనుండీ పాలించారనే నమ్మకం కల్గియుండును.

పూర్వగాథల్లో యదుతుర్వసులు జంటగా పేర్కొనబడిన జనాంగం.—మొదటివారు పార్వతేయులు, రెండవవారు సాగరేయులు. మొదటివారిలోకి వచ్చే వారిలో రాష్ట్రకూటులున్నారు. గాంగులకు జలధి సత్యం ఉన్నందున వారి ఆచార్యులు తుర్వసుణ్ణి 'వెదకి పట్టి'నట్లుంది.

నగరాన్ని పేర్కొన్న చోడగంగు—అదే దంతాపురం—విజయ కళింగ నగరం అనలేదు.

చోడగంగు చెప్పకొన్న ప్రశస్తిలో కళింగ రాజ్య స్థాపకుడైన కామార్ణవుని తర్వాత తమ్ముడు దానార్ణవుడు 40, అతని కొడుకు ద్వితీయ కామార్ణవుడు 50 సంవత్సరములు పాలించినట్లున్నది. ఇది నిజమైతే శాసనకర్త వివిధశాసనాలు చూస్తే కట్టుకథలు, పెంచిన వంశావళి పద్దైరాలు కాన్పించడమే గాక మధూకేశ్వరాలయం చోడగంగుకు 2½ శతాబ్దాల పూర్వపు దనిపిస్తుంది. ద్వితీయ కామార్ణవుని తర్వాత రణార్ణవ, వజ్రహస్త, కామార్ణవ, గుణార్ణవ, పోతాంకుశ, కలింగలాంకుశులు—మరొకరు, కామార్ణవ, వినయాదిత్య, వజ్రహస్త, కామార్ణవ, గుండమ, మధుకామార్ణవులు 185½ సంవత్సరాలు పాలించాక వజ్రహస్తుడు 33, కొడుకు దేవేంద్రవర్మ రాజరాజు 8 సంవత్సరాలు పాలించాక, శాసనకర్త పట్టాభిషిక్తుడైనట్లున్నది. పై పేర్లవారు కొందరెవరి శాసనాల్లోనూ కన్పించదుసరికదా ఊహాజనితులు అవేట్లుంది.

ఇమ్మడి వజ్రహస్తుడే దానార్ణవుడైనచో, కొడుకు ద్వితీయ కామార్ణవుడు చోడగంగుకు 63 సంవత్సరాల పూర్వపు రాజు.

గాంగులు (ఒరిస్సా) కటకం రాజధాని చేసుకున్నాక ద్వితీయ నరసింహవర్మ (క్రీ. శ. 1278–1306) సెండుపట్నం శాసనంలో (క్రీ. శ. 1295) కోలాహల, గంగవాటికలను పేర్కొనుటయేగాక అదనంగా 'రూపగాంగు'ల మన్నాడు. గాంగులవంటివారనా? ఇతని లెక్కను ముమ్మడి వజ్రహస్తుని పినతండ్రి మధుకామార్ణవుడు పంచమకామార్ణవుడు. చతుర్థ నరసింహదేవుని (క్రీ. శ. 1376–1414) శాసనాల్లో చారిత్రకం, యదార్థం అనిపించే వంశావళి తృతీయ వజ్రహస్తుని పినతండ్రి మధుకామార్ణవుని నుండే ప్రారంభం.

* * *

కళింగనగరం అనే రాజధాని వివిధకాలాల్లో వివిధప్రాంతాలకూ ఏకకాలాన రెండు మూడు రాజ

ధానులకూ వ్యవహృతమైనదా అన్న సందేహాలున్నాయి. క్రీ. శ. 7 వ శతాబ్దంలో వచ్చిన చీనా యాత్రికుడు మోక్షదేవుడనే భారతీయ నామధేయుడు యువాన్‌ఛాంగ్‌నాటికే కళింగరాజ్యాలు రాజధానులు రెండు అని శ్రీకాకుళంజిల్లాలోనే ఉన్నవనిపించేట్లుంది.

పాలిహాండం ప్రసక్తివలె ప్రప్రథమంగా విజయ కళింగనగరం, కళింగనగరం, (కపిపం) మలిగాంగుల రాజధాని కళింగనగరం వేరు నగరికటకం—ముఖలింగం అనబడి వేర్వేరైన గ్రామాలేఅన్న ఖ్యాతి స్వర్గీయ గిడుగు రామమూర్తిగారిది. అదే చోడగంగు శాసనాల్లో ద్వితీయకామార్ణవునినాటి నగరం అనే పురం.

ఏ శాసనంలోనూ స్థలనామం ముఖలింగంఅనీ, దేవుడు ముఖలింగేశ్వరుడుఅనీ లేదు. పాతపట్నం తాలూకాలోగల ఈ గ్రామం రాష్ట్రవిభజనాత్పూర్వం పర్లాకిమిడి సంస్థానానిది.

మలిగాంగుల శాసనాల్లో మధుకేశ్వరుడనే పేరు వ్యాప్తంలయినా స్థలపురాణాల్లో, మాహాత్మ్యాల్లో పేర్కొనబడిన జయంతీశ్వరుడూ, గోకర్ణేశ్వరుడూ ఈ దేవుడే—

శాసనాల్లో - (1) నగరే మధుకేశ్వర (2) నగరాన మధుకేశ్వరదేవర (3) కళింగనగరాత్...త్రికలింగదేవర (4) కలింగావనినగరే శ్రీమన్మధుకేశ్వరాయ శర్వాయ (5) సప్తగ్రామ ముద్దరపలి గంగకలుత శ్రీ మధుకేశ్వర (6) కలింగదేశనగరే శ్రీ మధుకేశ్వరాయ (7) గోకర్ణే మధుకేశ్వరాయ (8) నివగ్రామ...సురగణగురవే శ్రీ మధుకేశ్వరాయ (9) విక్రమస్కంధ...మధుకేశ్వరాయ (10) నగరావపీటి మధుకేశ్వర (11) నాగరభాషీయ మధుకేశాయ (12) త్రికలింగావనినగరే మధుకేశ్వర (13) నగరావ మధుకేశ్వర (14) నగరే కళింగదేశే స్వయంభువే మధుకేశ్వరాయ (15) గాంగవిశ్వేశుండగు మధుకేశ్వరదేవర (16) త్రికలింగదేవర (17) కులవంతనియ నకరువ వీటి మధుకేశ్వర (18) గాంగవిశ్వేశ్వర మధుకేశ్వర త్రికలింగదేవర (19) కళింగనగరాత్ గోకర్ణస్వామి.

పై విషయాలనుబట్టి నేటి ముఖలింగం గతంలో నగరం, సప్తగ్రామ, నివగ్రామ, గోకర్ణ, విక్రమ స్కంధపుర, నకరం అనే పేర్లు గలది అనీ, దగ్గరి వంశధారానది గంగ, కులవంతని యనబడెననీ, దేవుని పేరు గోకర్ణేశ్వరుడు, మధుకేశ్వరుడనీ తెలుస్తుంది. విజయపురి అనే పేరు ఉన్నట్లుంది. విక్రమస్కంధా (వార)పురంఅనే పేరు చోడగంగు బిరుదుమండే ఏర్పడియుండును. కాగా రాజధాని నతడు కటకానికి మార్చినతర్వాత ముఖలింగం పైనికస్థావరం (కంటోన్మెంట్)కూడానేమో అనిపించును.

కాగా 'వీడు, వీటి' శబ్దాల్లో అర్థం కూడా అదే—బనా 'వీడు'లో ప్రాంతం, జనపదం, దేవాలయం అర్థాల్లేకపోలేదు. కళ్యాణి చాళుక్యుల కన్నడ శాసనాల్లో 'వెలవీడి'వలె చర్చనీయాంశం.

'నగరి'లో దేవాలయం అర్థంకూడా ఉంది. కాని కొర్నిశాసనం దీన్నే నగరంలవేపురం అన్నది. భూపేంద్రవర్మ పుత్రుడు దేవేంద్రవర్మ (చీడివలస శాసనకర్త)నాటికి 'కోలువర్తని'లో కలింగ నగరాన అనేకదేవాలయా లున్నట్లున్నది. శ్రీకాకుళంజిల్లానువరాహవర్తని అన్నారు. కోల అర్థం వరాహం. కాని 'కోలువర్తని, కులవంతని, కులవర్తని'ప్రాంతం వంశధారానదీ పరివాహకప్రాంతం. కోలువర్తనిలో పెద్ద మండలం అర్థం ఉందేమో! క్రోష్టుకవర్తనిలో అటవీప్రాంతం సూచితం.

'నకరం' నగర వికృతిగాక నకరం ఐతే పూర్వమది వర్తకధర్మాసనకేంద్రం అనాలి. మధుకామార్ణవుని (క్రీ. శ. 1024) శాసనంలో, తర్వాత తృతీయ వజ్రహస్తుని శాసనంలో వైశ్యుల కగ్రహారదానం చేసినట్లుంది.

నేటి ముఖలింగం చేరువ కుగ్రామం నగరి కటకం. ఇందులో రాజధానీ సూచన ఉండనేఉంది. ఖేట—కటక శబ్దార్థం పూర్వకాలపు నగర నిర్మాణం (టౌన్ ప్లానింగ్) పద్ధతుల్లో ఒకటి. ఖేట—కటక పద్ధతిలో ఎగుమతి దిగుమతులకు, వర్తకకేంద్రంగా గిడ్డంగుల నేర్పరచడం, వంశధారానదీతీరం రాజధాని నుండి రవాణాసౌకర్యం (సముద్రానికి) నగరి కటకంలో

ఏర్పాటుండివుండాలి. పోతే గాంగ బంధు సామంతో ద్యోగులైన కళింగకాదంబులు 'శేడి' శబ్దవాచ్యులు, వారికో ద్యోగులు.

'గంగానామాన్వ'యులమని ప్రారంభించిన ముమ్మడి వ్రజహస్తునినాటిమంచి కాదంబులుమాత్రం గాంగులను (శాసనాలు) 'గంగామల' కులంవా రన్నారు. ధర్మశేడి సింహపురశాసనంలో (క్రీ. శ. 11 వ శతాబ్దం) తన రాజు కళింగ నగరవాసి గంగామల కులతిలకుడు అనంతవర్మపుత్రదేవేంద్రవర్మ (చోడ గంగు తండ్రి) అనెను. దారపరాజు శాసనంలో కూడా 'గంగామల' కులజాలనే ఉన్నదట.

వంశధారానది కొరాపుట్టిజిల్లా జయపురం కొండల్లో పుట్టినట్లు విన్నాను. నాగావళి జన్మ స్థానంకూడా అదేనట. ఓఢ్రమున 'బంసో' (వంశ) అంటే వెదురు కాబట్టి వెదురు(బొంగు)నుండి పుట్టినది కాబట్టి వంశధార అయినదంటారు. సంస్కృతాన తద్భవాల్లోగూడా వెదురు వంశమే— వెదురునుండి నది పుట్టడం నమ్మకానికి చాలా దూరం. కాని వంశధారానది జన్మస్థానం గతంలో కీచకాటవి— వెదుళ్ళున్నతావు అయ్యుండాలి. కులవర్తుని, వంశ ధారపేర్లు నాకు మరో అర్థం ఇస్తున్నాయి. గాంగుల శాసనాల్లో అదే గంగ కాబట్టి వంశధారానదీ ప్రాంతీయులు—ప్రాంతీయరాజులు గంగవంశీయులమన్న కారణం — ప్రవహించిన దిక్కులు వేరైనా ఒకేకొండ నుండి పుట్టిన నదుల్లో ఒకటి వంశధార కాగా మరొకదానికి నాగావళి పేరెందుకు రావాలి!

జీవన విధానాల్లో నదుల పాత్ర ప్రాముఖ్యత బహుపురాతనం.

'శ్రీ ముఖలింగేశ్వర మహాత్మ్యం'లోనేగాదు, స్థల పురాణాలలో, జనాభిప్రాయంలో ఒక కథ వుంది. వామదేవ మహర్షి హిమాలయాన వైష్ణవ యజ్ఞం (?) చేస్తూండగా వచ్చిన గంధర్వు లచటి శబర వనితల దగుల్కొన్నారట. తత్ఫలితంగా వారిని శబరయోనుల జనింప మహర్షి శపించెనట. ఆ గంధర్వులు ఇలు కళింగాన శబరులైనారట. వారి రాజు చిత్రగ్రీవుడు లేక చిత్రకంఠుడు, లేక చిత్రగాయకుడు. రాణి చిత్ర



ముఖలింగం : మధుకేశ్వరాలయం.

చిత్కళయను జంగమరాలు, ఒంటరిగా శ్రీశైలంనుండి కాశీ పోవుచూ కళింగాటవిలో దారి తప్పెనట. అదిలో నిరాకరించినది. ఆమె చిత్రగ్రీవుని రెండవ భార్య. శబరసంప్రదాయంలో సవతు లిద్దరికీ జీవికకై మధూకవృక్షశాఖలు చెరొకటి ఇచ్చి వాటిక్రింద రాలిన పూలు ఏరుకొమ్మన్నాడట. చిత్కళకు సువర్ణ పుష్పాలు లభించేవట. సవతుల కయ్యాల్లో కొమ్మలు మార్చినా శివదీక్షాపరురాలైన చిత్కళకు సువర్ణ పుష్పాలే దొరకేవట. సవతుల కయ్యాలకు విసిగిన చిత్రగ్రీవుడు మధూకవృక్షచ్ఛేదనోద్యుక్తుడు కాగా, శంకరుడు రౌద్రరూపాన కాన్పించగా వాతడు మూర్ఛిల్లెనట. భర్త మరణించెనని చిత్తి తన వారికి చెప్పుకోగా శబరు లాయుధపాణులై వచ్చి చిత్కళను జంపబోగా నామె మొరాలకించి శివుడు సౌమ్యరూపాన సాక్షాత్కరించెనట. చిత్కళ శివైక్యము చెందగా శబరులు శాపవిముక్తులై గంధర్వులుగా నిజా వాసాలకు పోయిరట. శివుడు శబరద్వైవంగా నిలిచి పోయెనట. మధూకవృక్షమునుండి కాన్పించుటచే శివుడు మధుకేశ్వరుడాయెనట.

ఈ కథే అంటూ శిల్పాన్ని చూపుతారు. పరిశోధకులు కూడా కాబోలు అని ఊరకున్నారేగాని

ఆ శిలాఫలకం పరిశోధనీయం అనుకున్నట్లు కన్పించదు. చోడగంగుని శాసనాల్లో ఈ కథ లేదుకాని దేవునికాపేరు వచ్చిన కారణంమాత్రం ఒకటే—

చిట్టరస–చిన్నరాజు కుబ్జవిష్ణువర్ధనుని కళింగ దండయాత్ర చారిత్రకం. ఈ నగరంవరకూ వెళ్ళాడో లేదో తెలియదు. స్థలపురాణాల్లో మరో సందర్భం. కుబ్జవిష్ణువర్ధనుడు వంశధారాతీరాన విడిసియుండగా కలలో స్వర్ణకపోతం కన్పించగా ఆయన దానిని వెంబడించగా అదొక పుట్టలో దూరెనట. మర్నాడు గాలించగా పుట్ట, దానిలో బంగారం, శివలింగం లభించెనట. కుబ్జవిష్ణువర్ధనుడు ప్రతిష్ఠించెనట.

కపోతం కథ బౌద్ధజైనుల్లో ఉంది. కుబ్జ విష్ణువర్ధనుడు జైనుడు (క్రీ. శ. 615), మధుశ్వర ప్రతిష్ఠాత, ఆలయనిర్మాత, ఇతడనే చారిత్రకాధారంలేదు—ఆ పని చేసింది ఎవరో తెలిపే ఆధారం లేదు. కాని ఆలయద్వార శిల్పంలో (కుడివైపు) బాదామి చాళుక్య శిల్పాన్నిపోలే ద్వారపాలకుడున్నాడు.

మరొక కథలో కుబ్జవిష్ణువర్ధనుడుగాక ఆ రాజుపేరు విష్ణువర్ధన గజపతిగా ఉంది. కళింగరాజులనే గజపతులన్నారు. కళింగాన్ని సామంతరాజ్యంగా పాలించిన వేంగీచాళుక్యుల్లో ఆ రాజెవరో తెలియదు. విమలాదిత్యుడై యుండునా?

పూర్వచరిత్ర నెరుగక నావంటి మిడిమిడి జ్ఞానం గలవారెవరో, ఓఢ్రం సంబంధం చూపి, లింగంలో ముఖం ఊహించి ముఖలింగం అన్నారు. ఈ లింగానికేముఖమూలేదు. దేవునిపేరిట (రామేశ్వరం వలె) ముఖలింగం గ్రామనామమైనకాలం కూడా అర్వాచీనమే.

కుంతలకదంబులు వైజయంతీశ్వరులు కళింగ కదంబులు జయంతీశ్వరులు. ఇద్దరి కులదైవం గోకర్ణేశ్వరుడే కాబట్టి, మధుకేశ్వరుని మరో పేరు గోకర్ణేశ్వరుడు కాబట్టి, స్థలపురాణాల్లోని జయంతీశ్వరుడు, జయంతీక్షేత్రం (జయంతి అమ్మవారి మరో పేరు) ఈ నగరికటకి–ముఖలింగమే; శివుడు జయంతీశ్వరుడే.

స్థలపురాణాల్లో గోవిందకాన (క్షేత్రనామం)నం విష్ణుకుండినులకు, రాష్ట్రకూటులకూ, కళింగరాజ మంత్రులకూ ముడిపెట్టనక్కర్లేదు. దక్షిణకోసల—పొరుగు ఆటవికరాజ్యం—గోండ్వాణము—గోండువనము—గీర్వాణంలో గోవిందకాననమై యుండును.

ఈ క్షేత్రం 'దక్షిణ వారణాసి' అనడంలో గాంగులనాడంత ప్రసిద్ధి ఉందనక తప్పదు. కాని స్థలపురాణ మాహాత్మ్యాలన్నీ బహుపురాతనం వగైరా మాత్రం కావు.

స్వప్నేశ్వరతీర్థం – కథామాహాత్మ్యం– అసలు సంగతి; ద్వితీయ రాజరాజు (క్రీ. శ. 1170–94) బావమరదీ, సైనికాధికారి స్వప్నేశ్వరుని సంబంధం. అలాగే 'మంకుణతీర్థం'లో మహాభారతాంతర్గత కథ—అనిపించినా ఆ పేరుకు కారణం అనంగ (తృతీయ) భీమదేవుని (క్రీ. శ. 1211–38) తల్లి చాళుక్య రాజకన్య, అనంతవర్మ (తృతీయ) రాజరాజు (క్రీ. శ. 1198–1211) భార్య మంకుణాదేవియే. వామదేవ ఋషి గాంగమంత్రి వామదేవుడో, శివుని మరో పేరు సందర్భానిదో కావాలి

గాంగుల సంబంధం పుణ్యక్షేత్రాలంతటా పంచాదిగృహనాము లున్నారుట. ఈ 'పంచాది' మరి గాంగుల సమకాలీన, సమీపకాలీనమైన ఇతరుల శాసనాల్లో పేర్కొనబడిన 'పంచరాసి' వంటిది కావచ్చును స్థానాపతి, స్థానాధిపతి, ఆలయక్షేత్ర కార్యనిర్వాహకోద్యోగి.

గాంగశాసనాల్లో గోకర్ణదేవుని, క్షేత్రము పేరు–గోకర్ణేశ్వరుడు మహేంద్రగిరిపై నున్నట్లు శాసనాల్లో ఉండే ముఖలింగాన మహేంద్రగిరి లేదనుకో నక్కరలేదు. ఆ పర్వత (తూర్పు కనుమలు) పంక్తి ఎక్కడైనా మహేంద్రగిరియే—మందసా (సోంపేట తాలూకా)మాత్రమే మహేంద్రగిరి అనుకోనక్కర్లేదు

గోకర్ణ శబ్దానికి అర్థం—లేడి, కణుజు (మనుబోతు), ఓడకొయ్య. కొండకోన, కిరాత (విటపీ)రాజ్యం—వగైరా ఉన్నాయి. అవన్నీ ఈ ముఖ్య కళింగం నగరానికి అన్వయించేవే. గోకర్ణంలో అడవి


అమ్మవారు వృక్షసంబంధంగా శాకంబరి అనబడినట్లే పూర్వులు పాదపేశ్వరుడన్నారు. ఆయనే గోకర్ణేశ్వరుడు, తెలంగాణాలో 'అడివయ్య' (వనశంకర) అయినాడు.

కొర్నిశాసనంలో చోడగంగు చెక్కిన కుల కథల్లో కూడా ఈ ప్రాంతం అడవి అన్నట్లే వుంది. ఆ వంశకథల్లోనున్న మారసింహుడు కళింగంలో చారిత్రక పురుషుడుగా కాన్పించాడు. పశ్చిమ గాంగుల్లో మారసింహుడు మహావీరుడు, చారిత్రక పురుషుడు. తూర్పుకు రాలేదు. ఆ శాసనాల్లో యదుతుర్వసులు-యాదవులైనరాష్ట్రకూటులూ, తుర్వసు సంబంధం చెప్పుకొన్న గాంగులూ ఒకేమూసలోవారై యుందురా? తురు(పస) గోపాలురే - యదుతుర్వసులు. పాలు, పెరుగు, నేయి సంబంధం గాధ లున్నాయి. ఇదో విశేష వైవాహిక సంజనితం అయినా కావచ్చును. గంగామల కుల (విప్ర)కన్య గంగానామాన్వయు (క్షత్రియు)ల ఇంటి కోడలైనదా?

కాళింగులనే వారు శ్రీకాకుళం పరిసరాల్లోనే అధికసంఖ్యాకులు గాంగుల తర్వాత గజపతుల కాలాన ఇతర ప్రాంతాలకు వ్యాపించారు. పశ్చిమగోదావరి జిల్లాలో రెండుమూడు స్థలాల్లో వున్నారు.

కళింగబ్రాహ్మణ, కళింగ కోమటి (వైశ్య.) కాళింగులు (క్షత్రియ/శూద్ర) అందరూ మాంసాహారులే- చతుర్వర్ణాలు కారు.

కళింగ ప్రాంతీయాచారంలో స్త్రీలు కులం, అంతస్తు వగైరా ఏదైనా-రవిక తొడగరు. రవిక తొడిగినామె రూపాజీవ అనే వ్యవహారం.



ఓ చెట్టూ-రెండే పువ్వులూ

నాటిక

రామానుజం	రాజు
చలపతి రావు	సత్యం
మాధవరావు	గీత
వేణు	సుగుణ

శ్రీ గొల్లపూడి మారుతీ రావు

రెండవ రంగము

మరుచటిరోజు ఉదయం.

చలపతిరావు భారతం చదువుకొంటున్నాడు. సుగుణ అతని బ్రష్‌లన్నీ కడిగి శుభ్రంచేస్తోంది. వల్చటి నీలిరంగుచీర కట్టుకొనివుంది. నుదుటికి బొట్టులేదు. కాస్త బొద్దుగా విందుగావుంది. మనిషిలో పట్టుదల, గజిబిజికి తావులేని ఆలోచన, నిశ్చయంగల మనిషిలా కనిపిస్తుంది. రామానుజం లోని, చలాకీతనం Sense of Humour ఆమెకూ వచ్చాయి. పనిచేస్తూ ఒక్కసారి తలెత్తి అతనివేపు చూసింది.

సుగుణ : అక్కడ వున్నది పదిహేనురోజులేకాని, పది హేను యుగాలయినట్టనిపించింది మావయ్యా!

చల : ఎందుకో చెప్పనా?

సుగు : (నవ్వుతూ తలెత్తి) ఏదీ, చెప్పు చూదాం.

చల : మీ మావయ్యలాంటి ఏడుపుగొట్టువాళ్ళు కని పించివుండరు. దుఃఖాన్ని మరిపించే నీ మాటల అవసరం ఎవరికీ కలిగివుండదక్కడ. అంతేనా? (నవ్వి) మంచివాళ్ళకి మంచిపని చెయ్యకపోతే తోచదమ్మా!

సుగు : అలాగా! నువ్వు కవిత్వం ఎందుకు రాయ లేదు మావయ్యా?

చల : అం. చదువుకున్నవాళ్ళని బాధపెట్టడం యిష్టంలేక. (ఒకరి ముఖం ఒకరు చూసు కుని నవ్వుకున్నారు.) మాధవరావుకి డబ్బు అవసరమట. ఊరికే తొందరపెడుతూనే వున్నాడు. నువ్వు వెళ్ళావు. నా కుంచె సాగడంలేదు ఇక వచ్చావుకనక తొందరగా ఈ పని ముగించేస్తాను.

సుగు : (దగ్గరకువచ్చి Pallete, కుంచె అందిం చింది.) ఎలా వుందిట పద్మ!

చల : పద్మకి కాదమ్మా జబ్బు.

సుగు : మరి?

చల : నాకు. నా చేతకానితనంఅనే రోగాన్ని-అక్కడ వదిలేసి, ఇక్కడ నన్నూ వుంచి కుదురు స్తున్నాడు మాధవరావు. ముందే ఊహించి వుంటే యింత తెలివయినవాణ్ణి అల్లుణ్ని చేసుకునేవాణ్ణి కాదు.

సుగు : పోనీలే మావయ్యా-ఇప్పుడేమయింది? పద్మ నీ కళ్ళముందు పెరిగింది; నీదగ్గరే వుంటుంది. ఇల్లరికంవుండే అల్లుడు కలిసొచ్చాడు.

చల : కన్నీరు కారుస్తున్నవాడినికూడా నవ్వించి, నవ్వించే మంచితనం నీకు భగవంతుడిచ్చా డమ్మా-ఆ గీతేమో నా మాట పట్టించు కోదు. నువ్వు నా పెద్దకూతురివైనా కావలసింది.

సుగు : కోరుకొంటే పెద్దకోడలి నవకపోయేదాన్నా మావయ్యా!

చల : (తుళ్ళిపడి) అవునమ్మా-నా కోరిక తీర లేదు. నిన్ని యింట్లో చూసే అదృష్టం నాకూ, యింటిదానిగా చూసే భాగ్యం వాడికీ లేకపోయింది. అంతా దురదృష్టం.

సుగు : తప్పు వాదికూడా ఉందిలే మావయ్యా !

చల : నీదేముందమ్మా—వాడు—ఆ రాజాకీ ఏకాస్తయినా తెలివితేటలుంటే—

సుగు : రాజా ననుకుని ఏం లాభం. నేను అతన్ని అనవసరంగా (అంతలో ఆగి) పోనీలే—ఇప్పు డెందుకా ఆలోచనలు.

(సత్యం వచ్చాడు. బట్టలు మాసివున్నాయి. వాళ్లిద్దరూ అక్కడ వున్నారని గమనించికూడా, చూసీచూడనట్టు లోపలికి నడవబోయాడు.)

సుగు : (మాటమార్చే ఉద్దేశంతో) ప్రొద్దుటే ఎక్కడికి వెళ్లారు మరిదిగారూ?

సత్యం : ఏ ప్రొద్దుట? నేను బయలుదేరి 48 గంట లయింది వదినా ! ఎక్కణ్ణుంచి వస్తున్నా వని అడుగు.

సుగు : (నవ్వుతూ)పోనీ, ఎక్కణ్ణుంచేమిటి?

సత్యం : మార్వాడీ దగ్గర్నుంచీ.

చల : (అనుమానంగా) ఎందుకురా !

సత్యం : అవసరంగా వెయ్యి రూపాయలు అప్పు కావలసి వచ్చింది.

చల : నీకా !

సత్యం : ఏం నేను మనిషిని కానా? (ఇప్పుడు మాధవ రావు వచ్చాడు.) నేనూ బ్రహ్మాండంగానే చలువ చేసిన బట్టల్ని వేసుకోగలను. నా కాళ్లూ ఫస్టుక్లాసయిన Flex బూట్లకి మొరా యించవు. వెస్టరన్ స్టయిల్ టెరీకాట్ సూట్ వేసుకోవడానికి నా శరీరమూ తిరగ బడదు. చదువు పెద్దగా లేదంటావా?—ఆ మాటకువస్తే బావకుమాత్రం వుందేమిటి? చూడు బావా? నాన్న పిచ్చితనం? (చేతిలో వున్న ప్యాకెటు కుర్చీమీద పెట్టాడు.)

సుగు : (నవ్వొస్తోంది.)

చల : అయితే యివన్నీ కొని సంతోషించాలనేనా అప్పు చేశావ్?

సత్యం : భయపడకండి నాన్నా—ఆ సంతోషం ఖరీదు మీా రిచ్చుకోనక్కరలేదు. బొమ్మలువేసి బాకీలు తీర్చే మావగారిని సంపాదించుకున్న అదృష్ట వంతుణ్ణికాదు నేను. (లోపలికి వెళ్లబోయి, అంతలో ఆగి) సత్యం మాటలో నిజం ఎంత వుందని ఆశ్చర్యపడుతున్నావా బావా? ఓ సహా యం చెయ్యి. మరో గంటలో మోషిన్ బ్రదర్స్ సరుకులన్నీ తీసుకొని, యింటి దగ్గర స్పెషల్‌గా డెలివరీ చేస్తారు. నేను లోపల వుంటాను. వస్తే గుర్తుచెయ్. (వెళ్లబోతూ ఆగి) ఆసుపత్రికి వెళ్లడానికి నీకో కోటు అప్పుగా యిస్తాలే.

(లోపలికి వెళ్లాడు. క్షణం నిశ్శబ్దం. మాధవ రావు పాలోచనగానే గడ్డం సవరించుకొన్నాడు. ఇద్దరి ముఖాలూ చూశాడు. చలపతి ముఖంలో దిగులూ, చికాకూ కనిపించాయి. సుగుణ నవ్వాపుకోవడానికి ప్రయత్నిస్తోంది.)

చల : వీడికి రానురాను మతి చలిస్తోందమ్మా !

మాధ : అబ్బే ! నన్ను చూస్తే అతనికి కాస్త సరదా—బావనికదా (దగ్గరకువచ్చి) ఏమిటి? సూట్లూ, బూట్లూ అంటున్నాడు. ఉద్యోగం దొరికిం దేమిటి?

చల : అదొక్కటేతక్కువ వాడిమొహానికి?

సుగు : ఎవరో మార్వాడీదగ్గర అప్పు తెచ్చాట్ట అన్నయ్యా.

మాధ : ఎంతట?

సుగు : నాలుగువేలు.

చల : అమ్మా—నువ్వూ వాడి మాటల్ని నమ్ము తున్నావా?

మాధ : ఆహా ! సత్యం తెలివితేటల్ని అలా తీసి పారెయ్యకండి. అంత డబ్బు అప్పు తీసుకు రాగలిగితే మంచిదే. అవసరానికి పనికొస్తుంది. ఓ అయిదువందలయినా అడిగితీసుకోండి. లేక పోతే అదీ ఖర్చు చేసేస్తాడు.

సత్యం : (ఈ మాట అంటూంటే వచ్చాడు. అతణ్ణి చూసి మాధవరావు ముఖం తప్పించుకున్నాడు.) తమాషా చూశావా బావా ! ఎంత ప్రయ త్నించినా వెయ్యి రూపాయలూ పూర్తిగా ఖర్చు

చేయలేకపోయాను. (సరాసరి కుర్చీ దగ్గరికి వెళ్లి పాకెటు అందుకున్నాడు.) అన్నీకొన్నా యింకా మూడు పందలు మిగిలిపోయాయి.

మాధ : (చలపతివేపు వంగి) అదయినా అడిగి జాగ్రత్త............

సత్యం : (మధ్యలో ఆపి) ఆ డబ్బు నా బూట్లు పాలిష్ చేసేవాడికి నెలజీతంకింద జాగ్రత్త చేశాను బావా నీకా? అబ్బే! అంత శ్రమ ఎందుకులే (చరచరా లోపలికి వెళ్లాడు.)

మాధ : (చికాకుగా) చూశావా సుగుణమ్మా! అతని చికాకు? ఇదంతా వేనేదో ఈ యింటిమీద పడితింటున్నానని

సుగు : అబ్బే—ఈ యింటిమీదపడి తినవలసిన అవసరం ఏముందన్నయ్యా—హాయిగా ఇంట్లోనే తింటూండగా—

రామా : (వస్తూ) అమ్మా నా దువ్వెన ఎక్కడుందో కనిపించడంలేదమ్మా—లంకంతకొంప. ఎక్కడ పడేశావో—

సుగు : (చలపతితో) చూశావా మావయ్యా—తెల్లారిందిగా! అప్పుడే నాన్న హడావుడి మొదలు. ఉండు నాన్నా వెతెస్తాను.

రామా : (ఇక్కడ జరిగినదీ, వాళ్ల ముఖాలలో సీరియస్‌నెస్ గమనించక) అలా మాట అనిపించుకోవడం ఎంత అదృష్టమోయ్!— దువ్వెన దొరక్కా? ఇదిగో (చేతిలోది చూపాడు.)

మాధ : అదేమిటండీ—పాపం—చెల్లాయి—

రామా : వెదకనీవయ్యా—వెదకనీ—పోయింది వెతుక్కోవడంలోనే ఆడవాళ్ల జీవితమంతా గడిచిపోతుంది ఒక్కటీ దాచుకోలేక మగవాడి జీవితం వెళ్లమారిపోతుంది. (ఇప్పుడు చలపతిని గమనించి) అదేమిట్రా అలా వున్నావ్? సుగుణ వచ్చిందిగా—విన్నపాయంకాలం బాగానే వున్నావు?—(ఆలోచించి మాధవరావుతో) సత్యం కాని యింటి కొచ్చాడేమిటోయ్?

మాధ : ఆఁ. ఇప్పుడే—

రామా : అయితే అర్థమయిపోయింది. చిన్నప్పుడు వీడు ఒక్క లెక్కలమాష్టారుకే భయపడేవాడోయ్. పెద్దయాక వీడు ఒక్క సత్యానికే భయపడుతున్నాడు.

మాధ : భయానికేముందిలెండి.

రామా : అలా కొట్టిపారెయ్యకు. భయం ఎందుకో తెలుసా? చిన్నప్పుడు లెక్కల చిక్కులు విడదీయలేకపోయానని భయం ఇప్పుడు సంసారం చిక్కులు విడదీయలేకపోయావని భయం. అప్పుడు మాష్టారికి బెత్తం వుండేది. సత్యానికి మాటలున్నాయి. (సుగుణ వచ్చింది) ఏం అమ్మా! దొరికిందా?

సుగు : లేదు నాన్నా—పోనీ నా దువ్వెన—

రామా : ఇదిగోనమ్మా—దొరికింది. నువ్వు శ్రద్ధ తీసుకోనిదీ ఏ పనీ యీ యింట్లో జరగకూడదని నా నియమం. (రామానుజం వెళ్లబోయి, హఠాత్తుగా భోళాతనంమరిచిపోయి వెనక్కి తిరిగివచ్చి, మాధవరావుకి సూటిగా నిలబడ్డాడు.) ఎవరేమన్నా నీ అనుభవంమీద నాకు గౌరవమేనోయ్. ఒక్కటడుగుతాను. సూటిగా సమాధానం చెప్పు. ఆడది మగాణ్ణి పెళ్లి చేసుకో నందనుకో—కారణం ఏముయి వుంటుంది?

చల : ఇప్పుడు (ఏదో అనబోయాడు.)...

రామా : షటప్. చెప్పు మాధవరావు!

మాధ : ఏముందండి—అతనితో సుఖపడలేవేమోనన్న భయం.

రామా : సుఖం! (ఆలోచించి) అవును. సుఖం, వెరీగుడ్. బాగా చెప్పావు. విన్నరాత్రినుంచీ బాధ పడుతున్నాను. సరయిన సమాధానం చెప్పావోయ్. ఆడదానికి సుఖం కావాలి. అవును. సుఖమే.

(గొణుక్కుంటూ లోపలికి వెళ్లిపోయాడు)

చల : వీడికి వాలాగే పిచ్చెక్కేటట్టుంది.

మాధ : ఎందుకండీ రామానుజంగారు ఆ ప్రశ్న వేశారు?

సుగు: (ఏదో చెప్పబోయి నవ్వేసి) ఏమో! నాన్న దుద్దేశ అడగడానికి, అడదాని ప్రేమకూ ఏం సంబంధమో......

(ఎదురుగ్గా వేణూ రావడం చూసి చటుక్కున ఆగిపోయింది. మాధవరావు అటు తిరిగితే వేణూ కనిపించాడు. అందరూ హఠాత్తుగా నిశ్శబ్దం కావడం చూసి అతనూ ఆశ్చర్యపోయాడు.)

వేణు: (అందర్నీ పరికించి) ఏం అలా వున్నారు?

మాధ: (ఒక్కసారి సుగుణని చూసి) ఆడది మగాణ్ణి పెళ్లి చేసుకోవడానికి కారణ మేమిటని వీళ్ల నాన్నగారు అడిగారు యిందాక.

సుగు: (Whisper) అన్నయ్యా!

చల: చెప్పనీ అమ్మా—వేణూకి ఎప్పుడో ఒకప్పుడు తెలియాలిగా.

వేణు: ఏమిటి మావయ్యా అది.

చల: నేను నీకు మావయ్యను కాలేకపోతున్నాను బాబూ!

వేణు: ఆదేమిటి!

చల: అదంతే వేణూ—మనకి అభిమానాలేకాని, బంధుత్వాలు కలిసే అదృష్టంలేదు. ఈ జీవితంలో ఈ దౌర్భాగ్యుడు ఇలా నష్టపోవడం రెండవసారి.

(చలపతిరావు లేచి లోపలికి వెళ్లి పోయాడు)

మాధ: (ఆశ్చర్యంగా) ఎందుకలా కన్నీరు కారుస్తారు మావయ్య? ఏమయిందిప్పుడు?

వేణు: (నిశ్చలంగా) నాన్న పెళ్లికి ఒప్పుకోలేదా అక్కయ్యా?

సుగుణ: అది కాదు తమ్ముడూ.

వేణు: మరి?

సుగు: గీత ఈ పెళ్లికి.........

వేణు: గీతా?!!!

సరిగ్గా ఆ పేరు అనేసరికి గీత గుమ్మం దగ్గర కనిపించింది. అంతా నిర్ఘాంతపోయారు. కాని ఆమెకు ఆ సంభాషణేమీ తెలీదు. అంతా నిశ్శబ్దంగా ఆమెవేపే చూస్తూంటే భయపడింది.)

గీత: (ఎవరినీ ఉద్దేశించకుండా) నాన్నగారు పుస్తకం తీసుకురమ్మన్నారు. ఇక్కడ చలిగా వుందన్నారు.

సుగు: ఇదిగోనమ్మా! (అందించింది. అప్పుడు వేణూ తెచ్చిన Milk Can చూసి) పాలు తీసుకు రాలేదా తమ్ముడూ?

వేణు: పాలు విరిగిపోయా యక్కయ్యా! (గీతకి వినిపించేలాగ అన్నాడు. ఒక్కక్షణం గీత ఆగి వెళ్లబోతూంటే) కంగ్రాచ్యులేషన్స్ గీతా—

గీత: (ఆగి) ఎందుకూ?

వేణు: నన్ను పెళ్లిచేసుకునే ప్రమాదంనుంచి బయట పడ్డందుకు. (ఆమె తెల్లబోయి చూస్తే) ఇక్కడుంటే నీకూ చలివేస్తుంది. త్వరగా లోపలికి వెళ్లు.

(గీత వెళ్లిపోయింది.)

ఒక్క క్షణం నిశ్శబ్దం

మాధ: తెలివితక్కువతనంకాకపోతే విక్టేపంలాంటి సంబంధం కాదంటుందా?

వేణు: సంబంధాలకి విధినిక్షేపాలు ఎవరూ చూసుకోరు మాధవరావుగారూ—గీత తెలివితక్కువ పిల్లేంకాదు, ఈ పెళ్లి వద్దంటే లోప మేదో వాలో ఉండాలి. పాలు యివిగో అక్కయ్యా!

సుగు: (ఆశ్చర్యంతో అందుకుంటూ) విరిగిపోయా యన్నావు!

వేణు: (నవ్వి) విరిగిపోయింది వేరే ఉందిలే.

సుగు: (అందుకుంటూ) బాధ పడుతున్నావా తమ్ముడూ!

వేణు: (నవ్వి) లేదులే. నేనలా షికారుకి వెళ్లి వస్తాను.

మాధ: (అటువేపు చూస్తూ) అంతా విచిత్రమయిన మనుషులూ, విచిత్రమయిన ధోరణులూను.

డబ్బు అక్కరలేనివాళ్లెవరు, సుఖం అక్కర లేనివాళ్లెవరు — తెలివితేటలు అక్కరలేనివా డెవడు.

సుగు : సత్యంవస్తే—'మంచిచెడ్డలు అక్కరలేనివా డెవడు' అనగలడు అన్నయ్యా—జాగ్రత్త.

మాధ : నువ్వన్నావుగా ! చాలు – నువ్వే అనమ్మా— నాకేం కోపంరాదు (నవ్వుతూ అన్నాడు.)

సుగు : ఇంత శాంతాన్ని ఎలా సంపాదించుకున్నా వన్నయ్యా !

మాధ : నేను సంపాదించుకోలేదు చెల్లెమ్మా—వంశ పారంపర్యంగా వచ్చేసింది.

సుగు : అదేమిటి?

మాధ : చాలా సింపుల్ చెల్లెమ్మా ! మా నాన్న ఉన్నారు చూశావ్ ! కనడానికి పదిమంది పిల్లల్ని కని, ఒక్కరూ శుభ్రంగా చదువుకో కుండా జాగ్రత్తపడ్డారు. అదృష్టవశాత్తూ ఎనిమిదిమంది ఈ పదేళ్ళలో చచ్చిపోయా రనుకో. తొమ్మిదోవాడిని. రెండురెళ్ళుతప్ప ఎక్కువ చదువురానివాణ్ణి. నేనూ మా నాన్న పద్ధతినే అవలంబిస్తున్నాను.

సుగు : ఏమిటది?

మాధ : దేనికీ కోపం తెచ్చుకోకపోవడం—దేనికీ విచా రించకపోవడం. కోపం నాలాంటివాడికి చెల్లు తుందా చెల్లెమ్మా ! ఉద్యోగం లేనివాడికీ, తెలివితక్కువ తండ్రికి పుట్టిన 'చదువుకున్న వాడికి' చెల్లుతుందిగాని. మా ఆవిడంటే నాకు ప్రాణం. అందుకనే ఆవిణ్ణి పోషించుకో లేని నేను ఇక్కడ ఆసుపత్రిలో ఉంచాను. నేనంటే నాకు ప్రాణం. అందుకని నేనూ ఒక విధంగా ఆసుపత్రిలో—ఏది? పిచ్చాసుపత్రిలో— ఉన్నట్టేకదా? వస్తానమ్మా—ఆకలిగావుంది.

సుగు : (ఈ మాటలన్నీ ఆమెకు అర్థమయినట్టు లేదు. ఏదో ఆలోచిస్తోంది. ఇప్పుడతన్ని ఆపింది.) ఒక్కమాట అన్నయ్యా.

మాధ : ఏమిటమ్మా అది.

సుగు : ఆడది పెళ్ళిచేసుకో ననడానికి కారణం చెప్పావు? మగాడు పెళ్లి చేసుకోననడానికి కారణం ఏముంటుందన్నయ్యా ?

మాధ : (ఒక్కక్షణం ఆలోచించి) ఏముందమ్మా— డబ్బు.

సుగు : (అతన్నే గమనిస్తూ) డబ్బులేదని భయమా?

మాధ : (నవ్వి) కాదు. ఉందనే భయం. (ఆగి) ఈ ప్రశ్న ఎందుకు వేశావో నా కర్థమయింది. మగాడు ఆడదాని డబ్బుని చూసి భయపడ తాడు. ఆడది మగాడి బీదరికాన్ని చూసి భయ పడుతుంది. మొగుడితో దారిద్ర్యాన్ని పంచు కుంటానని చెప్పే పాతివ్రత్యంమీద నాకు నమ్మకంలేదు.

(వెళ్లిపోయాడు.)

సుగుణ నిశ్చేష్టురాలయినట్టు నిలబడిపోయింది. ఒకటి రెండు క్షణాలు అలా గడవకముందే రాజా లోనికి వచ్చాడు వీధిలోంచి. ప్రయాణపు బడలిక ముఖంలో కనిపిస్తోంది. కాని అందమైనవాడేనని తెలుస్తోంది. 30, 35 మధ్యవయస్సు. ఇంకా అంద గాడే. తను బతికే వాతావరణాన్ని తెలుసుకొని అందు లోనే సంతోషాన్ని వెతుక్కుని తృప్తిగా బతకడం అలవాటైన మనిషి. లేదా అలవాటు చేసుకున్నాడు. కాని ఎక్కడో ఏదో పోగొట్టుకున్న నిరుత్సాహం ఒకవిధమయిన నిర్లిప్తత కళ్లలో ఉంది. చేతిలో సంచీ ఉంది. హాండ్ బాగ్ కాదు. లోనికి రాగానే ఎదురుగా సుగుణ కనిపించేసరికి ఆశ్చర్యపడ్డాడు. ఆమె వీధినేపే చూస్తోందికాని ఇంకా తనని గుర్తు పట్టినట్టులేదు. ఒక్కక్షణం నిశ్శబ్దం. తరువాత,—

రాజా : మీరా? ఎప్పుడు వచ్చారు బెనారస్‌నుంచి?

సుగు : (ఈ ప్రపంచంలో పడింది. అతన్ని చూశాక సంతోషం. కాని మాటల్లో కనిపించ నివ్వ లేదు.) రాజా ! ఎప్పుడొచ్చావు ఊరినుంచి?

రాజా : (నవ్వుతూ బల్లమీద సంచీ ఉంచి) బాగుంది! నా ప్రశ్న నాకే వేస్తున్నారు. ఏమి టాలో చిస్తున్నారు.

సుగు : నీ గురించే.

రాజా : నా గురించా! ఆలోచించడానికి ఏముంది. (మాట మార్చి.) ప్రయాణం ఎలా జరిగింది?

సుగు : (నవ్వి) ఎలా సమాధానం చెప్పాలో తెలియక మాట మారుస్తున్నావు కదూ ?

రాజా : మీరు నా గురించి ఆలోచిస్తున్నా నన్నారు. దానికి నేనేం సమాధానం చెప్పగలను. ఆలోచించండి.

సుగు : (కొంత ఆగి) రాజా ! ఇవాళ నాకో వరం ఇస్తావా ? ఇదివరకులాగ వానికి నా డబ్బు లంచం చూపను.

రాజా : ఏమి టది ?

సుగు : మనకి జ్ఞానం వచ్చినప్పట్నుంచి నన్ను 'ఏమండీ' అంటూ దూరంగా వుంచావు. ఇవాళ జీవితాల్లోనూ, ఇద్దరం దూరమయ్యాం. ఇంక దగ్గరయే అవకాశంకూడా లేదు. పోనీ పిలుపులోనైనా నన్ను 'నువ్వు' అనకూడదూ ?

రాజా : అదా ! ఎప్పుడూ మీరది అడుగుతూనే ఉన్నారు.

సుగు : అవును. కొన్నాళ్ళు అడిగాను. పిలవలేదని అలిగాను. కోపం తెచ్చుకున్నాను. తిట్టాను. కొట్టాను. కాని ఇవాళ అడగడంలేదు రాజా! వరం కోరుకుంటున్నాను.

రాజా : ఎంత ప్రయత్నించినా నాకు అలవాటు కావడం లేదు. నన్ను క్షమించండి. అయినా అలా పిలిస్తేమాత్రం దగ్గరవుతామా ?

సుగు : (ఆలోచించి) అవునులే. నువ్వే గెలిచావు. మరెప్పుడూ అడగను.

రాజా : పరీక్షలు ఎలా వ్రాశారు ?

సుగు : బాగా వ్రాయలేదు రాజా ! ఎందుకని అడగవేం ?

రాజా : (విభ్రాంతిపోయి) ఎందుకూ !

సుగు : నీ నుంచి దూరంగా పోవాలని, వీలయినన్ని సార్లు ఫెయిలయితే వీలయినన్ని సార్లు అక్కడికి వెళుతూండవచ్చు. అలాగయినా నువ్వు దూరమవుతావు. ఆయన బ్రతికివుంటే నిన్ను తప్పించుకొందుకయినా ఇక్కడికి వచ్చేదాన్ని కాదు.

రాజా: అదే విచారం. ఆయనే బ్రతికివుంటే మీ రెప్పుడూ సుఖంగా బ్రతికేవారు. మా అందరికీ ఆనందంగా వుండేది.

సుగు : ఎక్కడో బ్రతుకుతూ అనుభవించాల్సిన నా సుఖం పోయిందని బాధ పడుతున్నావా ? ఎంత దయాపరుడివి ?

రాజా : (మాట్లాడడు. ఆమెదృష్టి తప్పించుకుంటూ ఎటువేపో చూస్తున్నాడు.)

సుగు : ఒక్కొక్కసారి నిన్ను క్రూరంగా హింసించాలనిపిస్తుంది రాజా ! నీ మనస్సుని తీవ్రంగా గాయపరిచే రహస్యం నాకు తెలిస్తే బావుణ్ణు.

రాజా : నే నిప్పటికే గాయపడ్డాను.

సుగు : నిజంగానా ?

రాజా : మీ రిలా ఇంటికి తిరిగిరావడం నాకు సంతోషంగా ఉందనుకొన్నారా ?

సుగు : లేదా నీకు? నిజంగా బాధగావుంటే ఇలా ఏమీ పట్టనట్టు తిరగగల్గుతావా? సంతోషంగా పిల్లల్నికంటూ కాపరం చెయ్యగల్గుతావా? నిస్సహాయత పేరిట ఆత్మవంచన చేసుకోవడం నీ వంశంలోనేవుంది. నువ్వు దానినుంచి తప్పించుకోలేకపోయావు.

రాజా : (ఆమె ఉద్రేకానికి భయపడి) పోనీండి ఆ విషయాలు.

సుగు : అవును. మరిచిపోవడమే నీ కిష్టం. అయినా నీతో ఎప్పుడు మాట్లాడినా మనస్సిలా వశం తప్పుతోంది. పోనీ ఒకేఒక్క ప్రశ్నకు సమాధానం చెప్తావా? మరెప్పుడూ నిన్నేదీ అడగను.

రాజా : ఏ ప్రశ్నలంటేనే నాకు భయం.

సుగు : సూటిగా నా ముఖం చూసి చెప్పాలి. డబ్బుకి భయపడా నువ్వు నన్ను చేసుకోనన్నావు.

రాజా : ఇప్పుడా విషయాలు కదపకండి. నేను చాలా అలసిపోయాను.

సుగు : (నవ్వి) ఆ విషయం ఆలోచించడానికే అలసి

పోయావే? సరిగ్గా ఆలోచించలేని నీ అస మర్థతకి ఫలితాన్ని అనుభవిస్తూ నేనెంత అలసిపోయానో ఆలోచించావా?

రాజా : (సమాధానం చెప్పలేదు. ఏం చెప్పగలడు!)

సుగు : మనస్సులో ఇన్నాళ్ళా బాధపడుతున్న ప్రశ్నకి హఠాత్తుగా ఇవాళ సమాధానం దొరికి పోయింది. తిరస్కరించావన్న కోపంతో, కసితో నాన్నగారు చూపించిన మొదటి వ్యక్తినే పెళ్ళిచేసుకున్నాను కాని తర్వాత అర్థమయింది. నిన్ను శిక్షించబోయి నన్ను నేనే శిక్షించుకున్నానని!

(గుమ్మానికి తల ఆనించి కన్నీరు కారుస్తుంది)

రాజా : బాధపడకండి.

సుగు : బాధని మరిచిపోవాలంటే ఈ ఒక్క ప్రశ్నకే సమాధానం చెప్పు రాజా! ఇంకేమీ కోరను నేను. డబ్బుకు భయపడేనా నన్ను కాదన్నావు?

రాజా : (అతి ప్రయత్నంతో) కాదు.

సుగు : మరి! మరెందుకు వద్దన్నావు? నేను అందంగా లేనా?

రాజా : (తల అడ్డంగా తిప్పాడు.)

సుగు : నీతోపాటు నేనీ అంత చదువుకోలేదా?

రాజా : అదీ కాదు.

సుగు : నామీద ప్రేమ లేకనా?

రాజా నన్నడక్కండి. నేను చెప్పలేను. (పక్కకి వెళ్ల బోతే, పులిలాగ అతని ముందుకువచ్చి అతని చొక్కా పట్టుకుంది.)

సుగు : చెప్పాలి. చెప్పకపోతే నిన్ను వదలను.

(ఆ హఠాత్పరిణామానికి అతను దిగ్భ్రమ చెందాడు. యిద్దరూ విచిత్రంగా ఒకరినొకరు చూసు కున్నారు. మెల్లగా రాజా ఆమె పట్టు విడిపించు కున్నాడు. బోనులోపడిన పులిలాగ ఆమె అతను చెప్పి నట్టు విడివడింది.)

రాజా : మీరు అర్థం చేసుకోలేరు.

సుగు : అర్థం అయ్యేట్టు చెప్పాలి.

రాజా : దుఃఖంతో గుండె పగిలి.........

సుగు : ఇంతకంటే నాకింకేంకాదు. ఇవాళ ఆ విషయం తెలుసుకోనిదే నిన్ను వదలను.

రాజా : (ధైర్యం వచ్చింది. అంతకుమించి ముఖంలో ఏదో పట్టుదల వచ్చింది) తెలుసుకోవాలని వుందా? (మొదటిసారిగా ఆమె భుజం పట్టు కొని కుర్చీలో కూర్చోబెడుతూ) అయితే కూర్చోండి. (మంత్రముగ్ధలాగ కూర్చుంది) ఈ విషయం మీ కెప్పుడూ చెప్పకూడదను కున్నాను. కాని చెప్పక తప్పడంలేదు.

(వి రా మం)

అయిదేళ్ళక్రితం మీరు పబ్లిక్‌స్కూలునుండి వచ్చినప్పుడూ ఇలాగే వుండేవారు—క్రిష్టియన్ పద్ధ తిలో బొట్టులేకుండా. చిన్నప్పట్నుంచీ మిమ్మల్ని చూస్తూనేవున్నా. ఆ రోజు మీరు నాకు కొత్తగా కనిపించారు. ఆరేళ్ల చదువూ, స్కూలు జీవితం, మిమ్మల్ని వింతగా తయారుచేసింది. ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం. నేను బయిటినుంచి వచ్చేసరికి మీరా కుర్చీలోనే కూర్చునివున్నారు.—అవును అలాగే.......

లైటు ఆరిపోయాయి.

తిరిగి వెలిగేసరికి—పదేళ్లకిందటి వాతావరణం.

సుగుణ కుర్చీలో కూర్చుని, ఏదో పుస్తకం వొళ్లో వుంచుకొని జడ ముందుకు వేసుకుని అల్లు కుంటోంది. ముఖంలో ఉత్సాహం వెల్లువిరుస్తోంది. ఇప్పుడు బయిటినుంచి రాజా వచ్చాడు. లోపల అడుగు పెట్టేసరికి కుర్చీలో సుగుణ కనిపించింది. సంతో షంతో ఉప్పొంగిపోయాడు. 'సుగుణా' అని అరిచాడు. ఆమె తుళ్లిపడింది. తలెత్తి అతన్ని చూసి సంతో షించింది. కాని అనాలోచితంగా ఒక మాట అంది.

సుగు : అబ్బ! తుళ్లిపడ్డాను బాబూ! అయినా ఏమిటా కేకలు—పల్లెటూరి వాళ్లలా.

రాజా : (ఏదో మాట్లాడాలనుకున్నవాడు నిర్ఘాంత

పోయాడు. అయినా తట్టుకొని) ఎప్పు డొచ్చావు సుగుణా ?

సుగు : కంటికి కనిపించేదికూడా అడుగుతారుకాబోలు? నిన్న వొస్తే యివాళ కనిపిస్తానేమిటి ?

రాజా : (మరింత ఆశ్చర్యం) మారిపోయావు చాలా !

సుగు : నువ్వుమాత్రం—ఇంతమనిషి నెప్పు డయా వబ్బా? చాలా అందంగా ఉన్నా విప్పుడు.

రాజా : ఓహో ; నీది యింగ్లీషు చదువుకదూ ? మనదేశంలో మగవాళ్ల అందాన్ని ఆడవాళ్లు వర్ణించరు.

సుగు : పోనీ నా గురించి నువ్వుమాత్రం చెప్పే వేమిటి ?

రాజా : అవునవును చెప్పాలి. (ఉన్నపాటున ఆమెను తనవేపు త్రిప్పుకున్నాడు, ఇప్పుడు ముఖాన్ని పరికించి) బొట్టేదీ ?

సుగు : ఎందుకూ ? అది లేకపోతే అందమే లేదా? అందం అంతా బొట్టుదే అయినా నాకా అందం వద్దు.

రాజా : 'బొట్టు' నీ ముఖాన్ని అలంకరించే అందం మాత్రమే కాదు సుగుణా, అది సంప్రదాయం లోని అందం.

సుగు : ఏమిటో ఆ సంప్రదాయం — ఇలా బుజాలు విరిగిపోయేలా ఆడవాళ్లని గుప్పిటలో ఉంచు కోవడమేనా?

రాజా : (తెల్లబోయి ఆమెను వదిలేశాడు.) సుగుణా!

సుగు : నేను చాలా మారిపోయానుకదూ! అవును. ఈ మార్పే నా కెంతో బావుంది.

రాజా : కాని నాకు బాగుండలేదు.

సుగు : (నవ్వి) అందువల్ల ఏమయినా నష్టం ఉందంటావా?

రాజా : (ఆశ్చర్యంగా) నష్టంలేదా !

సుగు : ఒకరి యిష్టాయిష్టాల్ని అర్థం చేసుకోలేని వ్యక్తుల అభిప్రాయాల్ని మరిచిపోవడంకంటె చేయగలిగిందేముంది? ఉదాహరణకి నువ్వు తొడుక్కున్న షర్టు నాకేం బాగుండలేదు. అలా చెప్పలు వేసుకుంటే నా కసహ్యం. నీలా బుజంమీద చెయ్యివేసి యింట్లో కేకలువేసే ధోరణి నాకు నచ్చదు. నన్నేం చెయ్యమన్నావు—మరిచిపోకుండా?

రాజా : అయితే నన్నూ మరిచిపోవడమే అలవాటు చేసుకోమంటావా సుగుణా? నువ్వేనా ఈ మాట అంటున్నది !

సుగు : అదిగో నువ్వు 'నువ్వు' అనడం చాలా అసభ్యంగావుంది. ఇంట్లో దాసీదాన్ని, నౌకరునీ, చప్రాసీని పిలిచినట్టు నన్ను పిలవకు బాబూ—నాకు బాధగా వుంటుంది !

రాజా : (ఒక్కక్షణం దిగ్భ్రమతో ఆమెను చూసి, చిరునవ్వు నవ్వాడు) అలాగేలే. 'మీరు' అనే అంటాను యికనుంచీ. ఇంతకాలం చదివిన నీ చదువు 'ప్రేమ'కన్నా 'గౌరవం' గొప్పదని నేర్పింది నీకు. అది నీ దురదృష్టం. ఇక నుంచీ ఎప్పటికీ నువ్వు నాకు 'మీరు'గానే వుంటావు.

(లోపలికి వెళ్ళిపోయాడు.
ఆమె దిగ్భ్రమతో చూస్తోంది.)
లైట్లు ఆరి మళ్లీ వెలిగాయి.

సుగుణ నిశ్చేష్టతతో కుర్చీలో కొయ్యబొమ్మ లాగ కూర్చుంది రాజా ఆమెకు దూరంగా—చాలా దూరంగా స్టేజీమీద వెతికితేకాని కనిపించనంత దూరంగా వున్నాడు.

చాలా సేపు నిశ్శబ్దం—ఆ తర్వాత

సుగు : అప్పట్లో జీవితంఅంటే ఏమిటో తెలీదు నాకు. ఏదో అహంకారంతోఅన్న మాటలవి. నాకన్న పెద్దవాడివి. ఔదార్యంతో నన్ను క్షమించలేకపోయావా?

రాజా : మీకులేని ఔదార్యంతో చాలాసార్లు క్షమించాను. మీకంటె మిమ్మల్ని బాగా అర్థం చేసుకున్నాను.

సుగు : ఏం అర్థమయాను నీకు?

రాజా : మిమ్మల్ని 'మీరు'అని పిలిచేంత పెరిగిపోయా రనే అర్థం చేసుకున్నాను. మీరు చదువు నుంచి తిరిగి వచ్చాక ప్రేమించే గుణంకన్నా, శాసించే గుణం ఎక్కువయిందని అర్థం చేసుకున్నాను. దయతో పలకరించే తండ్రిని కూడా మీరు కొత్తగా చూడడం అర్థం చేసుకున్నాను. ప్రేమతోచేసే పరిహాసం వెక్కిరింత అనుకోవడం, పుట్టుకనుంచీవున్న చనువు అవమానం అనుకోవడం అర్థం చేసుకున్నాను.

సుగు : (నిట్టూర్చి) అయితే అందుకనేనా—

రాజా : అందుక్కాదు. నే చెప్పాల్సింది యింకావుంది.

సుగు : ఏమిటది?

రాజా : మీరు నాకు 'మీరు' అయాక, నేను మీకు మరీ చిన్నవాడిగా కనిపించాను. ఆలోచనల్లో ఆచరణల్లో, అంతస్థులో—అన్నిటిలో దాన్ని మీరు గుర్తుచెయ్యడం మానలేదు.

సుగు : కాని వీటివెనుక—

రాజా : —అవును—మీ ప్రేమ—ఈ కృత్రిమ మర్యాదల వెనకనుంచి బయటకు రాలేక ఇరకాటంలో పడ్డ మీ ప్రేమ — చీకటి రాత్రిలో గుడ్డి దీపంలాగ—గుర్తుచేస్తూనేవుంది. ఒకరోజు—ఆరోజు ఇవాళ్టికీ మరిచిపోలేను: మీరు హఠాత్తుగా పాతమనిషి అయిపోవాలని విశ్వ ప్రయత్నం చేశారు. నవ్వొస్తోంది ఆలోచిస్తుంటే.

—లైట్లు ఆరిపోయాయి—

—మళ్లీ వెలిగేసరికి సుగుణ పగలబడి నవ్వుతోంది. కట్టతెంచుకున్న ప్రవాహంలాగ ఉంది ఆ నవ్వు. రాజా తెల్లబోయి ఆశ్చర్యంతో తృప్తితో ఓచిత్రాన్ని చూసినట్టు చూస్తున్నాడు—ఆమెను వింతగా. చేతిలో పుస్తకంవుంది:

సుగు : భలేగా మాట్లాడుతావే? ఎక్కడ నేర్చుకున్నావు. ఇలా హాస్యంగా. మాట్లాడడం.

రాజా : నామాటల్లో లేదు. మీరు అర్థం చేసుకోవడం లోనేవుంది. (మాష్టారిముందు విద్యార్థిలాగ వినయంగా సమాధానం చెప్పాడు.)

సుగు : ఇవాళ నా పుట్టినరోజు తెలుసా?

రాజా : అలాగా (సామాన్యంగా) హాపీ రిటర్న్స్.

సుగు : అంతేనా? ఏదైనా బహుమతి ఇవ్వవూ?

రాజా : —(తలెత్తి) నేనా! ఏమిచ్చేది.

సుగు : (అతన్ని సూటిగా గమనించి అతనిచేతిలోని పుస్తకాన్ని అందుకొని) ఈ పుస్తకం తీసుకోనేదా?

రాజా : —(తెల్లబోయి) అదా! అది చరిత్రపుస్తకం.

సుగు : —అయితేనేం? (పుస్తకంతిప్పుతూ) ఇందులో తాజ్‌మహల్ గురించి వుంటుందా? చెరిగిపోని ప్రేమకథలన్నీ చరిత్రలౌతాయి. అవునా?

రాజా : అసలు ప్రేమంటూ ఉంటే—

సుగు : (నవ్వి) ప్రేమమీదే నమ్మకంలేని వాడివి చరిత్రనేం సృష్టిస్తావు? — పోనీలే—నన్ను నీ సైకిలుమీద ఊరంతా తిప్పుతావా?

రాజా : అయ్యో! మీరు చాలా బరువు!

సుగు : మోయకుండానే ఎలా తెలుసుకున్నావు? (నవ్వేసి) ఆడది ఇలా మాట్లాడితే మగాడికి భయంవేస్తుంది కదూ! భయంలేదులే.—ఆకలినిగురించి మాట్లాడేవాడే భోజనముందు కూర్చునేసరికి అలిసిపోతాడు. మాట్లాడవేం?

రాజా : —నాకు ఆకలిగావుంది ఇంక వెళ్లనా?

సుగు : నాన్నగారు పెద్ద బర్త్‌డే కేక్ తెచ్చారు. తెచ్చేదా?

రాజా : వద్దులెండి.

సుగు : తమ్ముడు మంచి బనారస్ సిల్కుచీర ప్రెజెంటు చేశాడు. కట్టుకు చూపించేదా?

రాజా : ఇప్పుడెందుకు ? ఎప్పుడైనా కట్టుకోనే దేగా? కట్టుకున్నప్పుడు చూస్తాలెండి.

సుగు : మామయ్య ఏంప్రజెంటు చేశాడో తెలుసా?

రాజా : తెలీదు.

సుగు : అందమైన అబ్బాయి, అపురూపమైన

కొండలోయలో మనోహరమైన వాతావరణంలో కూర్చొని ప్రకృతినిగురించి పుస్తకం చదువుకుంటున్న దృశ్యం వేసి ఇస్తానన్నాడు. బాగుండదూ?

రాజా : చాలా బాగుంటుంది.

సుగు : బొమ్మచూస్తే నవ్వొస్తుంటుంది కదూ.

రాజా : జాలేస్తుంది.

సుగు : ఎందుకనో!

రాజా : ఎదురుగా అద్భుతమైన ప్రకృతి సౌందర్యాన్ని వుంచుకొని పుస్తకాల్ని చదివే తెలివితక్కువ. (ఇటు తల తిప్పేసరికి – చేతిలో పుస్తకంతో నిలబడ్డతనే...ఒక్కక్షణం తృళ్లిపడ్డాడు. ఆ తత్తరపాటు గ్రహించి ఫకాలున నవ్వేసింది సుగుణ) నన్ను వెక్కిరిస్తున్నారా?

సుగు : (నవ్వి) ఆమాత్రం అర్థమయితే చాలులే. పోనీ ఇలాగయినా నా అందాన్ని ఒప్పుకున్నావు, థాంక్సు (రాజ చిరుకోపంతో లోపలికి వెళ్లబోతూంటే చాలా ప్రేమగా పిలిచింది) రాజా! (తిరిగి చూశాడు) కబురు! (దగ్గరకు పిలిచింది.)

రాజా : –(నిర్లిప్తంగా దగ్గరకు నడిచి) ఇలా మచ్చిక చేసిన జంతువులాగ మగాడు మీమాట వింటే మీ కిష్టంకదూ?

సుగు : (పొగరుగా) ఎవరి కిష్టముండదు? రాజా! నా పుట్టినరోజుకి నేనే నీకు బహుమతి ఇస్తాను.

రాజా : ఏమిటి?–

సుగు : చెప్పుకో చూదాం!

రాజా : మీ రెప్పుడూ విచిత్రంగా ఆలోచిస్తారు. విచిత్రమయిన పనులుచేస్తారు. ఎలా చెప్పడం?

సుగు : మంచి వాచీ తెప్పించాను – వీణాచేత. నీ చేతి దగ్గరేవుంటూ ప్రతిక్షణం నీకు గుర్తొస్తూంటాను. ఈ వాచీ చప్పుడు గుండె చప్పుడులాగ వినిపిస్తూ ఉంటుందిట – వీణాయే చెప్పాడు. ఇలారా! (తీసి చేతికి కడుతోంది) (రాజు ఆశ్చర్యంగా ఆమె ముఖం చూస్తున్నాడు) ఏమి టలా చూస్తున్నావు. నువ్విలా కట్టే క్షణాలే గుర్తుచేసుకుంటున్నావా?

రాజా : నీ ప్రేమాభిమానాల్ని డబ్బుతో ఎందుకు ముడిపెట్టుకున్నారా అని ఆశ్చర్యపోతున్నాను.

సుగు : –ఓస్ ఇంతేనా? ఇదే సంతోషమైతే నీ చిరునవ్వుని వెయ్యిరూపాయలతో కొనుక్కునే అర్హత ఉంది నాకు.

రాజా : కాని అమ్ముకొనే ధైర్యంలేదు నాకు.

సుగు : రాజా!

రాజా : చాలా గొప్పనిజం చెప్పారు మీరు. డబ్బుతో చిరునవ్వుల్ని, వీలయితే హృదయాన్ని అమ్మే వ్యక్తి మీకు దొరికినవాడు మీరు నిజంగా అదృష్టవంతులు. మీ రిచ్చిన వాచీ ప్రకారం నా ఆఫీసుకు టైమయింది, వస్తాను. (వెళ్లాడు.)

లైట్లు ఆరిపోయాయి

లైట్లు వెలిగేసరికి దిగులుగా నేలవేపే చూస్తూ కూర్చున్న సుగుణ కనిపించింది. సుగుణ ముందు నిలబడి సూటిగా ఆమెనే గమనిస్తున్నాడు— చేతులు కట్టుకొని. ఆమె దైన్యతను చూస్తున్నకొలదీ ఆమెను జయించిన తృప్తి అతని కళ్లలో కనిపించింది.

రాజా: ఏమి టాలోచిస్తున్నారు?

సుగు : ఆ రోజు నా మాటల్ని వింటూ నన్నెంత అసహ్యించుకున్నావో ఇప్పుడు అర్థమవుతోంది.

రాజా : నేను మిమ్మల్ని అసహ్యించుకోలేదు. జాలిపడ్డాను. డబ్బుకి సంతోషానికీ అంత త్వరగానే ముడిపడ్డారని.

సుగు : డబ్బు–హుఁ. నేను చూపించిన డబ్బే చూశావు కానీ, దాని వెనక నిన్ను దక్కించుకోవాలనే నా ఆతృత కనిపించలేదూ నీకు! ఏదోవిధంగా నిన్ను నావేపుకి తిప్పుకోవాలనే నా తపన,

అర్థం కాలేదు నీకు! ఛీ! ఏం మనిషివి నువ్వు?

రాజు : అద్భుత! తపన! (నవ్వి) ఎలుకను చంపడం కోసం ఇంటిమీద బాంబు పేల్చారనుకోండి. దేనికి నష్టం? అతిసులువుగా సంపాదించుకో గలిగిన ప్రేమాభిమానాలకోసం అతినికృష్ట మయిన డబ్బుని పణంగా పెట్టారు. రెండూ నష్టపోయారు. మరిచిపోయాను—మీరిచ్చిన వాచీ కూడా ఇప్పుడు పనిచెయ్యడంలేదు.

సుగు : (క్షణం విరామం. నిట్టూర్చి) ఇప్పుడు మాధవ రావు చెప్పినమాట అర్థమయింది. (తలెత్తి) అయితే యిందుకే నన్నమాట.........

రాజు : కాదు.

సుగు : మరి!!

రాజు : నేను చెప్పడం పూర్తికాలేదు. మీ రూహి స్తున్నవేవీ కారణాలుకావు మనం విడిపోవడానికి.

సుగు : నేనూహించలేని ఆ కారణమేదో చెప్పు.

రాజు : ఆ కారణంవల్ల కాకపోతే —

సుగు : (ఆతృతగా) కాకపోతే—చెప్పు—ఆపేశావేం?

రాజు : అందువల్ల కాకపోతే మన పరిస్థితి వేరేగా వుండేదేమో!

సుగు : ఏమిటో కారణం? చెప్పు త్వరగా వినాలని వుంది.

రాజు : నేను మరో ఊరికి బదిలీఅయి వెళ్తున్నరోజు గుర్తుందికదూ?

సుగు : (ఆలోచించి) గుర్తుంది. ఎప్పుడొస్తావని అడి గితే చెప్పలేనన్నావు. కోపం వచ్చింది. సరాసరి లోపలికిపోయి ఏడుస్తూ కూర్చున్నాను.

రాజు : నాకు భయమేసింది. మిమ్మల్ని ఊరుకో బెట్టడం ఎలాగో తెలియలేదు. మీనాన్నగారికి తెలిస్తే ఏమైనా అనుకుంటారేమోనని వణి కాను.

సుగు : మధ్యాహ్నం భోజనానికికూడా గదిలోంచి బయటికి రాకపోయేసరికి నాన్నగారే స్వయంగా వచ్చి తలుపుతట్టారు.

రాజు : తర్వాత?

సుగు : నేను ఏడుస్తూఉండడం చూసి నిర్ఘాంత పోయారు. 'ఎందుకమ్మా ఏడుస్తున్నావంటే పిచ్చిగా 'చూడునాన్న రాజు సెలవులకి రాడట,' అని చిన్నపిల్లలాగ మీమీద పిర్యాదు చేశాను. నాన్నగారు ఒకటే నవ్వు.

'ఉండమ్మా అతని సంగతి తేలుస్తాను' అని లేచారు. నాకు భయమేసింది.

'వద్దు నాన్నా ఆయన్నేమీ అనకు' అని ఆయన చెయ్యిపట్టుకున్నా వినిపించుకోలేదు.

రాజు : సరాసరి ఇక్కడేకూచున్న నాముందు ఆగారు. 'మా అమ్మాయిని చూడడానికి కాకపోతే నీకు గవర్నమెంటు సెలవులు ఎందుకు ఇస్తున్నా రనుకున్నావు?' అన్నారు. నేను బిత్తరపోయి తలెత్తేసరికి ఆయన పెదవి చివర చిరునవ్వు వెలిసింది. 'ఉండు నీ సంగతిలా కాదు' అనేసి 'చలపతి' అని పిలుచుకుంటూ లోపలికి వెళ్లారు.

సుగు : —(కలలోలాగా) మరో పదినిముషాల్లో నా ముందున్నారు నాన్నగారు. వచ్చి రెండుచేతులూ ఆప్యాయంగా నాభుజంచుట్టూ వేసి (ఆగింది. తలెత్తి) ఏం చెప్పారో తెలుసా?

రాజు : (ఆశ్చర్యంగా) ఏం చెప్పారు?

సుగు : (సూటిగాచూసి కోపంగాకాదు — ప్రేమ గానే) నువ్వుస్టుపిడ్‌వి. నీకేం అర్థం కాదు— ఈ వేసవి శలవుల్లోనే మనిద్దరికీ పెళ్లి జరగబోతోందని చెప్పారు.

రాజు : నిజంగా! ఆలోచించి, ఏదో జ్ఞాపకం వచ్చి నట్టు) అయితే అందుకే మీరు?...

దీపాలు ఆరిపోయాయి

—మళ్లీ వెలిగేసరికి గోళ్లు గిల్లుకుంటూ కుర్చీలో రాజు కూర్చుని వున్నాడు. హఠాత్తుగా ఈదరగాలిలాగ సుగుణ పరిగెత్తుకుని వచ్చింది. వచ్చి అతనిముందు చేతులు కట్టుకుని నిల బడింది.

సుగు : రాజా ! విన్నావా ఈ వార్త?

రాజా : ఏమిటి?

సుగు : మనిద్దరికీ పెళ్లిట. (అదేదో ఊహించలేని విషయంలాగా చెప్పింది)

రాజా : (ఆశ్చర్యపోయి) నిజంగా?

సుగు : ఇప్పుడే నాన్నగారు చెప్పారు. చూశావా మనిద్దరికీ తెలీకుండానే పెళ్లి నిశ్చయమైపోయింది.?

రాజా : (లేచి గుమ్మంవరకూ నడిచాడు. ఏంచెయ్యాలో తెలీక) కాని...

సుగు : శలవులకిముందే వస్తానని ఒప్పుకోనివుంటే ఇంత ప్రమాదం జరిగేదికాదు మరి. నువ్విప్పుడు రావడమేలేదు. నన్ను పెళ్లి చేసుకు మరీ వెళ్లాలి. (చిన్న విరామం) హైదరాబాద్ ఎలా వుంటుంది రాజా ? నాకు బీరకాయ కూరంటే యిష్టం. అక్కడ మంచికూరలు దొరుకుతాయా?

రాజా : సుగుణా ! నవ్వులాటకాదు. నిజమేనా నువ్వు చెబుతున్నది?

సుగు : నాన్నగారిని సాక్ష్యం తెమ్మంటావా? (వెళ్లబోతుంది.)

రాజా : (ఆపి) అహా ! వద్దులే.

సుగు : మొదట నాన్నగారు చెబితే నమ్మలేకపోయాను. 'నాన్నగారూ' అన్నాను ఆశ్చర్యంగా. 'నీకు తెలవదమ్మా. ఇదే ప్రేమంటే' అని నా కళ్లనీళ్లు తుడిచారు. రాజా నీకు తెలుసా యిది?

రాజా : ఏమిటి?

సుగు : ప్రేమ ! రాజా ! యిప్పుడే చెబుతున్నాను. సంసారానికి అన్నీ ముందే ఏర్పాటుచేసుకోవాలి. ఏం లేకపోయినా నాకు కోపం వస్తుంది.

రాజా : సుగుణా ! నన్ను కొంతసేపు ఆలోచించుకోనీ.

సుగు : ఏమి టాలోచిస్తున్నావు. శలవలు యింకా ముందుగా దొరుకుతాయేమోనని (నవ్వేసి) రాజా ! హైదరాబాద్ బాగుంటుందటగా, అక్కడినుంచి నన్నెక్కడికి తీసుకువెడతావు?

రాజా : (ఏదో ఆలోచిస్తున్నాడు.)

సుగు : నాకు బొంబాయి చూడాలనివుంది. ఢిల్లీలో కుతుబ్‌మినార్ ఎక్కాలనివుంది. కాశ్మీరులో పడవలమీద వారాలకి వారాలు ఉండిపోతారుట, నూతన దంపతులు. మనం కూడా ఒక 15 రోజులైనా ఉండాలి. (రాజు ఆమెను విచిత్రంగా చూస్తే) భయపడకులే. నాన్నగారినడిగి కావలసినంత డబ్బు తెస్తాను.

రాజా : (సూటిగా ఆమెను గమనించాడు. అతనిలో ఎక్కడలేని కరుకుదనం వచ్చింది. ఏదో ప్రయత్నానికి సంసిద్ధుడయ్యాడు ఇప్పుడు అటువేపు తిరిగి) డార్జిలింగ్ వెళ్లాలని లేదూ?

సుగు : (ఉప్పొంగిపోయి) రాజా ! ఎంతమంచి ఆలోచన నీది ? (దగ్గరకువచ్చి) ఆడవాళ్ల మనస్సుని అర్థం చేసుకోవడం ఇంత హఠాత్తుగా తెలిసిపోయిందే నీకు !

(రాజు సమాధానంగా నవ్వాడు)

రాజా : మనసు యిదివరకే అర్థమయింది సుగుణా, కాని యిప్పుడే బయట పడుతున్నాను. ఇంకా చెప్పు ?

సుగు: ఎన్నో చెప్పాలనివుంది. ఇప్పుడేం గుర్తురావడం లేదు. మనం తొందరగా అన్నీ చూసిరావాలి రాజా ! ఎందుకంటే ఏళ్లు గడిచేకొద్దీ సంసారం పెద్దదవుతుంది. పెద్దదైందా— ఇక ఆ ఆనందంలో బయట ప్రపంచం గుర్తుండదు.

రాజా : ఎంత పెద్దదవుతుంది సుగుణా ?

సుగు : (ఈ ఆలోచనలు ఆమెను ఉత్సాహపరుస్తున్నాయి.) నీ అమాయికత్వానికి నవ్వొస్తోంది రాజా ! 'ఎంత' ని ప్రశ్నేముంది? మమతల మాధుర్యం అర్థమయితే ఎంతమంది వున్నా తనివితీరదు ఇంతయింటికి నేనూ తమ్ముడూ యిద్దరమే పెరిగాం. పబ్లిక్‌స్కూల్లో పదిమంది మధ్య—పదిమందితో బతకడం ఎంత ముచ్చటగా వుంటుందో నీకుతెలీదు. ఒక్కటి

చెప్పు. ఎంత డబ్బువున్నా మీ యింట్లో వున్నంత నిండుదనం వస్తుందా ?

రాజా : మా యిల్లంటే నాకు భయం సుగుణా.

సుగు: అందుకు కారణం అత్తయ్య లేకపోవడం. ఆడదిక్కు లేకపోతే పిల్లలు చెదిరిపోతారు. సంసారం కుక్కలు చింపిన విస్తరవుతుంది.

రాజా : మన సంసారం కాదని నమ్మకమేమిటి ?

సుగు: నేను కానివ్వను. కానిస్తే నా గొప్పతనం ఏముంది ? మాతృత్వపు మాధుర్యం అత్తయ్యను చూశాకనే అర్థం చేసుకున్నాను రాజా ! (ఏదో కలకంటున్నట్లు) అప్పుడు నువ్వూ నా కక్కరలేదు. నీగురించి కూడా మరిచిపోతాను. నేనూ—పిల్లలూ— అదే నాలోకమవుతుంది. (కళ్లు మూసుకుంటుంది.)

రాజా : నిర్ధారణగా) నువ్వాలోకాన్ని చూడవు సుగుణా!

సుగు : (నిర్ఘాంతపోయి కళ్ళు విప్పింది) రాజా !!

రాజా : అవును నిన్ను పెళ్ళిచేసుకోను నేను.

సుగు: రాజా ! నువ్వేనా ఆమాట అన్నది !

రాజా : నేనే ! తెలిసే అంటున్నాను. నీకు ధైర్యం చాలకపోతే మీ నాన్నగారితో నేనే చెబుతాను.

సుగు: ఎందుకు ? ఎందుకని ? నేనేం తప్పచేశాను ?

రాజా : నువ్వుకాదు. ఇది జరిగితే నేనే దిద్దుకోలేని తప్పచేసిన వాణ్ణవుతాను. నన్ను నేను నీనుంచి రక్షించుకోవాలంటే సాయంకాలం కాదు — ఇప్పుడే బయలుదేరి పోతాను. (లోపలికి నడవబోయి, ఆగి) నాన్నగారితో చెప్పు. నాకు శలవులు లేవు. నేను యిప్పట్లో రాను (లోపలికి వెళ్లాడు. ఆమె స్తబ్దురాలై శిలాప్రతిమలాగ నిలిచిపోయింది. ఒక్కక్షణంలో పెట్టె సంచీతో వచ్చాడు. ఒక్కసారి ఆగి) ఆవేశంతో మిమ్మల్ని 'నిన్ను' అన్నాను క్షమించండి. వస్తాను.

(ఆమె శోకమూర్తిలాగ నిశ్చలంగా నిలబడే వుంది.)

లైట్లు ఆరిపోయాయి

(— మళ్లీ వెలిగేసరికి విశ్చలంగా కుర్చీలో కూర్చునివుంది సుగుణ. రాజా ద్వారానికి తల ఆనించి నిశ్చలంగా వున్నాడు.)

సుగు: (ఒక్కక్షణం ఆగి, తలెత్తి) రాజా, నువ్వంటే అసహ్యం నాకు.

రాజా : నవ్వి) ఆరోజే నేనర్థం చేసుకున్నానుదాన్ని. కాని మీరివాల్టివరకూ దాన్ని ప్రేమ అనే నమ్ముతున్నారు. అంతే తేడా !

సుగు : ఎందుకు గుర్తుచేశావు ఈ కథ ! ఎందుకు నానుంచి పారిపోదామనుకున్నావు?

రాజా : ఇంకా అర్థం కాలేదా ?

సుగు : డొంక తిరుగుడుమాని సూటిగా చెప్పు.

రాజా : మీ డబ్బుకీ, మాతృత్వపు మమకారానికి మధ్య 'భర్త' అనే పేరుతో 'కేవలం' లంకెగా పడి వుండడం యిష్టంలేక. మానాన్నలాగ పుట్టెడు సంసారంతో మగ్గడం చేతకాక.

సుగు : (నవ్వి) పోనీ యిప్పుడు చేతనయిందా? భగవంతుడు ఎంతగొప్ప న్యాయమూర్తి, రాజా ! ఎవరినెలా శిక్షించాలో ఆయనకు బాగాతెలుసు. నేను కోరినదాన్ని నాకు లేకుండా చేశాడు. నిన్ను—నీకు అక్కరలేని సంతానానికి నిన్ను బానిసగా చేశాడు. నువ్వింకా వికృష్టంగా, దీనంగా హీనంగా బ్రతికితే చూడాలనివుంది. నీమీద ప్రేమ నాకెప్పుడూలేదు. ఇప్పుడంత కన్నాలేదు. వీలయితే నీమీద పగతీర్చుకోవాలనుంది. (ఉద్రేకం క్రమంగా దుఃఖంగా మారుతోంది.)

రాజా : ఆవేశపడకండి. నేను చెప్పవలసిందింకేమీలేదు.

సుగు : రాజా! నిన్ను బాధపెట్టకపోతే నాకు మన శ్శాంతిలేదు. మార్గం చెప్పలేకపోతే ఈ వగతో చచ్చిపోతాను.

రాజా : దేవుడే నన్ను శిక్షించాడన్నారుగా? అది చాలదా?

సుగు : రాజా! నిజంగా నామాట నమ్ముతావా?

రాజా : ఏమిటి?

సుగు : నీమీద ప్రేమలేదన్నది.

రాజా : (విషాదంగా నవ్వి) ఉన్నా ప్రయోజన మేముం దిప్పుడు?

సుగు : మూర్ఖుడా! ఇవాళకూడా ఆత్మవంచన చేసు కుంటావెందుకు? నిన్ను ప్రతిక్షణం నేనెంత ప్రేమించేదాన్నో నీకు తెలుసు. నీకోసం నేను ప్రాణాన్ని యివ్వగలనని నీకు తెలుసు (దుఃఖం ఉద్రేకం) రాజా; నీకదే యిష్టమయితే నీతో కలిసి బతకడంకోసం నాకు పుట్టిన పిల్లల్ని నీకనులిమి చంపేసేదాన్ని రాజా! మరెప్పుడూ జీవితంలో పిల్లలగురించి ఆలోచించేదాన్ని కాదు. వాళ్ళ పుట్టనిమార్గం ఏదయినా తెలిస్తే నీకోసం వాళ్ళని నష్టపోయేదాన్ని. పిల్లలకోసం అత్తయ్య సుఖాన్ని నష్టపోయింది. నీకోసం నేను పిల్లల్ని నష్టపోయేదాన్ని.

రాజా : సుగుణా! సుగుణా యిప్పుడెందుకవన్నీ?

సుగు : ఇప్పుడేకాదు, ఎప్పుడూ నీకక్కరలేదు. నువ్వు మనిషివికావు. రాక్షసుడివి-రాక్షసుడివి...

ఏడుస్తూ లోపలికి పరుగెత్తింది. దిగ్భ్రాంతుడై రాజా అలాగే నిలబడిపోయాడు. ఆమె వెళ్ళినవేపే చూస్తూ. కాస్సేపటికి చొక్కా గుండీలు పెట్టుకుంటూ సత్యం వచ్చాడు. (అన్నయ్యను చూసి)

సత్యం : నాకోసం ఎవరైనా వచ్చారా అన్నయ్యా—ఓ అందమయిన కారులో—చాలా అందమయిన అమ్మాయి—పేరు లత.—

(ఆతనేం చలించలేదు నిశ్చేష్టుడయివున్నాడు.) రాలేదా? పోనీలే నేనే వెతుక్కుంటూ పోతాను. (విజిల్ వేసుకుంటూ వెళ్ళాడు బయటికి.)

తెర [సశేషం]



రగడల తాళనిర్ణయము

శ్రీ బండి నాగరాజు

ఈ క్రింది పద్యము 'యక్షగాన లక్షణము'గా అప్పకవి రచించెను :

సీ. తుదనేడు లఘువులు దొలఁగించి చదివినఁ
  త్రిపుటకు వృషభగతి పదయుగము;
లరిఁ గడపల నొక్క లఘువు మానిన జంపె
  మను ద్విరదగతి సమపదయుగము:
గురు తగు రచ్చెరకుఁ దురగవల్గనా
  హ్వయ; మేకతాళి యా మధురగతికి;
సంప్రఫి కీర్వది వాలు గిటతాళమున మాత్ర,
  లోలి విశ్రాంతి పద్నాలుగింటఁ;
ఎ. గీ. దెలియ నర్థంబు నరఘచంద్రికలు వీన
  యక్షగాన ప్రబంధంబు లతుకనచ్చు;
రగడ భేదంబు లివి యంద్రు రసఁ గవీంద్రు;
  లవిత నిజసేవక స్తోమ! యభిధామ!

—అప్ప. IV, 303.

యక్షులు—జక్కులవారు—చేయుగానము, లేక ప్రదర్శించు గానప్రబంధము 'యక్షగానము' అయినది. హరికథ, వీథినాటకము (వీథిభాగోతము) ఇత్యాదులు యక్షగానములు. వీటిలో తాళమునకు సరిపడు పాటలు, పద్యములు అనేకము లుండును. రగడలు, కళికోత్కళికలు, కీర్తనలు, ధవళములు, జోలలు, ఏలలు—ఎన్నో యుండును. ఇవి అన్నియు తాళబద్ధములైన గేయములు. పంచచామరము, ఉత్సాహము, ద్విపద మొదలగు పద్యములును, బిరుదగద్య, చూర్ణికవంటి గద్యభేదములు గూడాను తాళానుగుణముగా విరచింప బడును.

అప్పకవి, పై పద్యమున రగడభేదములకుఁగల తాళనిర్ణయము చెప్పుచున్నాడు. ఆ పద్యము, సుగమము కాకుండుటవలన ఇచ్చట కొంచెము స్పర్శించుచున్నాను. పండితులు పరిశీలింప ప్రార్థన.

అప్పకవీయములోని కొన్ని సందేహములు, లక్షణసారసంగ్రహము చూచిన బోధపడును. అప్పకవి దీనిని దగ్గర పెట్టుకొని వ్రాసినపట్టులు చాలా ఉన్నవి. అట్లని యీ సందర్భమును లక్షణసార సంగ్రహములో చూచినను, అదియు పైదానిమాదిరి స్పష్టాస్పష్టముగనే యున్నది, చూడుడు—

సీ. వృషభగతి త్రిపుడరే కంఘ్రియుగ మగుఁ,
  దుద వేసు లఘువులు దొలఁగఁ జేయ;
జంపె రేకునకు లక్షణము ద్విరదగతి
  యగుఁ, గాన నొకలఘు వందు మాన;
రచ్చ రేకగుమ దురగ వల్గనము గతి;
  మఱి యేకతాళియౌ మధుర గతివి;
అటతాళమునమాత్ర లంఘ్రి కిర్వది వాల్గ
  వాల్గట, విరతి పద్నాలు గింట;
ఎ. గీ. నిలుచు నర్థంపు నర్థచంద్రికలు దీన
  యక్షగానాది కృతులలో వార్యు లిడిన
రగడ భేదంబు లివియౌను రమ్యచర్య!
  యవిత నిజదాససముదాయ! యాంజనేయ!

—ల. సా. సం. 11, 141.

'ఆనంద రంగరాట్ఛందము'లోని యీ సందర్భమును గూడ గమనింప వచ్చును—

'......అందు హరిగతియను రగడకు అటతాళము, హయప్రచారము, తురగవల్గనము, విజయ మంగళము వీనికి రూపకతాళము; మధురగతియను రగడకు ఏకతాళము; ద్విరదగతి, విజయభద్రము వీనికి జంపెతాళము; హరిణగతి, వృషభగతులకు త్రిపుటతాళము. ఇట్లు నవవిధంబులైన రగడలు తాళభేదంబులఁ జెలఁగుచు నుదాహరణంబులకు నాకరంబై యుండు...' IV, 182 వ వచనము.)

ఈ వచనము చాలవరకు స్పష్టముగా ఉన్నది. శాస్త్రవిషయములు, తద్వివరణములు వచనములో

ఉండిన, స్పష్టమగు నన్న అభిప్రాయమునకు ఇది యొక లఘూదాహరణము.

దీనినిబట్టి యిక్కడ ఒకవిషయము గమనింప వలసియున్నది. 'ఉదాహరణము' అనునది ఒక (వాటు/క్షుద్ర) కావ్య విశేషము; ఒక రచనా ప్రక్రియ. దీనిలో పద్యములు, గేయములు వాడబడును. ఈ గేయములు కళికోత్కళికల రూపమున నుండును. ఇవి నవవిధ రగడల వలన ఏర్పడును. ఈ రగడలకు తాళనిర్ణయము చేయబడినది. ఎట్లనగా—

1. హరిగతి రగడకు— అటతాళము.

2. హయప్రచార
 తురగవల్గన
 విజయమంగళ రగడలకు – రూపకతాళము.

3. మధురగతి రగడకు— ఏకతాళము.

4. ద్విరదగతి
 విజయభద్ర రగడలకు – జంపెతాళము

5. హరిణగతి
 వృషభగతి రగడలకు – త్రిపుటతాళము.

పై పద్యములు గూడ, చాలవరకు ఈ విషయములోనే సంపదించుచున్నవి. కాని, కొన్నివిశేషము లున్నట్లు చూపట్టును.

ఈ పద్యములకు పూర్వమున, నవవిధ రగడలు లక్ష్యలక్షణ పూర్వకముగా చెప్పబడినవి. వాటి తరువాత, 'యక్షగాన లక్షణము' అను శీర్షిక క్రింద ఈ సీసములు పోతపోయబడినవి. అనంతరము 'ఉదాహరణ లక్షణము' సోదాహరణముగా రచింపబడినది. ఈ సందర్భము ననుసరించియే పై సీసపు తాత్పర్యము లేమో గ్రహింపవలసియున్నది.

ముందు చిత్రకవి పెద్దన పద్యపుపంద పట్టుదము. 'ఇటునుంచి వాటపడకపోతే అటునుంచి నరుక్కు రమ్మన్నాడు.' తరువాత అప్పకవిది చప్పరించవచ్చును—

1. మొదటి పాదము:—'త్రిపుట తాళము' అనుటకు 'త్రిపుడరేకు' వాడబడినది; ఇది వైకృతమన్న మాట.

వృషభగతి లక్షణ మిది—

1. (3 మా. + 4 మా.) + (3 మా. + 4 మా.)–ఒక హరిణగతిపాదము.

2. (3 మా. + 4 మా.) + (3 మా. + 4 మా.)–ఒక హరిణగతిపాదము.

రెండు హరిణగతి పాదములు=ఒక వృషభగతి పాదము.

ఒక వృషభగతి పాదములో 28 మాత్రలు ఉండును. ('మాత్రలు' అను పారిభాషికమే వాడవలసియున్నను 'లఘువులు', 'అక్షరములు' అను పదములు గూడ పర్యాయములుగా వాడబడుచున్నవి.)

హరిణగతి — వృషభగతులకు త్రిపుటతాళ మన్నది, ఆనందరంగరాట్ఛందః కర్త చెప్పినమాట. కాని యీ పద్యపాదమునకు అర్థమేమి?

ఇక్కడ, 'వృషభగతి – త్రిపుడరేకు' వరకు బాగున్నది. 'అంఘ్రియుగమునుఁ, దుదనేడు లఘువులు–తొలఁగఁజేయు' అనగా ఏమి?

ఇంక, అప్పకవిగారిది గూడా అదే అనువాదము!

వృషభగతి పదయుగము=వృషభగతి రగడ యొక్క పాదములు రెండు (56 మాత్రలు),

త్రిపుటకున్ – త్రిపుట తాళమునకు (సరిపోవును.)

మరి విశేష మేమనగా, ఆ వృషభగతి పదయుగములోని తుదనేడు లఘువులు తొలగించి చదువవలెను.

దీని వివరమేమో పెద్దలు చెప్పవలె!

2. రెండవపాదము:— పైదానికంటె ఇది కొంచెము మేలు; 'అది పండుకొని తినేది, యిది కూర్చొని తింటున్నది.' అన్నట్లు! జంపెరేకు – ఝంప తాళమునకు–వైకృతము. జంపెతాళమునకు లక్షణమేమనగా, ద్విరదగతి రగడ అగును; మరి విశేషమేమనగా, ద్విరదగతి రగడ (పాదముల జంట?) లోని చివరి మాత్రను మానవలెను.

ద్విరదగతి లక్షణమిది—

5 మా. + 5 మా. + 5 మా. + 5 మా. = 20 మాత్రలు. (దీనికి రెట్టింపు విజయభద్ర రగడ. 40 మాత్రలు.)

ద్విరదగతి, విజయభద్రములకు జంపెతాళమన్నది, అనంద రంగరాట్ఛందము చెప్పినమాట. కాని, ఈ 'కొన నొక లఘువందుమాన' నేమి?

ఇంక, 'అప్పకవి చెప్పిన దెట్లున్నది?' అతని కంటె ఘనుడు అచంటమల్లన్న.'

అలిన్ — మనున్ (?)—ద్విరదగతి నమపద యుగము—ఇవీ యిందలి అదనపు మాటలు. వీటివల్ల తెగునా ? తెల్లవారునా ?

3. మూడవపాదము — పూర్వార్ధము :— ఇది కొంత సుగమముగానే యున్నది. రచ్చరేకు — రూపక తాళమునకు—వైకృతము. తురగవల్గన రగడ యొక్క నడక, రూపకతాళము అగును.

తురగవల్గన లక్షణమిది —

ఎనిమిది సూర్యగణములు = ఒక తురగవల్గన పాదము (24 మాత్రలు).

దీనిలోసగము = హయప్రచారము (12 మాత్రలు).

దీనికి రెట్టింపు = విజయమంగళము (48 మాత్రలు).

ఈ మూడింటికిని రూపకతాళమన్నది, కస్తూరి రంగకవి (ఆ. రం. రా. ఛందఃకర్త) వచనము.

అప్పకవి చెప్పినదేమనగా, 'రచ్చరేకు'నకు—అని చెప్పవలసియుండగా, 'రచ్చెరకు' అన్న నత్తిమాట, అదనము! 'తురగవల్గ నాహ్వయము రచ్చెరకు గురుతు అగు(ను)' అని అన్వయము.

4. మూదవ పాదము—ఉత్తరార్ధము :— ఇది సరళముగా బోధపడును. మధురగతి రగడయందు (మధురగతిని అనుటకంటె, మధురగతికి అన్న అప్పకవి కారకము మేల్తరము.) ఏకతాళము అగును. ఏకతాళమునకు—ఏకతాళి (అని యిక్కడ) — అన నక్కరలేదు: 'మణి యేకతాళనహ్—మధురగతిని' అన్న సరిపోవును గదా! 'మణి' మాత్రము యతిమైత్రి కూర్చున్నది, తొలగింపగాదు.

మధురగతి లక్షణమిది—

'గగ—భ—స—నలము'లలో నాలుగుగణములు — మధురగతి పాదము — 16 మాత్రలు. (దీనికి రెట్టింపు—హరిగతి — 32 మాత్రలు.)

మధురగతికి ఏకతాళమన్నది, లక్షణ చూడామణి (కస్తూరి రంగయ్య) వచనము.

అప్పకవి యిట్లే నకలు దఖలు పరచుచు యతి మరచుట విశేషము! 'హ్వ-మ'లకు యతిమైత్రికి కక్కుర్తి పడవలెనా? (హ్వ—ను బిందు పూర్వకముగానో, అనునాసికోచ్చారణముగానో పఠింపదగునేమో పరిశీలింపవలసి యున్నది.) 'తురగవల్గ నాహ్వయ'కు బదులు—'తురగవల్గనాభిధ' అని 'శుద్ధ ప్రతము'న సూచింపబడినది. (ప్రాసయతి కుదురును.)

5. నాల్గవపాదము — పూర్వార్ధము :— ఇది గూడ కొంచెము ఎగుడుదిగుడుగానే యున్నది. ,అట తాళమున మాత్రలు—అంఘ్రికి — ఇర్వదినాల్గు' అని చిత్రకవి వారంటే, అప్పకవిగా రేమనుచున్నారు ? 'అంఘ్రికి—ఇర్వది నాలుగు—అటతాళమున మాత్రలు' అన్నారు! అత్తగారి యెడమచెయ్యి, కోడలి పుర చెయ్యి—రెండును ఒకటే మరి!

హరిగతికి అటతాళము అన్నది, అనందరంగ రాట్ఛందపు వచనము. హరిగతి — మధురగతికి రెట్టింపు—పాదమునకు 32 మాత్రలు గలది.

పాదమునకు 24 మాత్రలుగల రగడ, అట తాళమున నడచునని—పై పీసపద్యకారుల తాత్పర్యముగా భావించవలసియున్నది. తురగవల్గన పాదమున 24 మాత్ర లుండునుగాని అది రూపకతాళమని గదా చెప్పిరి? మరి 'దీని భావ మేమి? తిరుమలేశ !'

6. నాల్గవ పాదము — ఉత్తరార్ధము:— ఆ యిరువదినాలుగు మాత్రలుగల పాదమునందు విశ్రాంతి (యతి) ఎక్కడనో తెలివిడిచేయుట యిందలి విషయము. (యతివిచారము దీనికిమాత్రము, ఇక్కడ చేయుట, పద్యపూరణార్థముకాదుగదా? ఏమో !)

నాల్గిట విరతి పద్నాలుగింట—చిత్రకవి.

ఓలి విశ్రాంతి పద్నాలుగింట—అప్పకవి.

'నాల్గిట' ననగా, నాలుగు పాదములందును అని అర్థము చెప్పుకోవచ్చును. కాని రగడలందు రెండేసి పాదములకే ఆద్యంతప్రాసములు, పద్య పూర్తియు. (పాదమనగా, పద్యములో నాలుగవ వంతు; పద్యమనగా నాలుగు పాదములు గలది—అన్న సామాన్య నియమములనుబట్టి దీనిని సర్దుకోవచ్చును) అప్పకవిగారి 'ఓలి' గూడా ప్రాసయతికై పడిన తంటాయే! 14 వ మాత్రయందు యతిపడవలెనమట సారాంశము.

రగడలయందు యతినిర్ణయము చేయుట యెట్లు?

మాత్రాసంఖ్యను సగముగా భాగించి, దాని కొకటి కలుపుకొన్న, ఏర్పడు సంఖ్య—యతిస్థానము. (విజయభద్రమునకు ప్రతి 10 మాత్రల పై మూడు చోట్ల విశ్రాంతి.)

24 మాత్రలను సగము చేసిన 12 అగును; దీనికొకటి కలిపిన 13 అగును. అనగా 13 వ మాత్ర యతిస్థానము (దీనిని 12 వ మాత్ర పై/మీద అనిగాని, 13 వ మాత్రయందు/స్థానమున అనిగాని లక్షణము చెప్పుట ఆచారము. ఎట్లన్నను స్థితి ఒకటే.) ఈ విధముగా ఇది విచారణీయమగుచున్నది.

14 వ మాత్రయందు యతి—26 మాత్రలు గల రగడ పాదమునకు ఉండవచ్చును. అట్టి రగడ యేమున్నది ?

'పద్నాలుగింట'కు బదులు – 'పద్నాలుగుపయి' ననుకొని చూతమన్న, అప్పుడది 28 మాత్రల పాదము కావలసి యున్నది. ఇది వృషభగతి రగడ – త్రిపుట తాళము—అగుచున్నది.

అసలు, మధురగతికి ఏకతాళమేమి ? దానికి సరిగా రెట్టింపైన హరిగతికి అటతాళమేమి? కస్తూరి రంగడేగతి!

ఇక్కడ మన మొక పథకము వేసుకొని పరిశీలింతము :—

రగడ (1)	గణబంధము (2)	గతి భేదము (3)	మొత్తము మాత్రలు (4)	యతి(ఎన్నిచోట్ల?) (5)	తాళము (అక్షర కాలము) (6)
1. హయప్రచారము తురగవల్గనము విజయ మంగళము	4 మా. 8 మా. 16 మా.	మూడేసి మాత్రలకు విరుగుచు నడచును; త్రిశ్రగతి.	12 24 48	2 వ గణమున (7 వ మాత్ర) 5/13 9/25	రూపక తాళము (6 అక్షరముల కాలము గలది)
2. హరిణగతి వృషభగతి	(3+4మా) × 2 (3+4మా) × 4	3-4 మాత్రల గణములుగా విరుగుచు నడచును; మిశ్రగతి.	14 28	8 వ మాత్ర 15 వ మాత్ర	త్రిపుట తాళము (7 అక్షరముల కాలము)
3. ద్విరదగతి విజయభద్రము	5 మా × 4 5 మా × 8	5 మాత్రల గణములుగా విరుగుచు నడచును; ఖండగతి.	20 40	11 వ మాత్ర 11-21-31 వ మాత్రలందు 3 చోట్ల.	జంపెతాళము (10 అక్షరముల కాలము)
4. మధురగతి	4 మా × 4	గగ-భ-స-నలలుగా విరుగుచు నడచును; చతురశ్రగతి.	16	9 వ మాత్ర	ఏకతాళము (4 అక్షరముల కాలము)
5. హరిగతి	4 మా × 8	— పై —	32	17 వ మాత్ర	అటతాళము? (14 అక్షరముల కాలము?)

అప్పకవీయమున 'కల్పిత కల్పవల్లీ భాస్కర విలసితము' (IV, 396) లో ఎనిమిది 'అర్ధచంద్రికలు' గర్భితము చేయబడినవి. అది అంతయు హరిగతిలో నడచిన 'ఉత్కళిక'గా ఉన్నది. 'అర్ధవంతములైన అర్ధచంద్రికలు' అని వీటికి అర్థమేమో ఆలోచింపవలసియున్నది. అప్పుడు అది 'అర్ధంపు టర్ధచంద్రికలు' అని యుండవలెను. ఈ యుత్కళికలు, అటు యక్షగానములందును, ఇటు ఉదాహరణములందును సామాన్యమైయున్నవి.

ఈ విధముగా పై పీసములు, విద్వత్పట్ట పరీక్షార్థులయు, జిజ్ఞాసువులయు ఉసురు తీయు చున్నవి! ఇక్కడనే 'ఏడుపులో ఎడమచెయ్యి' అన్నట్లు మరియొక సందేహమును గూడ పరిశోధకుల దృష్టికి దెచ్చి, వివరింపగోరెదను

'త్రిపురాంతకోదాహరణము'లో రావిపాటి తిప్పన, సప్తమీ విభక్తి దగ్గర—'రెండు పంచమాత్రాక గణములమీద, రెండు సూర్యగణములుగల రగడ'ను కళికగా వాడియున్నాడు; 'ఒక పంచమాత్రాకము మీద, ఒక సూర్యగణము నిలిపిన—అర్ధరగడ'ను ఉత్కళికగా కూర్చియున్నాడు. దీనికి లక్షణసార సంగ్రహకర్త పెట్టినపేరు 'హంసగతి' అని. దీనిని—ఆ సప్తమి దగ్గరనే—తాళ్లపాక పెదతిరుమలయ్య (శ్రీ వేంకటేశ్వరోదాహరణము), చిత్రకవి పెద్దన (లక్షణసార సంగ్రహాంతర్గత హనుమ దుదాహరణము), అప్పకవి (అప్పకవీయాంతర్గత శ్రీ కృష్ణోదాహరణము), బాలకవి అనంతయ్య (శేషార్యోదాహరణము)—ఉపయోగించియున్నారు. కాని, నిడుదవోలు వారు త్రిపురాంతక—శ్రీ వేంకటేశ్వరోదాహరణము లందు దీనిని తప్పుగా సూచించియున్నారు.

ఈ హంసగతి రగడకు లాక్షణికులు లక్షణము చెప్పియుండలేదు. నేను దానిని గూర్చి ఒక విపుల వ్యాసము వ్రాసియున్నాను; అనుశీలింప ప్రార్థన.

హంసగతి:—

5 మా. + 5 మా. + 3 మా. + 3 మా. మొత్తము 16 మాత్రలు. ఇది చతురశ్ర గతిలోగాక ఖండగతిలోనే నడుచుచున్నది గాన ఝంపె తాళమునకు సరిపడును. తద్‌జ్ఞులు నిర్ణయింతురని కోరుచున్నాను.

పంచమాత్రాకముల్—వరుస రెండు
నించుగా నిను లిద్ద—ఱెనఁగుచుండు
మూఁడవ గణారంభ—మునను నిలుచుఁ
బోఁడిగా వళి, కవుల్—పొగడఁ బొలుచు
హంసయానము భాతి—నరుగు రగడ
'హంసగతి' నామమున—నలరు మొగడ.
(మదీయము.)

మదీయ శ్రీ వేంకటేశ్వరోదాహరణము — ద్వితీయా విభక్తియందలి—హంసగత్యుత్కళికను గూడ అనుగ్రహింప వేడెదను :

సికలెల్లఁగొట్టి
మకుటమ్ముఁ బెట్టి
సిరిచేత లేక
దరిసెన విమ్మక
పైసాల కొద్ది
నేపాల సద్ది
నిలుమండువాని
గరివేషగాని.

ఆత్మశ్రీ

శ్రీ త్రిపురాణ వేంకట కృష్ణరావు

అరిషడ్వర్గము స్తబ్ధమై మణఁగి గట్టై నిల్వ,
యోగంబు చుట్టరిగాఁపై కొలువన్,
సమాధి పరిపూర్ణామల్య గంభీరమై పరఁగన్,
శాంతి విశాల గర్భతలమై
స్వచ్ఛామృతం బూర్వఁ
దత్సరసిన్ దోఁచె మదాత్మ సారసము
సాక్షాద్దివ్యరూపంబునన్.

అమృత సరోవరంబు, స్ఫటికామల చిన్మయతీరసీమ
హృత్సుమవని, విద్వితర్ది, శుచి,
మహావృతవీథిఁ జరించు
సత్కళా ప్రముఖ కుమారికల్
పరపి, స్వచ్ఛతకర్ణిక, స్వేచ్ఛజేకులై,
యమరు తదాత్మ పద్మమున!
నాడఁ దొడంగిరి కేళిలోలలై.

ఓంకృతికేళికిన్ జనని
యొప్పునఁ గర్ణికఁ గూరుచుండెఁ
దత్పంకజ పత్రరంగములపైఁ
గళలెల్లఁ గుమారులై
నిరాతంకత నాడుచుం
గదియఁదారుచు వచ్చుచునుండి;
రంబ పాదాంకుర కింకిణీ చిణీ రవాంకిత
ముద్రతఁ బండ ధన్యతన్.

వరకవితాకుమారి యొక్క స్వర్ణదశాంతర రంగపాళికన్
సురభిమదూళికాఝరిని
సుందరసూనతరీవిహారగాఁ దరలి,
కవిప్రియముల్ సుకవితల్ మధురంబుగ నాలపింప,
నక్షరమున కొక్క దివ్యరస
సర్జనమ్మై తగ, నించె సాహితుల్

ఒక దళసీమసోముఁడు
సుధోపమకాంతులు కాయ,
మారుతం బకలుషమ్మై సుగంధశిశిరాంకురముల్ వొలయున్,
వసంతరాట్పికములు కూయ,
మాధుకర బృందము మ్రోయ,
విపంచి మీటుచున్ జకజకఁ బాడి హాయినిడె శాంతిని
గానకళాకుమారియున్.

ఎంచి నుతింప వీణ మొరయించి;
గణించి భజింప వంశి మ్రోయించి;
సుఖించి, పెంపు గణుతింపఁగ వాయువిలీన మూని వాయించి;
రహించి మించి వికసింప సనాయి,
మృదంగ మూఁది మ్రోగించి;
చరించె సర్వము తరింపఁగ వాద్యకళాకుమారియున్.

ఒక్కొక పాదవిన్యసన కొక్కొకమెట్టు నతిక్రమింప,
నొక్కొక్క పదంగ భంగిమకు నొక్కొక హాయి ఘటిల్ల,
ముజ్జగం బొక్కటిగాఁగఁ
దన్మయత నూఁగదళంబునఁ
గ్రిందు మీఁదులున్ ద్రొక్కి నటించెఁ
జెంకొనఁగఁ దొల్లితలిన్ నటనాకుమారియున్.

ప్రతిమృదువర్ణమున్ నళిన భావము నుండియె సంగ్రహించి
స్వాత్ర్పతులను నించి,
వన్నియలు పంచి,
మిటారపుఁ గుంచెఁ గేసరప్రతతి ఘటించి

పత్రములపై లిఖియించె ప్రబోధచిత్రముల్
చతురతఁ జిత్రలేఖనకళాసుకుమారి యలేఖ్యరూపముల్.

అకరుల్, పుప్పొడి, మంచ, తూండ్లు పనిముట్లై పాల్యఁ
గ్రాందేనియన్ జికిలిం జేయుచు నేక
వాక్కురసస్పష్ట ప్రౌఢి కాన్పింప,
శిల్పకలోకంబులు రేఖలం బ్రతిఫలింపన్. మల్చెఁ
బొందమ్మియం దొకటన్ శిల్పకళాకుమారి
దళముల్ హొన్నై యుడన్ వృద్ధియున్.

అందుఁ కళాప్రభావితుఁడనయ్యుఁ
బ్రభాచకితుండనై
తదానందమునందధోముఖమునం బయిలోడి
తత్రాదిమాతకున్, వందనపూర్వకంబుగను,
నా యసమర్థత విన్నవించి
స్వచ్ఛందత నిల్చిపోయితిని,
సర్వకళల్ ననుఁ జూచి నవ్వఁగన్.

స్వానునయానుకంపక దృగంకురముల్ సుధలొల్క
మాత నాదీనపరిస్థితిన్ గని,
యతిప్రియ ముట్టిపడన్ నను నాదరించి
నా కానతి యిచ్చెఁ;
దద్దయకు నౌదల వాంచితి 'సుప్రసాద'మం
చేనును వారిఁబోలెఁ గృతకృత్యవినీతి కళాప్రదర్శిగాన్.

ప్రయత కళాకుమారికలు
వారు కృతార్థులై రి చేరి యా
ప్రియతమ మాతృపాద పదవిన్;
గురిసెన్ సుధ, కాసెఁ జంద్రికల్,
జయరవ శోభమై ముగిసె;
శాశ్వతమై నిలిచెన్ బునఃపునర్దయముగ శాంతి;
యిట్టివెకదా విమలాత్మకళావిలాసముల్.

చెకొస్లవాకియాలో జరిగిన దేమిటి?

"శ్రుతకీర్తి"

చరిత్ర పునరావృత్త మవుతుందని లోకోక్తి. కాని పన్నెండు సంవత్సరాల వ్యవధిలోనే యిది సంభవ మవుతుందని ఎవ్వరూ భావించలేదు. 1956 లో హంగేరీ, 1968 లో చెకొస్లవాకియా, ఈ రెండు సంఘటనలూ ఒకటేనని భావించడం కొంతవరకు అనుచితమే! ప్రపంచ పరిస్థితులు అతివేగంగా మార్పుచెందడంవలన నైపథ్యాలు మారిపోయాయి. అందుమూలంగా యీ సంఘటనలకు త్రోవతీసిన కారణాలూ, వాటి ప్రభావాలూ భిన్నమైనవే! కాని కొంత సారూప్యం ఉన్నదని ఎవరైనా అంగీకరించక తప్పదు. యావత్ప్రపంచ దృష్టిని ఆకర్షించిన యీ చెకొస్లవాకియా వ్యవహారం అంతా కన్ను మూసి తెరిచినట్లు ఒకవారంలో జరిగిపోయింది. ఆగస్టు 20 వ తేదీ మంగళవారం రాత్రి పదకొండు గంటలకు సోవియెట్, మిత్రరాజ్యాల సేనలు సరిహద్దు లతిక్రమించి చెకొస్లవాకియాలో ప్రవేశించి బుధవారం మధ్యాహ్నం పన్నెండుగంటలకు అన్ని కీలకప్రాంతాలను తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి.[1] ఆగస్టు యిరువది యేడు మంగళవారంనాడు సోవియెట్ చెక్ నాయకుల సంభాషణల ఒప్పందాన్ని ప్రకటించారు. సోవియెట్ తదితర వార్సా మండలం (రుమేనియా మినహా) సేనలు చెక్-పశ్చిమజర్మనీ సరిహద్దుల్లో స్థావర మేర్పరుచుకొనడం, ప్రస్తుత ప్రభుత్వమే చెకొస్లవాకియాలో అధికారంలో వుండడం, అభిప్రాయ ప్రకటనాస్వాతంత్ర్యంమీద తిరిగి నిర్బంధాలు విధించడం ఆ ఒప్పందంలోని ముఖ్యాంశాలు. ఈ సంఘటన లన్నింటినీ సరిగా విశ్లేషించి చూస్తే కమ్యూనిస్టు దేశాల సంబంధ బాంధవ్యాలు, జర్మను సమస్య, ఐరోపా సమైక్యత, ప్రపంచరాజకీయాలలో అగ్రరాజ్యాలు భవిష్యంలో నిర్వహించే పాత్రవంటి అనేక విషయాలమీద చెకొస్లవాకియా వ్యవహారం యొక్క ప్రభావం వుండితీరుతుందని విశద మవుతుంది.

2

ప్రగతివాదులు (Progressives) అంటే కమ్యూనిస్టులేనని ఒక అభిప్రాయ వుంది. పాతుకుపోయిన వ్యవస్థలోని లోటుపాట్లను క్రుళ్ళగించి మార్పు తీసుకురావడానికి ప్రయత్నించేవారందరూ ప్రగతివాదులే. జాతివివక్షత, వలసవిధానాలకు వ్యతిరేకంగా పోరాడేవారు; శతాబ్దాల తరబడిగా పట్టిపీడిస్తున్న దారిద్ర్యాన్ని, సాంప్రదాయాలభారాన్ని నిర్మూలించి ఆర్థికాభ్యుదయంకోసం కృషి సల్పేవారు; సృజనాత్మకకృషికి ప్రోత్సాహం, భావ ప్రకటనా స్వాతంత్ర్యం కావాలని ప్రగాఢంగా వాంఛించేవారు అందరూ ప్రగతివాదులే. ప్రగతికాముకులకూ, 'ప్రస్తుత స్థితి' (Status Quo) కొనసాగాలనే వారికీ నడుమ ఎప్పుడూ సంఘర్షణ తప్పదు. ఈ సంఘర్షణ పలుతావులలో పలురీతులుగా వ్యక్తమవుతూంటుంది. ఆర్థిక ప్రగతి సాధించినతర్వాత, వ్యక్తి నడుముమీద స్వారీచేస్తున్న వ్యవస్థల భారాన్ని తొలగించే వుదారవిధానాలకు భయపడిన రష్యా ఆ విధానాలవల్ల తన నాయకత్వానికి, యితర 'వార్సా రాజ్యాల' ప్రభుత్వాల భద్రతకు ముప్పు వాటిల్లకుండా వుండటానికి చెకొస్లవాకియామీద తన బృహత్తర సైనికయంత్రాగాన్ని ప్రయోగించింది.

1956 లో 20-వ అంతర్జాతీయ కమ్యూనిస్టు మహాసభలో స్టాలిను కఠోర విధానాలకు స్వస్తి చెప్పడం జరిగిందని ప్రకటించిన తర్వాత

1. National Herold దినపత్రిక 28-8-68 న ప్రచురించిన రాయిటర్ ఏజన్సీ వార్త.

సోవియెట్‌రష్యా విధానాలలో ఎంతో మార్పు వస్తుందని అందరూ ఆశించారు. అదే సంవత్సరం హంగేరీలో రష్యన్ టాంకుల ప్రవేశం, సోవియెట్ వ్యతిరేకోద్యమం అణచివేత, ఇమ్రేనాజీ (Imre Nagy) వురితీత అందుకు విరుద్ధమై మిగిలిపోయాయి. సిద్ధాంతాల సంఘర్షణకాక అధికారం, ప్రాభవంకోసం జరిగే పోరాటపుక్రమంలో యిది ఒక దశ మాత్రమేనని రూఢిపడింది. అయితే సిద్ధాంత సంఘర్షణ అందుకు సాధనంగా వినియుక్తమవుతుందనడం సత్యమే. కానీ మొదట చెప్పినట్లు 1956 నాటికీ యీనాటికీ చాలా అంతరం వున్నది. అమెరికా రష్యాల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం దాదాపు సమసిపోయింది: రష్యాలో కృశ్చేవ్ సామూహిక నాయకత్వం (Group Leader Ship) అధికారంలోకి వచ్చింది. అమెరికా, పశ్చిమ యూరపుదేశాలలో ఆర్థికవ్యవహారాలలో ప్రభుత్వ ప్రత్యక్షప్రమేయం అధికమవుతుంటే రష్యాలో అధికార వికేంద్రీకరణ, విదేశ పత్రికల ప్రవేశానికి అనుమతి లభించడం జరిగింది.[2] అట్లాంటిక్ మండలం మీద ఫ్రాన్సు తిరుగుబాటు సల్పితే రుమేనియా వార్సా ఒడంబడికమీద కత్తి కట్టింది. ఒక లయకు అనుగుణంగా రెండు పక్షాలలో సంభవించిన యీ మార్పులు భవిష్యద్రాజకీయ స్వరూపనిర్ణయం చేయుటానికెంతో తోడ్పడుతాయి. కాపిటలిజమ్ కమ్యూనిజం వంటి విభజన అంతర్జాతీయరంగంలో పనికిరాకుండా పోతున్నది. ఒక దేశపు వ్యవస్థ ఎలాంటిదైనా అంతర్జాతీయ సంబంధాలలో ఆదేశం వ్యవహరించే తీరుతెన్నులు (Patterns of Behaviour) ఒకటే.

3

ఆగస్టు 20, మంగళవారం రాత్రి, పదకొండు గంటలకు వార్సా మండలం సైన్యాలు అయిదు వైపుల నుంచీ చెకొస్లవాకియా సరిహద్దు లతిక్రమించి లోనికి ప్రవేశించాయి. రష్యా తన ఆక్రమణ వ్యూహంలో మొత్తం ఆరులక్షల పైగా సైన్యాన్ని వినియోగించినట్లు అంచనా.[3] ఇందులో లక్షమంది పోలండు జాతీయులు, పదిహేను వేలమంది బల్గేరియన్లు, అంతే మంది హంగేరియన్లు, మిగిలినవారందరూ రష్యన్లు. తూర్పుజర్మన్ సైనికులు యీ ప్రయత్నంలో పాల్గొనలేదని పలువురి పత్రికా రచయితల అభిప్రాయం. తమ 75 వేల సైన్యం యిరుగు దేశపు ఆక్రమణ పథకాన్ని నివారించలేదని ఊహించిన చెక్ ప్రభుత్వం తన సైన్యాన్ని సరిహద్దుల నుంచి వైదొలగ వలసిందని ఆజ్ఞాపించింది. చెక్ ప్రజలను శాంతియుతనిరోధానికి ప్రేరేపించింది. అనవసర రక్తపాతాన్ని నిలువుచేసినందుకు చెక్ నాయకులు అభినందనీయు లయ్యారు.

చెకొస్లవాకియా తూర్పు, కేంద్ర యూరపు ప్రాంతాలకు పొత్తికడుపువంటిది. ఆస్ట్రియా, పశ్చిమజర్మనీ, తూర్పుజర్మనీ, హంగేరీ, రుమేనియా, పోలండు, రష్యా-అన్ని దేశాలతోనూ చెకొస్లవాకియాకు సరిహద్దులున్నవి. సైన్యాలు ప్రవేశించిన కొలది గంటలలోనే దేశపు సరిహద్దులన్నీ ఆక్రమింపబడ్డవి. అర్ధరాత్రి సుమారు రెండుగంటల ప్రాంతంలో ఆక్రమణ సైన్యాలు రాజధాని ప్రాగ్ నగరంలో ప్రవేశించి అన్ని కీలకప్రాంతాలను, రేడియో, టెలివిజను, న్యూస్ ఏజన్సీ Ceteka, పత్రికాకార్యాలయాలను చుట్టుముట్టాయి. ప్రజలు తమకు చేతనైనంతవరకూ రేడియో స్టేషను పత్రికాకార్యాలయాలను రక్షించడానికి ప్రయత్నించారు. వారిలో కొందరు తుపాకీగుండ్లకెరకావడం, మిగిలిన వారిని బలిమితో తొలగించడం జరిగింది. రష్యా ఊహలను ముందే పసిగట్టినట్లు 'రేడియో ట్రాన్స్మిటర్'లను సంచార వాహనాలపైనుంచీ అడవులు, లోయలు, కొండల వెనుక ప్రాంతాలవంటి నిర్మానుష్యమైన మూలలలో నిలిపి ప్రసారం చేయసాగారు. ప్రసారంకోసం సమాచారం సేకరించిన పద్ధతికూడా అత్యద్భుతమైనది. ఇదంతా ఆ దేశవాసుల నిబ్బరానికి, కార్యదీక్షకు సాక్ష్యం.

---

2. ఇటీవలనే London Times ను రష్యా ప్రభుత్వం అనుమతించింది. అంతకు పూర్వమే Le Monde వంటి ఫ్రెంచి పత్రికలు, Manchester Guardian వంటి ఆంగ్ల పత్రికలు ప్రచారంలో వున్నాయి.

3. Guardian Service విలేఖరి Harold Jackson ప్రాగ్ నగరంనుంచి ఆగస్టు 28 న పంపిన వార్త.

దేశంలో ఉత్పన్నమైన విషమపరిస్థితిని చర్చించడానికి చెకొస్లవాక్ జాతీయమహాసభ, కమ్యూనిస్టుపార్టీ అధిష్ఠానవర్గం సమావేశమయ్యాయి. రష్యన్ సైన్యాలు భవనంలోకి ప్రవేశించి ముఖ్య నాయకులైన అలెగ్జాండర్ డూబ్‌చెక్ (కమ్యూనిస్టుపార్టీ ప్రథమ కార్యదర్శి, నూతనోద్యమ సూత్రధారి), చెర్నిక్ (ప్రధాన మంత్రి) జోసెఫ్ స్మర్కోవ్‌స్కీ (జాతీయ మహాసభ అధ్యక్షుడు) లనుబంధించి తెలియరానిచోటుకు కొనిపోయాయి. దేశాధ్యక్షుడు సర్వసేనాని అయిన లుడ్విగ్ స్వబోదా (Ludvic Svoboda) మాత్రం బంధితుడు కాలేదు. ప్రభుత్వ భవనాలను చుట్టుముట్టిన సైన్యాలను లెక్కచేయకుండానే చెకొస్లవాక్ ప్రభుత్వ వ్యవస్థ పనిచేయసాగింది. విదేశాలలోని చెక్ రాయబారులు తమ ప్రభుత్వం తరపున అక్కడి ప్రభుత్వాలతో మంతనాలు సాగించారు. అంతర్జాతీయ సమితిలోని చెక్ ప్రతినిధి అధికారపూర్వకంగా రష్యాకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశాడు. అంటే, చెకొస్లవాకియాలో ప్రభుత్వాన్ని అధికారంలో నుంచి తొలగించి నూతన నాయకులను ప్రతిష్ఠించడానికి సుముఖత చూపలేదన్నమాట తమ ప్రభుత్వం. దాని విధానాలపైన చెక్ ప్రజలకు గల అచంచల విశ్వాసమే యిందుకు కారణం. రష్యను సానుభూతిపరులని చెప్పబడుతున్న Alois Indra, Kolder కూడా నూతన ప్రభుత్వం స్థాపించడానికి విముఖత చూపించారు. నూతనంగా ఏర్పడే యే ప్రభుత్వమైనా శాశ్వతంగా తమ టాంకుల మద్దతుమీద ఆధారపడవలసిందేనని గ్రహించిన రష్యన్లు వర్తమాన ప్రభుత్వాన్నే బెదిరించి తమకు కావలసిన తీరులో చెక్ విధానాలను నిర్ణయింప చేయడానికి పూనుకున్నారు. తత్ఫలితంగా, అధ్యక్షుడు స్వబోదా మంతనాలకోసం మాస్కో వెళ్ళారు. ఒక దేశాధిపతిని ఆహ్వానించేందుకు జరిపే ఆర్భాటాలన్నీ అక్కడ జరిగాయి. ప్రభుత్వాన్ని, పార్టీనాయకత్వాన్ని మార్చమని ఆయనను ఒత్తిడిచేశారు.

ఒకవేళ ఆయన రష్యను ప్రతిపాదనలను తిరస్కరిస్తే చెకొస్లవాకియాను విచ్ఛిన్నంచేసి ఒక భాగాన్ని (Slovakia-ఇది శ్రీ డూబ్‌చెక్ జన్మ ప్రాంతం. సంస్కరణోద్యమం ప్రారంభమైనది కూడా యిక్కడే) రష్యాలో కలిపివేసుకుని మిగిలిన భాగాన్ని రష్యన్ పర్యవేక్షణలో స్వయంప్రతిపత్తిగల ప్రాంతంగా ప్రకటిస్తామని హెచ్చరించారు.[4] అయినా శ్రీ స్వబోదా చలించలేదు. డూబ్‌చెక్, చెర్నిక్‌వంటి నాయకులుకూడా వుంటేతప్ప చెక్ ప్రభుత్వం తరఫున తాను సంభాషణలు జరపలేనని స్పష్టం చేశారు. తత్ఫలితంగా విడుదలయిన చెక్ నాయకులతోబాటు పోలండు, బల్గేరియా, హంగేరీ, తూర్పు జర్మనీ నాయకులు కూడా మాస్కో మంతనాలలో పాల్గొన్నారు. రష్యన్ ఒత్తిడి అనిరోధ్యమైంది. ఒప్పందం కుదిరింది. అందులో ముఖ్యమైన అంశాలు రెండు. ఒకటి-పత్రికలు, రేడియో టెలివిజనువంటి ప్రచారాలమీద సెన్సారు నిబంధనలు అమలు జరిపి చెక్ ప్రభుత్వం వాటి స్వాతంత్ర్యాన్ని అరికట్టాలి. రష్యను సైన్యాలు దేశం అన్నిప్రాంతాలనుంచీ ఉపసంహరించుకొని కొంతభాగం పశ్చిమజర్మనీ సరిహద్దువద్ద కేంద్రీకరింపబడేటట్లు, మిగిలినవి దేశం వదలిపోవడం రెండవది. ఇంకొక ప్రధానమైన అంశం, అంతర్జాతీయ సమితిలో చేసిన ఫిర్యాదును చెక్ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. ఈ ఒప్పందంలో అంతర్లీనమైన మరొక విషయమేమంటే చెక్ నాయకులు ఒప్పందంలోని అంశాలను అమలు జరిపేంతకాలం వారిని తొలగించి నూతనప్రభుత్వం ఏర్పరిచే ఆలోచనకు రష్యా రాదు.

ఒకటి బలవంతము, మరొకటి బలహీనము అయిన పక్షాలమధ్య కుదిరిన యీ ఒప్పందం ఎంతకాలం నిలుస్తుంది? పొంగిపొరలే ప్రజావాహిని అభిప్రాయాన్ని చెక్ ప్రభుత్వం నిలువరించగలుగుతుందా? అన్న ప్రశ్న లిక్కడ మొలకెత్తుతాయి. వాటిని తరువాత పరిశీలిద్దాం. ముందు చెకొస్లవాకియాలో రష్యన్ల కాగ్రహం కల్గించిన మార్పులను, వాటి మూలశక్తులను పరామర్శించడం సమంజసం.

4

చెకొస్లవాకియా ప్రజలు స్వతహాగా మర్యాదస్థులు. లొంగకుండా పరిస్థితుల నెదుర్కొంటూ

4. ఈ వార్తను ఒక చెక్ కమ్యూనిస్టు పార్టీ ఉన్నతాధికారి వెల్లడించినట్లు 29 ఆగస్టున రాయిటర్ న్యూస్ ఏజన్సీ ప్రకటించింది.

ముందుకు సాగిపోయేవారు. కళాభిమానం, అభినివేశం కలవారు. ఇరుగుపొరుగు దేశాలతో సఖ్యంగా ఉన్నందుకు (రష్యా, జర్మనీలతో సరిహద్దులుకల దేశమదొక్కటే) ఆ దేశం ముప్పది సంవత్సరాలలో మూడుసార్లు దురాక్రమణ గురయింది. 1939, 1948, 1968 సంవత్సరాలను ఆ దేశ ప్రజ లెప్పటికీ మరువజాలరు. 1939 మార్చి 18 న యుద్ధం నివారించడంకోసం అప్పటి చెక్ అధ్యక్షుడు హిట్లరుతో సంభాషణల నిమిత్తం బెర్లిను వెళ్లారు. ఆయన బెర్లినులో దిగిన రోజే జర్మను సైన్యాలు చెకొస్లవాకియాలో ప్రవేశించాయి. తమ ప్రభుత్వాన్ని లొంగిపోవ నాదేశించవలసిందిగా ఒత్తిడిచేశారాయనను జర్మన్లు; లేనియెడల ప్రాగ్ నగరాన్ని బాంబులతో ధ్వంసం చేయుగలమని హెచ్చరించారు. ప్రజానాశనానికి భయపడి ఆయన రాజధానికి టెలిఫోను చేయడం, చెక్ ప్రభుత్వం లొంగిపోయినట్లు ప్రకటించడం జరిగింది. ఎంతటి పారూష్యం!

1918 లో చెకొస్లవాకియా రిపబ్లిక్ అవతరించింది. ఆస్ట్రో-హంగేరియను సామ్రాజ్యంలో భాగాలైన బొహీమియా (Bohemia), మొరేవియా (Moravia), సైలీసియా (Silesia), స్లవాకియా (Slavakia) లను కలిపి యీ దేశాన్ని రూపొందించారు. పదునాలుగు మిలియన్ల ప్రస్తుత జనాభాలో సగంపైగా చెక్‌లు, నాలుగు మిలియన్ల స్లవక్‌లు, ఏడులక్షల మంది మాగ్యార్లు (Magyars), అయిదు లక్షల జర్మన్లు వున్నారు. జర్మనీ నానుకొని వున్న మొరేవియా, బొహీమియాలలోని జర్మను జాతి వారు 1933 లో Sudeten-German Party ని స్థాపించారు 1938 సెప్టెంబరులో జరిగిన మూనిక్ ఒడంబడిక (Munich Agreement) ప్రకారం మొరేవియా, బొహీమియాలు జర్మనీకి చెందుతాయనీ, ఆ భూభాగాన్ని జర్మనీ ఆక్రమించుకోవచ్చునని ప్రకటించబడింది. మ్యూనిక్ చర్చలలో పాల్గొన్న యింగ్లండు, ఫ్రాన్సు, యిటలీలుకూడా యిందు కంగీకరించాయి. చెకొస్లవాక్ ప్రతినిధి ఎవరూ ఆ చర్చలలో పాల్గొనలేదు. దొంగలు దొంగలుచేరి ఊళ్ళు పంచుకున్నారట! జర్మన్ పరాజయంతో రెండవ ప్రపంచ యుద్ధం సమాప్తమైంది. చెకొస్లవాకియాలో 1939 నుంచి 1945 వరకు అధికారం నెరపిన జర్మను సైన్యాలు తొలగిపోయాయి. ఆ తొలగించడంలో రష్యా ముఖ్యపాత్ర వహించింది. కమ్యూనిస్టులు, సోషలిస్టులు, సోషల్ డెమొక్రాట్లు భాగస్వాములుగాఉన్న మిశ్రమప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 1946 ఎన్నికలలో, పడిన వోట్లలో 38 శాతం సంపాదించిన కమ్యూనిస్టుపార్టీ అధిక సంఖ్యాకపక్షంగా రూపొందింది. ఎన్నికల తర్వాత Clement Gotwald నాయకత్వాన యింకొక మిశ్రమప్రభుత్వం నాయకత్వంలోకి వచ్చింది. ఇందులో కమ్యూనిస్టు ప్రాతినిధ్యం అధికంగా వున్నది. సోషల్ డెమొక్రాట్లకు చెందిన Edward Benes దేశాధ్యక్షుడుగా వుండేవాడు. 1939 నాటికి ఉత్కృష్టమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించుకొన్నది చెకొస్లవాకియా. కాని యుద్ధతాండవంవలన ఆ వ్యవస్థ నడుం విరిగిపోయింది. రోకటి పోటులా 1947 లో వర్షాలులేక తీవ్రక్షామం ప్రబలింది. కమ్యూనిస్టు సిద్ధాంతవాది అయిన Gottwald మార్షల్‌ప్లాను క్రింద పశ్చిమదేశాలనుంచి సహాయం స్వీకరించ నిరాకరించాడు. రష్యా ప్రోద్బలంకూడా కొంతవరకూ యిందుకు కారణమే. ఈ అస్తవ్యస్త స్థితివల్ల దేశంలో మరొకసారి న్నికలు జరపవలసి వచ్చింది. ఆ ఎన్నికలలో కమ్యూనిస్టులు అధికారంలోకి రాలేకపోవచ్చునని ఊహించిన Gottwald ఒక పథకం రచించి తనకు ప్రతిస్పర్థులైన నాయకులందరినీ తొలగించి, కొందరిని నిర్మూలించి తన మార్గాన్ని సుగమం చేసుకున్నాడు. బయటనుంచి రష్యా సానుభూతి సహాయమూ లభించాయి, యీ ప్రణాళికను అమలు పరచడంలో. ఇది ఫిబ్రవరి 1948 లో మాట. అప్పటి విదేశాంగమంత్రి శ్రీ మాసరిక్ (Masarik) తన కార్యాలయపు పైఅంతస్తునుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రకటించారు. (శ్రీ మాసరిక్ మరణాన్ని గురించి పునఃపరిశీలన జరపవలసిందిగా నూతన చెక్ ప్రభుత్వం ఆదేశించింది. రష్యాకు కోపభూతమైన కారణాలలో యిదికూడా ఒకటి కావచ్చును.) సోషల్ డెమొక్రాట్లు కమ్యూనిస్టులతో చేతులు కలిపారు. ఇరువురూ కలిసి నేషనల్‌ఫ్రంటు అనే పేరుగల ఏకైక

రాజకీయపక్షాన్ని స్థాపించారు. ఎన్నికలలో ప్రజలు చేయవలసింది ఫ్రంటు అభ్యర్థులకు సుముఖంగాగాని వ్యతిరేకంగాగాని వోటు చేయడమే. రెండవ రాజకీయ పక్షం, ప్రత్యర్థులు అంటూ ఎవరూ లేరు. సోషల్ డెమొక్రాట్లు కమ్యూనిస్టులతో కలవడానికి ఒక ముఖ్యకారణం వున్నది. మ్యూనిక్ ఒడంబడిక మూలంగా పశ్చిమ దేశాలు ముఖ్యంగా యింగ్లండు, ఫ్రాన్సు చెకొస్లవాకియా ప్రజల సానుభూతిని కోల్పోయాయి. పైపెచ్చు రష్యా కమ్యూనిస్టుపార్టీకి అన్నివిధాలా సహాయం అందజేస్తున్నది. జర్మనీ అంటే భయం యింకా తొలగలేదు. ఈ పరిస్థితులలో రష్యాతో సైనిక ఒప్పందంతప్ప చెక్ జాతీయవాదులకు మరో త్రోవ కానరాలేదు. తరువాత, ఎన్నికలలో నేషనల్ ఫ్రంటు అత్యధిక సంఖ్య వోట్లతో అధికారంలోకి వచ్చింది. పరిశ్రమలు, వ్యాపారం జాతీయం చేయబడ్డవి. 1949-53, 1956-60 లో అమలు చేసిన ప్రణాళికల మూలంగా దేశాదాయం అధికంగా పెరిగింది. ఉక్కు, జలవిద్యుచ్ఛక్తి, ఖనిజాలు, బొగ్గువంటి వస్తువుల ఉత్పత్తి యిబ్బడి ముబ్బడయింది. ఈ వస్తువులలో అధికభాగం రష్యాకు యెగుమతయ్యేవి. ముడిసరకులకుగాని, తయారైన వస్తువుల 'మార్కెటు'కు గాని చెకొస్లవాకియా ఆర్థిక వ్యవస్థ రష్యామీద విరివిగా ఆధారపడవలసిన స్థితి ఏర్పడిపోయింది.

5

1957 లో అంటోనీ నొవోట్నీ (Antonie Novotny) అధికారంలోకి వచ్చాడు. మొదటిసారి ఎన్నికైనప్పుడు ఆయన పదవీకాలం ఏడు సంవత్సరాలు. చెకొస్లవాకియా అధ్యక్షపదవితోబాటు తన పూర్వపు కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి పదవిని కూడా తనతోనే వుంచుకున్నాడు. నొవోట్నీ స్టాలిను శిక్షణలో పెరిగినవాడు. రష్యాలో 1956 నుంచి సాగిన లిబరల్ ఉద్యమపు వాసనలుకూడా తన దేశంపైపు తగులకుండా సాధ్యమైనంతవరకూ కాపాడుకుంటూ వచ్చాడు. రష్యాలో జరిగిన ప్రభుత్వ, పార్టీ పదవుల విభజనను తన దేశంలో అమలు జరపలేదు. రాజకీయ ప్రతిస్పర్థులను నిర్దాక్షిణ్యంగా అణగద్రొక్కాడు. ఆయనను గురించి లండను వామపక్ష వారపత్రిక New Statesman యిలా వ్రాసింది: 'The iron-fisted beaurocrat, who during his regime deprived fifty thousand victims of arbitrary trials of their rights, dignity and any means of earning a livelihood.........' (ఈ కబంధహస్తుడు తన పాలనాకాలంలో యేబదివేల మందిని బూటకపు విచారణలు జరిపి వారి హక్కులను, మానాన్ని, జీవనభృతినిసంపాదించుకునే అవకాశాలను నిర్మూలించాడు.) నొవోట్నీ పదవీకాలంలో రాజకీయరంగంలోనేకాక ఆర్థికరంగంలో కూడా అసంతృప్తికరమైన విధానాలు అవలంబించబడ్డవి. ప్రజలు కొనడానికి యిచ్చగించని వస్తువులను వుత్పత్తి చేసే పరిశ్రమలకు సహాయం చేయడానికి 'సబ్సిడీ'ల పథకాన్నొదాన్ని ఆరంభించి ఆర్థికవేత్తల విమర్శకు పాత్రుడైనాడు. ప్రభుత్వం నిర్ణయించిన వివిధవస్తువుల ధరలు కనీసపు వుత్పత్తి ఖర్చులుకూడా గిట్టుబాటు కాకుండాపోయాయి. పరిశ్రమల స్థాపనలో అన్నిప్రాంతాలకు సమానావకాశా లీయబడలేదు. స్లోవక్‌లు తమ ప్రాంతం నిర్లక్ష్యం చేయబడిందని ఆందోళన సాగించారు.[5] స్లోవక్ ప్రాంత కమ్యూనిస్టు పార్టీ యీ ఆందోళనకు నాయకత్వం వహించింది. దేశంలోని ప్రముఖ ఆర్థికశాస్త్రవేత్త డా॥ ఆటా సిక్ (Ota Sik) ఒక ఆర్థిక సంస్కరణల పథకాన్ని రచించి ప్రజలలో ప్రచారం చేయ నారంభించాడు. స్లొవాకియాప్రాంతాన్ని యిందుకు యెన్నుకొన్నాడు. రైతుల్ల పురమందిరాలలోనూ పాఠశాలభవనాలలోనూ కార్మికకేంద్రాలలోనూ తన ప్రతిపాదనలను వివరించేవాడు. ప్రజలు ఆయన ఉపన్యాసాలలో యెంతో ఉత్సాహాన్ని కనబరిచారు. ఈ విషయం నొవోట్నీకి తెలిసిందికాని స్లోవక్‌ప్రాంతీయ అసంతృప్తి అక్కడి కమ్యూనిస్టుపార్టీ వ్యతిరేకతను పురస్కరించుకొని ఆయన వెంటనే యేమీ చేయలేకపోయాడు. శ్రీ ఆటా సిక్ చేసిన ముఖ్యప్రతిపాదనలివి: సబ్సిడీల పథకానికి స్వస్తి చెప్పడం, గిరాకీలేని వస్తువుల ఉత్పత్తిని నిలిపివేయడం, ఉత్పత్తి విధానాల ఆధునికీకరణ, అంతర్జాతీయ వ్యవస్థలనుంచి ఏ రూపంలో

5. శ్రీ నొవోట్నీ బొహీమియాప్రాంతానికి చెందినవాడు.

నైనా మార్చుకోగల్గిన 500 మిలియను డాలర్ల ఋణాన్ని సంపాదించడం—ఆ మొత్తాన్ని యీ సంస్కరణలు అమలుపరచడానికి వినియోగించడం. కొంతమంది యీ సంస్కరణోద్యమానికి 'మధ్యతరగతి విప్లవం' అనిపేరు పెట్టారు. దీనినే రష్యా 'విప్లవ వ్యతిరేకోద్యమం' (Counter-revolutionary movement) అని దుయ్యబట్టింది.

ఆర్థికసంస్కరణలు, రాజకీయ స్వాతంత్ర్యం, ప్రాంతీయసమానత్వం లక్ష్యాలుగా చెకొస్లొవాకియాలో నూతనోద్యమం ఆరంభమై అసంఖ్యాక ప్రజానీకపు సహాయసహకారాలను చూరగొన్నది. విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులు, పత్రికా రచయితలు శాస్త్రవేత్తలు మున్నగువారీ వుద్యమానికి అంకురార్పణ చేశారు. విద్యార్థులు, కార్మిక యువజనులు వెంటనే రంగంలోకి వురికారు. ఇటువంటి ఉద్యమాలే తూర్పుజర్మనీ, పోలండు, హంగేరీలలో కూడా ప్రస్ఫుటమయ్యాయి. విద్యావిధానాన్ని సంస్కరించాలనీ, విశ్వవిద్యాలయాలపాలనావిషయంలో విద్యార్థులకు ప్రాతినిధ్యం వుండాలనీ అక్కడి విద్యావేత్తలు, విద్యార్థులు వాదించారు. అయితే యీ లిబరల్ వుద్యమం చెకొస్లొవాకియాలో మున్ముందు జయప్రదం కావడానికి దేశపు ప్రజల చరిత్ర, సంస్కృతి యొక్క పరిణతి ముఖ్యకారణం.

మొదటి ఏడు సంవత్సరాల పదవీకాలం పూర్తి కాగానే శ్రీ నొవొట్నీ 1964 లో తిరిగి అధ్యక్షుడుగా యెన్నుకొనబడ్డాడు. ఆయనమీద వ్యతిరేకత కూడ బలం పుంజుకోనారంభించింది. ఈ వ్యతిరేకతకు కేంద్రస్థానం స్లొవక్ ప్రాంతంలోని ట్రెన్సిన్ (Trencin) అనే పట్టణం. శ్రీ డూబ్ చెక్ కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తగా తన జీవితాన్ని యిక్కడే ఆరంభించాడు. ఇదే పట్టణం దేశస్థాయిలో ఆయన నాయకుడుగా తయారవడానికి మూలమైంది. 1966 లో ట్రెన్సిన్ పట్టణ కమ్యూనిస్టుపార్టీ సమావేశానికి శ్రీ నొవొట్నీ హాజరయ్యారు. ఆయన భోజనాన్ని తనవెంట తెచ్చుకొన్నారట. బ్రెడ్, జామ్ మున్నగు పదార్థాలనుంచి ఒక పాకెట్ తయారు చేసి పట్టుకు రాబడిందట. దానిని తన ముందు టేబిలుపైనుంచి ఉపన్యాస మిస్తుండగా ప్రక్కనే కూర్చున్న శ్రీ డూబ్ చెక్ ఆ పాకెట్టును చేతివ్రేళ్లతో అటూ యిటూ కదలించ నారంభించాడట. నొవొట్నీ వెనుక నిలబడివున్న అంగరక్షకుడు వెంటనే చేతులు చాచి దానిని లాక్కున్నాడట. దీనినిబట్టి శ్రీ నొవొట్నీకి స్లొవక్ ప్రాంతమంటే ఎంత అనుమానమో వెల్లడవుతుంది. ఈ కథ 'Sandwitch Affair' పేరుతో దేశమంతటా ప్రసిద్ధి కెక్కింది.

1967 డిసెంబరునాటికి శ్రీ నొవొట్నీని దింపివేయాలనేవారి సంఖ్య కమ్యూనిస్టుపార్టీ ప్రిసీడియంలో అధికమైంది. డిసెంబరు 21 వ తేదీన ట్రెన్సిన్ పట్టణ పార్టీ సాధారణ సమావేశం జరిపి నొవొట్నీ దిగిపోవాలని తీర్మానించింది. పరిపాలనలో అసమర్థత, ప్రాంతీయ పక్షపాతం, ఆర్థిక విధానాల వైఫల్యం యిందుకు కారణాలుగా పేర్కొన్నది. ఈ తీర్మానాన్ని కవరులో పెట్టి కేంద్రపార్టీ కమిటీకి పోస్టుచేస్తూ ట్రెన్సిన్ పట్టణ పార్టీ అధ్యక్షుడు తనతోవున్న ఒక మిత్రుడితో అన్నాడట[6]: 'ఇంకొక వారం పది రోజులలో నన్ను అరెస్టు చేయడానికి, ఏదో ఫాక్టరీలోనుంచి వస్తువులను దొంగిలించానని నామీద నేరం ఆరోపిస్తే నీవు విశ్వసించకూడదు.' కాని పరిస్థితులు అప్పుడే ఒక విశిష్టరూపాన్ని ధరించాయి. 1968 జనవరి మూడవ తేదీ కేంద్ర కమ్యూనిస్టుపార్టీ ప్రిసీడియము నొవొట్నీని అధ్యక్ష పదవి పార్టీకార్యదర్శిపదవులనుంచి తొలగిస్తూ, తీర్మానించింది. ఆయన ప్రస్తుతం ప్రాగ్‌నగర శివార్లలో తన భార్యతో నివసిస్తున్నాడు.

నొవొట్నీ దిగిపోవడంతో ప్రభుత్వంలోనూ పార్టీలోనూ నూతన నాయకత్వం అవతరించింది. అది అవలంబించిన సంస్కరణల విధానాలను, ఆక్రమణకు ఒడిగట్టిన రష్యా ఏ కారణాలతో ప్రభావితమైనదో వానిని మూలంగా అవలోకించాలి మనం.

---

6. New Statesman, 16—8—68, London.

6

చెకొస్లవాకియాలో నూతన నాయకత్వం సంస్కరణలను ముఖ్యంగా రెండు మార్గాలలో ప్రవేశపెట్టింది. ఒకటి రాజకీయ రంగంలోనూ, రెండవది ఆర్థిక రంగంలోనూ. ఈ రెండు రంగాలలో చెలరేగిన అసంతృప్తి నొవోట్నీ పతనానికి దారి తీసిందని ముందు చెప్పుకున్నాము.

పత్రికలు, రేడియో, టెలివిజన్లమీద ఆంక్షలు తీసివేయడం మొదటి చర్య. ప్రభుత్వం తరఫున 'వండిన' వార్తలుకాక నిష్పక్షపాతంగా సమస్యలను విశ్లేషించి ప్రజాచైతన్యానికి త్రోవ చూపించే రచనా స్వాతంత్ర్యం రావడంతో దేశమంతా ఆనందోత్ఫుల్లమైంది. పార్టీ ప్రభుత్వ పదవులను వేరుచేయడం రెండవ చర్య. ఈ సంస్కరణ రష్యాలో యిటీవలనే అమలులోకి వచ్చింది. హంగేరీకూడా అదే పద్ధతి నవలంబించింది. కాని తూర్పుజర్మనీ, బల్గేరియా, పోలండువంటిచోట్ల పార్టీ నాయకత్వం, ప్రభుత్వాధిపత్యం రెండూ కూడా ఒకే వ్యక్తి చేతుల్లో వున్నాయి. పార్టీ వ్యవస్థ ప్రభుత్వనాయకుల చేతుల్లో లేకపోతే వారి రాజకీయభవితవ్యం అస్పష్టమే. తిరిగి ఎటువంటి వ్యక్తులు అధికారంలోకి వస్తారో తెలియదు. రష్యా ఆ 'రిస్కు' తీసుకునేందుకు అంగీకరించలేదు. అందుచేతనే Ulbricht, Zhikov, Gomulka వంటివా రాదేశాలలో రష్యా సైనిక సహకారంమీద అధిపతులుగా చెలామణి అవుతున్నారు. చెకొస్లవాకియా యీ పద్ధతిని తొలగించి పార్టీ ప్రభుత్వ విధులను, కార్యకలాపాలను స్పష్టంగా చట్టరీత్యా నిర్వచించడానికి ప్రయత్నించింది. ఇక మూడవది, కేవలం రాజకీయనాయకులు కాకుండా వివిధ రంగాలలో ప్రముఖులుగా పేరొందిన వ్యక్తులను ప్రభుత్వంలోకి ఆహ్వానించి పరిపాలనను సంస్కరించ బూనుకోవడం. ఇందుకు ఉదాహరణ, ఆర్థికశాస్త్రవేత్త డా॥ ఆటా సిక్‌కు ఉపప్రధానమంత్రి పదవి నీయడం, అంతర్జాతీయ సంబంధాల విషయంలో నిపుణుడైన శ్రీ జిరీ హాయక్‌కు విదేశాంగ మంత్రిపదవి నీయడం. ఇలాంటి ప్రభుత్వాన్నే Technocracy అంటారు.

ఆర్థికరంగంలో శ్రీ ఆటా సిక్ సూచించిన విధానాలను అమలు జేయడానికి పూనుకున్నది చెక్ ప్రభుత్వం. పరిశ్రమలలో సాంకేతికంగా పురాతనమైన యంత్రపరికరాలను తొలగించి నూతన యంత్రాలతో ఆధునికీకరణ ఆరంభించింది. ప్రజాధనాన్ని దుర్వినియోగపరచే సబ్సిడీల పథకం తొలగించబడింది. 'మార్కెట్' వ్యవస్థద్వారా ధరల నిర్ణయంవంటి వాటిని కొన్నిరంగాలలో పునరుద్ధరించడం, ఇంకా నెమ్మదిగా పశ్చిమదేశాలతో ఆర్థిక సహకారం పెంపొందించుకునే పద్ధతులపై ఆలోచన ఆరంభమైంది.

*　　*　　*

రష్యా చెకొస్లవాకియామీద ఎందుకు దాడి చేసింది? స్థూలంగా చెప్పాలంటే పై సంస్కరణలు దానికి నచ్చలేదు. అయితే విచిత్రమేమంటే, సోషలిస్టుదేశాల 'సౌభ్రాతృత్వానికి' పట్టుగొమ్మ అయిన రష్యాలోనే యీ సంస్కరణలు చాలావరకు అమలు జరుపబడ్డవి. అందుచేత రష్యా చెకొస్లవాకియాను 'విప్లవ వ్యతిరేక' (Counter Revolutionary) దేశం అని నిందించడం అర్థరహితం. రష్యాలో వ్యవసాయరంగంలో కొన్ని సారవంతమైన భూములను వ్యక్తుల పర్యవేక్షణ, యాజమాన్యం క్రిందకు వదిలివేశారు. రష్యా నదిఒడ్డుమీద ఓల్గాతీరంలో 'కాపిటలిస్టు' వ్యవస్థయొక్క బ్రహ్మాండమైన చిహ్నం ఇటాలియన్ - ఫియట్ కంపెనీ కర్మాగారం రూపంలో వెలుస్తున్నది. ఇంకా అంతదూరంపోని చెకొస్లవాకియాను యీ విధంగా మందలించలేమని రష్యాకు తెలుసు. ఎప్పుడైతే చెక్ ప్రభుత్వం పత్రిక రేడియోలమీద సెన్సారునిబంధనలు సడలించిందో అప్పుడు రష్యాకు కంపరం మొదలయింది. సంపూర్ణపత్రికా రచనా స్వాతంత్ర్యం సోషలిస్టు వ్యవస్థకే విరుద్ధమని ఆరోపిస్తూ తన గుట్టు తానే బట్టబయలు చేసుకున్నది. స్వేచ్ఛావిహంగాలైన చెక్ పత్రికా రచయితలు రష్యా తదితర తూర్పు యూరపురాజ్యాల విధానాలను తీవ్ర విమర్శకు గురిచేయగలరన్న భయం మొదటి కారణం.

పోలండు, బల్గేరియా, తూర్పుజర్మనీ, హంగేరీలు తెచ్చిన ఒత్తిడి రెండవ కారణం. లిబరల్ వుద్యమం చెకొస్లవాకియాలోనేకాక పై దేశాలలో

కూడా ఉధృతంగా సాగింది. ఎలాగో ఆ దేశపు ప్రభుత్వాలు వాటిని తట్టుకొని నిలబడ్డాయి. అదే ఉద్యమం చెకొస్లవాకియాలో జయప్రదం కావడం గమనించి ఆ దేశాలలో మళ్లీ యువజనులు, మేధావి వర్గం బలం పుంజుకొని ఆందోళన కొనసాగించవచ్చును. ఆ తాకిడికి నిలబడలేమని నాయకులకు తెలుసు. ఒక్కొక్క దేశమే తన ప్రాభవంనుంచీ తప్పించుకుపోవడం రష్యాకూ తీరని అవమానం. అంతర్జాతీయ రాజకీయాలలో తన స్వార్థదృష్ట్యా, ఆ దేశాలలో తమ మిత్రులను పదవిలో నిల్పడంకోసం రష్యా యీ పని చేసింది. ఇది ఆ దేశాలలో ప్రభుత్వ వ్యతిరేక నాయకులందరికీ ఒక హెచ్చరిక. ముఖ్యంగా 1960 నుంచీ రష్యాపట్ల తిరస్కారభావంతో ప్రవర్తిస్తున్న రుమేనియాకు హెచ్చరిక!

వీటన్నిటి వెనుకనున్నది జర్మనీ సమస్య. చెకొస్లవాకియా రష్యాను జర్మనీని భౌగోళికంగా కలుపుతుంది. చెకొస్లవాకియాలో ప్రచురింపబడే జర్మన్ పత్రికలు తూర్పు జర్మన్ ప్రజలను ప్రభావితం చేస్తాయి. అందువలన తూర్పు జర్మనీలో క్రొత్త ఉద్యమాలు తలెత్తుతాయి. ఆఖరుకు తూర్పు జర్మన్ ప్రభుత్వం కూడా యీనాటికీ జర్మను సమైక్యతకు ఏవిధమైన వ్యతిరేకతను అధికారరీత్యా ప్రకటించలేదు. ఇక ప్రజల సంగతి సరేసరి. ఈ విధంగా కొద్దికాలంలో జర్మనీ ఏకమయ్యే అవకాశం లేకపోలేదని గ్రహించింది రష్యా. రష్యా జర్మనీ సంబంధాల విషయం చరిత్ర చదివిన వారందరికీ తెలుసు. అందుచేత, చెకొస్లవాకియాలో పశ్చిమ జర్మనీకి ఎలాంటి ప్రవేశమూ యివ్వడం రష్యాకు ప్రమాదకరం.

కారణాలెంత సమంజసమూ[7], తర్కబద్ధమూ అయినా రష్యా చేసిన పని దురహంకారపూరితము గర్హ్యమూ అని అందరూ అంగీకరిస్తారు. సైనిక దురాక్రమణ కొడిగట్టడంద్వారా, 'సామ్రాజ్యవాదులనూ, వలసవాదులను, ఖండించే రష్యా తానే వారిలో ఒక భాగమైంది ఇది రష్యా చరిత్రకు మరొక కళంకం. ఈ విషయం సూక్ష్మగ్రాహులైన రష్యన్ నాయకులకు తెలియకకాదు. కాని వారి ప్రభుత్వ వ్యవస్థలోని ఒత్తిడులు యిందుకు చాలావరకు కారణం. మీదు మిక్కిలి, చెకొస్లవాకియాను నూతన మార్గంనుంచీ వెనుకకు మరల్చడానికి అన్నివిధాలా ప్రయత్నించి విఫలమైంది రష్యా. జనవరినెలలో చెకొస్లవాకియా నాయకత్వం మారిన దగ్గరనుంచీ రష్యా హెచ్చరిక ప్రకటనలు చేస్తూనే వచ్చింది. ఫిబ్రవరిలో కమ్యూనిస్టుపార్టీల అంతర్జాతీయ సమావేశం జరిపింది. అందులోనే పాల్గొనడానికి వచ్చిన రుమేనియా మధ్యలోనే రష్యాను ఖండించి సమావేశం నుంచి నిష్క్రమించింది. తరువాత రుమేనియా చెకొస్లవాకియా ప్రభుత్వాన్ని సమర్థిస్తూ ప్రకటన చేసింది. రష్యా వార్సాకూటమి రాజ్యాలతో చర్చలు జరిపింది. ఈ చర్చలలో రుమేనియా నాహ్వానించలేదు. ఈ తతంగం యేదీ చెకొస్లవాకియాను తను నిర్ణయించుకున్న మార్గంనుంచీ ఒక్క అంగుళంకూడా వెనుకకు మరల్చలేదు. చివరకు రష్యా చెక్ కమ్యూనిస్టుపార్టీ ప్రిసీడియమ్‌తో ముఖాముఖి చర్చలు జరపాలని నిర్ణయించి ఆహ్వానాలు పంపింది. చెకొస్లవాకియా మొదట ఇందుకంగీకరించలేదు. ప్రిసీడియము సభ్యులందరూ డ్యూబ్ చెక్‌ను సమర్థించరని రష్యా ఆశించింది కాని, తన భూభాగంలో చర్చలు జరిపినట్లయితేనే అందుకంగీకరించగలమని చెకొస్లవాకియా ప్రకటించింది. రష్యా యిందుకు సమ్మతించింది. చెక్, సోవియెట్ సరిహద్దుల్లో చెకొస్లవాకియాలోని సియెర్నా (Cierna) పట్టణంలో చర్చలు ప్రారంభమయ్యాయి. ఒకటి రెండు రోజులలో ముగుస్తాయని భావించిన చర్చలు నాలుగు రోజులు కొనసాగాయి. రష్యన్ నాయకులు రోజూ ఉదయం రైలులో సియెర్నావచ్చి సాయంత్రం తిరిగి

---

7. ఇక్కడ 'సమంజసము' అంటే అంతర్జాతీయ న్యాయదృష్ట్యాకాదు. అంతర్జాతీయ రాజకీయాలలో ప్రతిదేశమూ తన అసక్తులను పరిరక్షణ చేసుకోవటమే కర్తవ్యంగా భావిస్తుంది. బలవంతమైన దేశానికి అందుకు అవకాశాలు హెచ్చు. ఈ దృష్ట్యా రష్యా వైపునుంచి అవలోకిస్తే 'సమంజసం' అని అర్థం.

రైలులో రష్యాకైవెళ్ళి తమ ఆవాసంలో భుజించి నిద్రించేవారు. కాని సియెర్నా సమావేశంవలన తేలిన విషయమేమిటంటే చెకొస్లవాకియా కమ్యూనిస్టు పార్టీలో రష్యా సానుభూతిపరులైన నాయకులుకూడా బయటపడి చెక్ ప్రభుత్వ విధానాలను ఖండించడాని కంగీకరించలేదు. పైగా రష్యన్‌పక్షానే అభిప్రాయ భేదాలున్నట్లు ద్యోతకమైంది. తరువాత రష్యా బ్రాటిస్లావా (Bratislava—ఇది. స్లవాకియా రాష్ట్ర రాజధాని) లో తన మిత్రులైన మిగిలిన తూర్పు యూరపు రాజ్యాలతోసహా చెకొస్లవాకియాతో ఒక ఒప్పందంమీద సంతకాలు చేసింది. ఆ ఒప్పందంలోని భాష అంతా స్టాలినుకాలపు భాషను పునస్స్మృతికి తెస్తుంది. అదే చెక్ నాయకులమీద ఒత్తిడి జయప్రదమైందనడానికి ప్రథమ సూచన. తర్వాత కొంతకాలంపాటు వార్సా మండలం సైన్యాలు చెక్ సరిహద్దుల్లో శిక్షణపేరులో కేంద్రీకరించబడ్డాయి. రష్యా ఉద్దేశాలపట్ల ప్రపంచప్రజానీకానికి అనుమానం రేకెత్తింది. చివరకు ఆక్రమణ జరిగింది. ఈ నిర్ణయాన్ని శ్రీ కోసిగిన్, రష్యన్‌పార్టీ సిద్ధాంతకారుడు శ్రీ సుస్లోవ్ వ్యతిరేకించారని, రష్యా రక్షణ మంత్రి, సేనానులు, అలెగ్జాండరు షెలిపిన్ మొదలైన ప్రిసీడియము సభ్యులు సమర్థించారని చెప్పబడుతున్నది. రష్యా మహత్తరమైన సైనిక యంత్రాంగాన్ని నిర్మించింది. సహజంగా సైనిక నాయకులకు ప్రభుత్వ విధానాల నిర్ణయంలో ప్రభావం కనపరచే అవకాశం వుంది. బోల్షివిక్ విప్లవం ఆదిలో పార్టీ తాలూకు Political Commissars సైన్యంమీద ప్రభావం నెరపేవారు. నేడది విపర్యయమైంది.

7

రష్యా సైనికచర్యవలన ఒక విషయం ద్యోతకమవుతుంది అగ్రరాజ్యం అని గుర్తింపబడడానికి తాపత్రయపడుతున్న చైనా ఆదినుంచీ యీ విషయాన్ని ఉటంకిస్తూనే వచ్చింది. ప్రపంచ భూభాగాన్ని 'ప్రాభవపు పరిధులు' (Spheres of Influence) గా విభజించి వాటిమీద అగ్రరాజ్యాల ప్రాభవాన్ని అంగీకరించడం అమెరికా రష్యాల లక్ష్యంగా కనబడుతుంది. దక్షిణ అమెరికాదేశాలలోని కమ్యూనిస్టుపార్టీలకు రష్యా సహాయం చేయడం మానుకున్నది అందుకు ప్రతిగా అమెరికా తూర్పు యూరపురాజ్యాల వ్యవహారాలలో ఆసక్తి ప్రదర్శించడం మానుకున్నది. ఇలాగే కొంతకాలం గడిస్తే ఆగ్నేయ ఆసియానుకూడా చైనా 'ప్రాభవపు పరిధి'గా అంగీకరించే ప్రమాదం లేకపోలేదు. ఇది భారత దేశానికి గొడ్డలిపెట్టువంటిది. స్వశక్తిమీద ఆధారపడటంతప్ప యీ పరిస్థితులలో భారతదేశానికి వేరు మార్గం గోచరించదు.


అంతరించిపోయాయనుకున్న ప్రచ్ఛన్న యుద్ధచ్ఛాయలు తిరిగి అవతరించాయి చెకొస్లవాకియా వ్యవహారం అమెరికా అధ్యక్షపదవికి జరిగే ఎన్నికల మీద చాలా ప్రభావం చూపుతుందని అనేకుల విశ్వాసం. శ్రీ రిచర్డు నిక్సన్ అప్పుడే తన ప్రకటనలో డల్లెస్ కంఠాన్ని ధ్వనింపజేశారు. రష్యా తన అనాలోచితచర్యవలన శ్రీ నిక్సన్ ఎన్నికయ్యే అవకాశం కల్పించిందని కూడా వ్యాఖ్య. ఏమైనా 'Geopolitical' (భూగోళిక రాజకీయం—అనవచ్చునేమో) కారణాలవలన అమెరికా రష్యాలు ఒకదానికెదురుగా మరొకటి ప్రతి కల్లోలప్రాంతంలో నిలువడానికి యిష్టగించవు. పైగా 'ఖండాతరవేధు' (Inter-Continental Ballistic Missiles) లు, ఇదితర రక్షణసాధనాల వలన సైనిక స్థావరాల అవసరం తగ్గిపోయింది. ఈ పరిస్థితులలో, సహజంగా బలవంతుడు బలవంతుడంటే యిష్టపడినట్లు, అమెరికా రష్యాలు ఒకదానినొకటి గుర్తించి (చైనానుగూడ) పరస్పర ప్రాభవపు పరిధులను నిర్ణయించుకొనే అవకాశాలు చాలా వున్నాయి. ఇందు కనేక సూచనలు అప్పుడే ద్యోతకమవుతున్నాయి. భారత దేశం తన విదేశాంగ విధానాన్ని పునర్విమర్శ చేసుకొనవలసిన అవసరం ఉన్నది.

మరొక గమనించవలసిన విషయం భారత కమ్యూనిస్టుపార్టీ చీటలు వారడం; చైనాదాడితో రెండు చీలిక లవతరించాయి. మధ్యలో నక్షల్‌బారి—నాగిరెడ్డి వర్గం తయారయింది. మళ్ళీ Right Communist Party చీలిపోయే ప్రమాదమేర్పడింది. డాంగే— రాజేశ్వరరావు వర్గం రష్యాను బలపరిస్తే

శ్రీ వినాగేంద్రశర్మ, శ్రీ జార్కండ్ రాయి, డా॥ అధికారివంటి వారివర్గం రష్యను ఖండింపడం పార్టీ నైతిక కర్తవ్యం అని వాదించినట్లు చెబుతారు. ఈ అభిప్రాయభేదాలు విపరీతమై మళ్ళీ యిందులో రెండు చీలికలేర్పడే దినం ఎంతో దూరంలేదు.

8

చెకొస్లవాకియాలో యికముందు ఏమి జరుగబోతున్నది? జాతీయ మహాసభ మాస్కో ఒడంబడికను తిరస్కరించింది. అయినా నాయకులు రష్యను రెచ్చగొట్టకుండా హితం నెరవవలసిన అవసరాన్ని ఉద్బోధిస్తున్నారు. పత్రికలు తిరిగి విధింపబడిన సెన్సారు నిబంధనలను మూడు నెలలవరకు మాత్రమే భరించేందుకు అంగీకరించాయి. నూతనంగా జరిగిన పార్టీ ప్రిసీడియం ఎన్నికలలో రష్యా పక్షీయులకు కొద్ది సీట్లు మాత్రమే లభించాయి. ప్రజలకు నచ్చని విధానాలను నిర్ణయించవలసిందిగా చెక్ ప్రభుత్వాన్ని ఒత్తిడిచేసి చెక్ నాయకులను ప్రజల యిష్టానికి, అభిమానానికి దూరంచేయడం రష్యా లక్ష్యంకావచ్చు. కాని చెకొస్లవాకియా ప్రజలు తమ నాయకులను సమర్థిస్తూనేవున్నారు. ఆ నాయకుల భావాలు, విశ్వాసాలు ఎటువంటివో, వారిని దింపివేసినట్లయితే దేశంలో ఎలాంటి అరాజకం పుత్పన్నమవుతుందో చెకొస్లవాకియా ప్రజలకు తెలుసు. కాని సమయం అనువుగాలేదు. అందుకై వేచివుండగలిగ్గిన నిబ్బరం, కార్యదీక్ష, సహనాలకు వారిలో కొదువలేదు. ఆ విశ్వాసంతోనే, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకోసం ప్రజలు నడిపించే వుద్యమాన్ని ఎంతటి సైనికశక్తి నాశనం చేయలేదని ఋజువుచేయడానికి ఎదురుచూస్తున్నారు. రష్యా ఎంతకాలం తన బలంతో చెకొస్లవాకియా విధానాలను నిర్ణయింపగలుగుతుంది?



కల

శ్రీ యర్రంశెట్టి శాయి

రుక్మిణి అద్దంలో చూసుకొంది. చీరా, జాకెట్టూ బాగానే అమిరినయి. కాని మెడ బోసిగా కనబడి పోతోంది. ఉన్న ఒక్క బంటిపేటగొలుసు కూడా అమ్మ జబ్బుకోసం అమ్మేయాల్సివచ్చింది. దాంతో చెవులకి రింగులుతప్ప మరే ఆభరణమూ మిగల కుండాపోయింది.

పెళ్లిబాజాలు మ్రోగటం మొదలెట్టినయి. ప్రొద్దుట్నుంచీ చెవులు గింగుర్లెత్తించేస్తున్న సినిమా రికార్డులు ఆపేశారు. పదకొండూ తొమ్మిది నిముషా లకి ముహూర్తం. టైమెంతయిందో. గోడకున్న తాతలనాటి గడియారం ఎప్పుడూ సరయిన టైము చూపించదు. అర్ధగంటముందో, వెనుకో నడుస్తూం టుంది. పదవుతూండొచ్చు ఇప్పుడు. ఇక బయల్దేరటం మంచిది. గంటయినా ముందు వెళ్లకపోతే సావిత్రి గొడవ చేస్తుంది. ఇద్దరిదీ చిన్నప్పట్నుంచీ ప్రాణ స్నేహం. అందుకే వెళ్లక తప్పడంలేదు.

'మన గ్రూప్‌లో అందరికీ పెళ్లిళ్లయి పోయినయి. ఎక్కడెక్కడికో ఎగిరిపోయారు. మిగి లింది మనిద్దరం. నా పెళ్లికి నువ్ రాపోతే ఎలాగే?' నాల్రోజులముందు అడిగింది సావిత్రి.

'అమ్మకి వంట్లో బావుండలేదే. నేనెప్పుడూ దగ్గరే ఉండాలి...' అని చెప్పినా వినిపించుకోలేదు.

'కనీసం ఆ గంటయినా నువ్వు వాదగ్గ రుండాలి. ఏం?......మర్చిపోకు. రాపోతే నేనింక మాట్లాడన్నీతో......'అనేసి వెళ్లిపోయింది.

ప్రక్కగదిలో తల్లి మంచందగ్గరకు వెళ్లి 'అమ్మా వెళ్లొస్తానే...' అంది రుక్మిణి.

'వెళ్లు...త్వరగా వచ్చెయ్...' నీరసంగా అంది తల్లి.

తలుపులు దగ్గరగావేసి రోడ్డుమీదకొచ్చింది రుక్మిణి. తమ ఇంటికి నాలుగి ళ్లవతలే సావిత్రి ఇల్లు. ఎదురుగ్గా ఉన్న మేడమీదకి క్రీగంట చూసిందామె. తనవంకే చూస్తున్నాడతను. తల వంచేసుకొని వడివడిగా నడిచి సావిత్రి ఇల్లు చేరు కొందామె. కాంపౌండంతా పెద్దపందిరి వేశారు. రంగురంగుల కాగితాలతో, మామిడి తోరణాలతో, కొబ్బరిమండలతో అందంగా, హుందాగా ఉంది పందిరి. ఓ ప్రక్కంతా కుర్చీలు వేశారు. వాటినిండా మొగాళ్ళు కూచున్నారు. వివాహ మండపంచుట్టూ చాపలమీద ఆడవాళ్ళు, పిల్లలు కూచున్నారు. చాలా మంది ఆడవాళ్ళు హడావుడిగా తిరుగుతున్నారు. పెళ్ళి కొడుకుని అప్పుడే పీటలమీద కూర్చోబెట్టేశారు. ఇంట్లోకి నడిచింది రుక్మిణి. సావిత్రి రెండో అక్క మణి ఎదురొచ్చింది.

'ఏమోయ్! ఇప్పుడా రావటం? ఇప్పటికిప్పుడే పాతికసార్లడిగింది పెళ్ళికూతురు. ఆ గదిలో వుంది...వెళ్ళు'...

లోపలి కెళ్ళింది రుక్మిణి.

సావిత్రి అక్కడ ఓ సోఫాలో కూర్చుంది. చుట్టూ కొంతమంది ఆడపిల్లలు కూర్చున్నారు. సావిత్రి పిన్నమ్మలు హడావుడిగా ఏదో మాట్లాడు కొంటున్నారు. సిల్కుచీరతో, బుగ్గన చుక్క, మెరసిపోతూన్న నగలతో క్రొత్త అందంతో కనబడు తోంది సావిత్రి. సావిత్రి ప్రక్కనే సోఫాలో కూర్చుంది రుక్మిణి.

'ఇంతసేపేం చేస్తున్నావే? 'బోర్' కొట్టి పోతోంటేనూ...ఇంట్లో ఏం రాచకార్యం వెలగబెడు తున్నావ్?...' కోపంగా అంది సావిత్రి.

'అమ్మకి గంట గంటకీ మందివ్వాలే...నీకు చెప్పానుగా...'

'మీ తమ్ముడేమయ్యాడు?'

'వాడింటిపట్టున వుండటం కూడానా? ప్రొద్దున్న పోతే సాయంత్రం వస్తాడు...'

ఫ్లాస్కులోంచి ఓవల్టిన్ రెండు గ్లాసుల్లోకి వంచి ఇద్దరికీ ఇచ్చింది పిన్నమ్మ.

సావిత్రి వంకే చూసి 'నీకు పెళ్ళికళ వచ్చేసిందే!' అంది రుక్మిణి నవ్వుతూ.

'ఊహూ! పెళ్ళికళ అంటే ఎలా వుంటుందో?'

'అచ్చం ఇప్పుడు నువ్వున్నలానే...'

'అలాగా! నే నెప్పుడూ ఉన్నట్లే ఉన్నాను. ఆ మార్పేదో నీ కళ్ళకే వచ్చింది!' రుక్మిణి బుగ్గ గిల్లుతూ అంది సావిత్రి.

'పెళ్ళికూతుర్ని తీసుకురండి. పురోహితుడు తొందర చేస్తున్నాడు...' ఓ మధ్యవయసావిడ గదిలోకి చూచి అరిచి వెళ్ళిపోయింది.

'ఇంతకీ శ్రీవార్ని సరిగ్గా చూసుకొన్నావా?'

'పెళ్ళిచూపుల రోజే చూశాను...' అంది సావిత్రి నవ్వుతూ.

'అప్పుడంటే తొంగారుగా చూసి వుంటావనుకో. చిన్నగా వచ్చి ఎదురింట్లో దిగారు కదా వాళ్ళు... ఏ కిటికీలో నుంచో చూపుపడకపోయిందా అని...'

సావిత్రి చిన్నగా నవ్వేసి ఊరుకొంది.

'చెప్పే బుల్లీ! ఎప్పుడు చూశావ్?'

'ఊహూ!' అంది సావిత్రి సిగ్గుపడుతూ.

'ఫర్వాలేదు. ఆయనదగ్గర సిగ్గుపడుదుగాని... చెప్పు...'

'ప్రొద్దున్న స్నేహితులతో వెడుతూంటే చూశాను.'

'అట్లాఅయితే నీ ఋణమంతా ఈ కిటికీకే చాలుండదివాళ......'

ఇద్దరూ కిలకిల నవ్వుకున్నారు.

'పదమ్మాయ్......' ఓ పిన్నమ్మ హడావుడిగా వచ్చి సావిత్రిని నడిపించుకువెళ్ళింది.

'పందిట్లో నా దగ్గరే కూచో......' అంది సావిత్రి వెడుతూ.

వెనకే నడిచి మండపానికి దగ్గర్లో కూచుంది రుక్మిణి.

'మా సావిత్రి స్నేహితురాలు. ఇంకా పెళ్ళి కాలేదు పాపం!'

సావిత్రిపిన్ని తన గురించి ఓ మధ్యవయసావిడికి చెబుతోంది. తల మరోవేపుకి త్రిప్పుకొంది రుక్మిణి. మనసుకి చాలా కఠినంగా తాకిందామాట. చాలామంది ఆడవాళ్ళు తనవంకే చూస్తున్నట్లు అనిపించింది. నిజంగా 'పాపం' అని జాలిపడదగ్గ పరిస్థితిలో ఉన్నదా తను. సావిత్రికంటె నాలుగేళ్ళు పెద్దది తను. అంతమాత్రాన తనకి పెళ్ళీడు దాటిపోయినట్లేనా?... ఆలోచిస్తే నిజమేనేమో అనిపిస్తోంది. తన స్నేహితురాండ్రలో తనూ, సావిత్రీతప్ప అందరికీ పెళ్ళిళ్ళుఅయిపోయినయి. అందరిలోకీ వయసులో చిన్నదయిన సరస్వతి గ్గూడా సంవత్సరం క్రితమే వివాహం అయిపోయింది. ఇప్పుడు సావిత్రి. తానొక్కర్తె ఒంటరిగా మిగిలిపోయింది.

బాజాలు గట్టిగా మ్రోగసాగాయి. పెళ్లికొడుకు సావిత్రి మెడలో మంగళసూత్రం కడుతున్నాడు. అతని స్నేహితులు ఏదో అని నవ్వుతున్నారు. సావిత్రి తల భూమిలోకి వంచేసుకొంది సిగ్గుతో. ఆమె చిన్నచెల్లాయ్‌వచ్చి తన ప్రక్కన కూర్చుని ఏదో నవ్వుతూ అంటోంది.

రుక్మిణి కివేవీ వినబడటంలేదు. మనసంతా గందరగోళంగావుంది. చాలాసేపటివరకూ కళ్ళప్పగించి చూస్తూండిపోయింది.

'ప్రెజెంటేషన్స్......' అంటూ ఒకారు అరచారు.

లేచి నుంచుంది రుక్మిణి. అందరూ బహుమతులు చదివించటానికి గుమికూడారు. సావిత్రికి

ప్రాణస్నేహితురాలయి కూడా తనేమీ ఇవ్వలేక పోతోంది. ఇక అక్కడ వుండటానికి మనస్కరించ లేదు రుక్మిణికి. మెల్లగా బయటకు నడచింది. ఇంటి దగ్గరకొచ్చి అనుకోకుండానే తలెత్తి మేడ మీదకు చూసింది. అతను కిటికీలోనుంచి తనవంకే చూసి నవ్వుతున్నాడు. చటుక్కున తలవంచేసుకొని వడివడిగా ఇంట్లోకి నడిచి తలుపులు మూసివేసి 'హమ్మయ్య!' అని గుండెలమీద చెయ్యి వేసుకొంది. గదిలో తల్లి నిద్రపోతోంది. ఆమెని చూస్తోంటే జాలివేసింది రుక్మిణికి. కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయి.

'పాపం! ఏనాడూ సుఖం లేదు అమ్మకి. ఎప్పుడూ ఏవో బాధలు. అక్కయ్య పెళ్ళి అవలేదనే దిగులుతో మంచం పట్టింది. భగవంతుడి దయవల్ల అక్కయ్యకి కొద్ది రోజుల క్రితమే వివాహం అయింది. కాని తల్లి అనారోగ్యం ఇంకొంచెం విజృంభించింది. ఆమె ప్రాణానికి తన పెళ్ళి సమస్యొకటి. తమ్ముడు బి ఏ లో చేరాడు. ఎక్కడలేని డబ్బూ వాడి ఫీజులకి కడుతూండాలి.'

'అమ్మాయ్!' లోపలికొస్తూ పిలిచారు శంకరం గారు.

'ఏం నాన్నగారూ?'

'కొంచెం త్వరగా భోజనం వడ్డించమ్మా! ఇనిస్పెక్షనవుతోంది. వెంటవే వెళ్ళిపోవాలి...' కాళ్ళు కడుక్కోటానికి పెరట్లోకి నడిచాడాయన.

అస్థిపంజరంలాఉన్న తండ్రినిచూసి నిట్టూర్చింది రుక్మిణి.

'ఇంకెన్నాళ్ళు నాన్నా ఈ కష్టాలు మీకూ. ఇక వీటికి అంతులేదా. ప్రొద్దుట్నుంచీ, రాత్రిదాకా ఆ ఆఫీసులో ఎందుకలా చాకిరీ చేస్తారు? మీ ఆరోగ్యం సంగతి మీకూ పట్టదా?...'

వంటింట్లోకి వెళ్ళి ఆయనకి భోజనం వడ్డించింది రుక్మిణి. త్వర త్వరగా భోజనం ముగించి ఆఫీసుకి వెళ్ళిపోయాడాయన.

సత్యం రాలేదింకా. వాడెక్కడ తిరుగుతున్నాడో...వాడిష్టంగా వుంది. ఎప్పుడూ, స్నేహితులూ, సినిమాలూ...

'రుక్కూ!' అమ్మలేచినట్లుంది! పిలుస్తోంది.

'ఏమిటమ్మా! ఆమె మంచంమీద కూచుంటూ అడిగింది రుక్మిణి.

'నాన్నగారు భోజనాని కొచ్చేరా?'

'వచ్చి వెళ్ళిపోయారమ్మా! నువ్ నిద్రపోతున్నావని లేపలేదు'

'మరి నువ్ తిన్నావా?'

'లేదమ్మా! తమ్ముడొస్తాడేమో అని చూస్తున్నాను. ఇద్దరం ఒకేసారి చేసెయ్యొచ్చు!'

'అదేమిటి. సావిత్రీవాళ్ళింట్లో భోజనం చెయ్యలా?'

'ఊహ్! వద్దమ్మా! అక్కడొద్దు...' కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయి రుక్మిణికి. తల్లికి కనిపించకుండా ముఖం మరోవేపుకి త్రిప్పుకొంది. కొద్ది క్షణాలాగి ఆవిడకి మందు త్రాగించి, బత్తాయి తొనలు తీసిచ్చింది.

'వా డికరాడు. నువ్వెళ్ళి అన్నం...తినె...య్' అంది తల్లి.

లేచి వంటింట్లోకి నడిచింది రుక్మిణి. కంచంలో అన్నం వడ్డించుకొన్నది కాని, తిన బుద్ధి కావడంలేదు. తినకుండానే లేచి ప్రక్కగదిలోకి వెళ్ళి మంచంమీద వ్రాలిపోయింది. టైము మూడు చూపిస్తోంది గడియారం. అంటే రెండున్నరో, మూడున్నరో అయిందన్నమాట. మనసంతా గజిబిజిగా వుంది. పెళ్ళిలో ఆమె అన్నమాటే గుర్తుకొస్తోంది. తనకి పెళ్ళీడు దాటిపోయిందా? అసలు పెళ్ళీడు ఎంత? తన కిప్పుడు ఇరవైఅయిదేళ్ళు. ఇది చాలా ఎక్కువా? ఏమో?

అయిదారు రోజులవరకూ మామూలు మనిషి కాలేకపోయిం దామె. సీతమ్మగారి ఆరోగ్యం ఇప్పుడు కొంచెం కుదుటబడింది. ఆవేళ సాయంత్రం రుక్మిణి వంటింట్లో ఆవిడకోసమని జావ కాస్తోంటే బయట బండి ఆగిన చప్పుడయింది. బయటికొచ్చి చూచిం దామె. అక్కా బావా బండి దిగారు.

'అమ్మా అక్కయ్యా, బావా వచ్చారు...' అంది తల్లితో సంతోషంగా.

బండివాడు సామాను లోపల పెట్టి వెళ్ళిపోయాడు.

'ఏం రుక్కూ! అమ్మ కెలావుంది...' నవ్వుతూ అడిగాడు బావ.

'ఇప్పుడు ఫర్వాలేదు బావా!' అంది రుక్మిణి మందహాసంతో.

లోపలికివెళ్ళి పదినిమిషాల్లో కాఫీ చేసుకొచ్చి రెండు కప్పుల్లో అక్కకీ బావకీ ఇచ్చింది. అక్కయ్య అత్తగారింటి గురించి అమ్మకి కబుర్లు చెబుతోంది. తను వెళ్ళి మళ్ళీ వంటపనిలో మునిగిపోయింది రుక్మిణి. రాత్రి ఎనిమిదింటికి సత్యం వచ్చాడు. మధ్యాహ్నం మళ్ళీ భోజనానికి రాలేదు. ఎక్కడో స్నేహితుడింట్లో భోజనం చేశాడుట.

'ఏం స్నేహాలా? ఇంటికి రాకుండా?' అంది సత్యవతి.

'అలా గనకక్యాస్! స్నేహాలు చేయక మొగాడూ, చేసి ఆడదీ చెడిపోతారని అన్నారు. కావాలంటే బావగారి నడుగు!' అన్నాడు నవ్వుతూ.

'అవునోయ్! నిజమే అది. అందుకే నీ అక్కయ్యని ఇల్లు కదలనీయటంలేదు నేను...' అన్నాడాయన పరిహాసంగా.

అందరూ భోజనాలు ముగించారు. అక్కా బావా పడగ్గదిలో పడుకొన్నారు. రుక్మిణి తనకీ, తండ్రికీ తల్లి గదిలోనే ప్రక్కలు పరిచింది. సత్యం డాబా మీద కెక్కి పడుకొన్నాడు. శంకరంగారు రాత్రి పదిగంటల కొచ్చారు. ఆయనకి భోజనం వడ్డించి మళ్లీ ప్రక్కమీదకు చేరిందామె. నిద్ర పట్టటం లేదు. తండ్రి వెంటనే నిద్రలో మునిగిపోయాడు. అమ్మ కూడా నిద్రపోతోంది. పదకొండుగంటలు కొట్టింది గడియారం. తరువాత పెండ్యులంచేసే చప్పుడు స్పష్టంగా వినిపించసాగింది. బయట వెన్నెల పిండారబోసినట్లుంది. రుక్మిణి మనసులో ఏవేవో ఆలోచనలు కెరటాల్లా వచ్చిపడుతున్నాయి. తన కింక వివాహం కాదు. అక్కయ్య పెళ్ళికయిన అప్పే ఇంత వరకూ సగంకూడా తీరలేదు. తమ్ముడు ఉద్యోగం చేసేసరికి ఎలాగూ ఇంకోమూడేళ్లు పడుతుంది. అంటే తన కప్పటికి ఇరవైఎనిమిదేళ్లు వచ్చేస్తాయి. అప్పుడు మరీ కష్టం. కట్నం ఇచ్చినా కుర్రాళ్లు కనబడరు. ఛీ! లేనివాళ్లింట్లో ఆడదయి పుట్టనంత మహాపాతకం మరొకటిలేదు. ఆడపిల్ల కింత కంటె పెద్దశిక్ష మరేమీలేదు కూడా. గదిలో ఉక్కగావుంది. క్రింద చాపమీద పడుకోవడంవల్ల గాలి అసలు రావడంలేదు. జాకెట్టంతా చెమటతో తడిసిపోతోంది. డాబామీద పడుకొంటే బావుండు ననిపించింది రుక్మిణికి. దుప్పటి, దిండు, చాప తీసుకొని డాబామీదకి బయల్దేరింది. ప్రక్కగదిలోనుంచి మాటలు వినిపించినయి.

'అబ్బ! ఉండండి! నిద్రొస్తూంది......' అక్కయ్య మెల్లగా, మత్తుగా అంటోంది.

'అరె! రాత్రిళ్లు నిద్రపోవడం ఎప్పట్నుంచీ?' నవ్వుతూ అన్నాడు బావ.

రుక్మిణి మరింక అక్కడ నుంచోకుండా చకచక మెట్లు ఎక్కేసింది. తమ్ముడు ఓ ప్రక్కగా గాఢమయిన నిద్రలో ఉన్నాడు. చాప పరుచుకొని పడుకొంది రుక్మిణి. చల్లనిగాలి మందంగా వీస్తోంది. శరీరానికి చల్లగావుంది కాని మనసు వేడిగా వుంది. ఏదో అసంతృప్తిగా వుంది. కళ్లు మూతలు పడటంలేదు. శరీరం తన స్వాధీనం కోల్పోయినట్లనిపించసాగింది. ఏదో ఆవేదన. భవిష్యత్తు కళ్ళముందు భయంకరంగా కనిపించసాగింది. ఏమీ మార్పుల్లేని ఇదే జీవితం ఇకముందుకూడా గడిపేయాలనే ఆలోచన గుండెలు పిండేస్తోంది. తన వయసు ఆడపిల్లల కుండే కోరికలు తనకీ ఉన్నాయి. తన స్నేహితురాండ్రందరిలాగానే తనూ వివాహం చేసుకుంటుందని కలలుకన్నది తను. ఓ యువకుని జీవితంలో చోటుచేసుకొని మధురమయిన రోజులు గడపొచ్చుని అనుకొంది. నవలల్లో, సినిమాల్లో కనబడే అత్తగారి మందలింపులూ, ఆడబడుచుల వేళాకోళాలూ, మరుదుల హాస్యాలూ, వీటన్నిటి మధ్యా తనని ఊహించుకొని సిగ్గుపడింది. అప్పుడు తనకు తెలీదు. ఇలాంటి ఊహాలు తనలాంటి ఆడపిల్లలకి

కాదు. తనూహించుకోవాల్సిన జీవితం వేరేవుంది. అది మంచి యవ్వనంలో ఊహాకందకుండా మరుగున పడివుంటుంది. వయసు గడచినకొద్దీ వికటాట్టహాసం చేస్తూ అనుభవంలో కొస్తుంది. కనీసం తల్లిదండ్రులు తనకి చదువయినా సరిగ్గా చెప్పించి వుంటే ఎంతో బావుండేది. ఫిఫ్త్‌ఫారం చదువుతోండగా స్కూలు మానిపించేశారు. కనీసం యస్సెల్సీ పాసయినా, ఎదురింటి అరవవాళ్ళమ్మాయి మీనాక్షిలా ఏదో ఉద్యోగం చేయడానికి వీలుండేది మీనాక్షి తనకంటె పెద్దది. ఈ మధ్యనే వాళ్ళాఫీసులో పని చేసే ఓ అబ్బాయిని రిజిష్టర్ మారేజ్ చేసుకొంది. అతను వీళ్ళకులం కాదుట. వాళ్ళమ్మ రోజూ తన తల్లిదగ్గరికొచ్చి ఈ సంగతి చెప్పి విచారిస్తూండేది. కానీ తరువాత అలవాటుపడిపోయింది. 'మా అల్లుడు' అని చెప్తూ వచ్చింది. అతను ప్రస్తుతం వీళ్ళింట్లోనే వుంటున్నాడు. ఆమె తండ్రికేమీ పట్టినట్లుండేదికాదు. ప్రొద్దుట్నుంచీ, పొద్దుపోయింత వరకూ వసారాలో కూర్చుని, 'హిందూ' పేపరు చదువుతోండేవాడు. రోజూ పొద్దుపోయేసరికి మీనాక్షి, ఆమె భర్త షికారుకు వెడుతూ కనబడతారు తనకి. తెలీకుండానే ఎప్పుడో నిద్ర పట్టేసింది రుక్మిణికి.

ప్రొద్దున్న ఎవరో పిలిచినట్లయి ఉలిక్కిపడి కళ్ళు విప్పింది. అప్పుడే తెల్లారుతోంది. సూర్యుడింకా ఉదయించలేదు. చల్లని గాలులు వీస్తున్నాయి. సత్యం నిండా ముసుగు పెట్టుకొని ముడుచుకు పడుకొన్నాడు. చాప చుట్టేసి లేచినుంచుంది రుక్మిణి. ప్రక్క డాబామీద ఇందిర కనిపించింది. పడుకొన్నప్పుడు పిట్టగోడ అడ్డుగా ఉండటంవల్ల తనకా అమ్మాయి కనిపించలేదు. తనని చూసి బంగారుగా నవ్వి మెట్లుదిగి క్రిందకి వెళ్ళిపోయింది. ఇందిర వాళ్ళు ప్రక్కింట్లోనే అద్దెకుంటున్నారు. ఇందిర ఫోర్త్‌ఫారం చదువుతోందమ్మాయి. నాలుగయిదుసార్లు వచ్చి చదువుకోనేందుకేవేనా నవలలుంటే ఇమ్మంటూ వచ్చింది. తరువాత మళ్ళీ వాటిని తీసుకొచ్చి ఇచ్చేసింది. తనని చూసి ఆ పిల్ల ఎందుకలా బంగారు పడిందో రుక్మిణి కర్థం కాలేదు. తలగడ చేత్తో పట్టుకొని మెల్లగా మెట్లు దిగిందామె. అప్పటికే అక్కయ్య పెరట్లో నూతిదగ్గర నుంచొని బ్రష్‌తో పళ్ళు తోముకొంటోంది. ఓ క్షణం ఆమె వంకే పరకాయించి చూసింది రుక్మిణి.

'నువ్వు కాఫీ పెట్టవే రుక్కూ. నే నీలోపల మీ బావగారికి, నాన్నకీ మేలుకొలుపు పాడి, అమ్మకి మొఖం కడిగిస్తాను...' అందామె ముఖం కడుగుతూ. తలవూపి తన కార్యక్రమంలో లీనమయింది రుక్మిణి. మధ్యాహ్నం పదింటికి వంట గదిలో ఉండగా సావిత్రి చెల్లి సరసు సరాసరి వంటగదిలో కొచ్చేసింది.

'అక్కా! నిన్ను సావిత్రక్క పిల్చుకు రమ్మంది' అంది గడపమీద కూచుంటూ.

'సావిత్రెప్పుడొచ్చింది?'

'నిన్నే! అక్క, బావా వచ్చారు...'

'మీ బావగారెలా ఉన్నారే? మంచివాడేనా?' నవ్వుతూ అడిగింది సత్యవతి.

'ఓ! బోల్డుమంచాడు. నాకు పాంచి ముత్యాల హారం, మా తమ్ముడికి ఏరోప్లేనూ తెచ్చాడు.

'సరేలే. వంటపనయిం తర్వాత మధ్యాహ్నం వస్తానన్జెప్పు సావిత్రితో...' అంది రుక్మిణి.

'ఊహూ! ఇప్పుడే రమ్మంది. వచ్చేవరకూ నన్నిక్కడే కూచోమంది...' అంది కళ్ళు తిప్పుతూ. సత్యవతి నవ్వేసింది.

'పోనీ వెళ్ళిరావే! ఇక్కడ నేనుంటానుగదా!' అంది రుక్మిణితో.

రుక్మిణిలేచి గదిలోకివెళ్ళి చీర మార్చుకొంటూంటే 'ఎక్కడికే?' అంటూ అడిగింది తల్లి. ఆవిడ ఆరోగ్యం చాలావరకూ నయమయింది.

'సావిత్రి వచ్చిందటే! నన్ను రమ్మని సరసుతో కబురంపించింది...'

అద్దంలో చూసుకొంటూ జవాబిచ్చి ఆ పిల్ల వెంబడి బయల్దేరింది రుక్మిణి. బయటకు రాగానే వద్దనుకొన్నా ఎదుటి మేడమీదకు చూడకుండా ఉండలేక పోయింది. రెండు చేతులూ గడ్డానికి పొటే పెట్టుకొని తనవంకే చూస్తున్నాడతను. తలదిం

చేసుకొని సావిత్రి ఇంటివేపు నడిచిందామె. సావిత్రి తనకోసం గేటుదగ్గరే నుంచుని ఎదురుచూస్తోంది. తనని చూడగానే సంబరపడిపోయింది.

'ఏయ్ ఫూల్! ఆ రోజు చెప్పకుండా వెళ్లిపోయావేం?' అంది నవ్వుతూ.

'పెళ్లిపీటలమీదనుంచి ప్రక్కకు లాక్కెళ్లి చెప్పమన్నావేమిటే?' అంది రుక్మిణి.

ఇద్దరూ లోపలికి నడిచారు. గదిలో మంచం మీద కూలబడింతర్వాత 'ఇప్పుడు చెప్పవోయ్! ఎలా వుంది పెళ్లి?' అంది రుక్మిణి నవ్వుతూ.

'ఎలా వుండాలో అలానే వుంది!' అంది సావిత్రి తనూ నవ్వేస్తూ.

సావిత్రి కొంచెం క్రొత్తగా కనిపించింది రుక్మిణికి. కానీ ఆ మార్పేమిటో మాత్రం తెలీడంలేదు.

'నీ పార్ట్నర్ ఏమంటున్నారు?'

'ఏముంది? తన గురించీ, తన ఫ్రెండ్స్ గురించీ హీరోయిక్ డీడ్స్ అన్నీ చెప్తున్నారు.'

'మరి నువ్వు మొదలెట్టలేదూ?'

'చెప్పనిస్తేనా!'

'లోపలికి రావచ్చా?' గడపదగ్గర నుంచుని నవ్వుతూ అడిగాడు ఆమె భర్త.

ఇద్దరూ చటుక్కున లేచి నుంచున్నారు. రుక్మిణి పైటనిండుగా కప్పుకొంది.

'రండి! ఈమె మా ఫ్రెండ్ రుక్మిణి!' రుక్మిణిని చూపిస్తూ అంది సావిత్రి.

'నమస్తే!' అంది రుక్మిణి తలఎత్తి అతని వంక చూస్తూ. ప్రతినమస్కారంచేసి లోపలికొచ్చి కూర్చున్నాడతను.

'మీరు కూర్చోండి...మిమ్మల్నెప్పుడూ తల్చుకొంటూనే ఉంటుంది మీ సావిత్రి. అలా మరీ తల్చుకోకూడదూ, వాళ్లింట్లో ఆవిడ కెప్పుడూ వలమారుతూంటుందని చెప్పినా వినడంలేదు...'

ముగ్గురూ నవ్వేశారు.

'మీరునుంచునే ఉన్నారేం? కూర్చోండి?''

రుక్మిణి సిగ్గుపడుతూనే సావిత్రి పక్కన కూర్చుంది.

'మీ స్నేహితురాలికి కాఫీ ఏమయినా ఉన్నదా? వట్టి కబుర్లేనా?'' అన్నాడతను సావిత్రితో.

'ఇప్పుడే కాఫీ తీసుకొస్తాను కూచోవే...' లోపలికి వెళ్తూ అంది సావిత్రి.

రుక్మిణి గుండెలు వేగంగా కొట్టుకొన్నాయి. ఇలాంటి పరిస్థితెప్పుడూ అనుభవంలోకి రాలేదు. చచ్చే సిగ్గుగావుంది. ఓ క్షణమాగి అతనే మాట్లాడాడు.

'మీ సావిత్రి నేనేం చెప్పినా వినడంలేదండీ! కొంపతీసి మీ ఫ్రెండ్సందరూ పెళ్లయింతర్వాత మొగుడుమాట చస్తే వినకూడదని రహస్యంగా ప్రతిజ్ఞలేం చేయలేదుకదా?''

నవ్వాగలేదు రుక్మిణికి. కిలకిల నవ్వేసింది. అప్పుడే రెండు ప్లేట్లలో బిస్కెట్లు తీసుకొచ్చింది సావిత్రి. ఏమీ మాట్లాడకుండా ప్లేట్లు ఇద్దరి ముందూ ఉంచి మళ్లీ లోపలి కెళ్లిపోయింది. ఓ రెణ్ణిమషాలాగి మళ్లీ అన్నాడతను.

'మీరు అవి తినరేం? మీ సావిత్రి ప్రక్క నుండాలా?'

నవ్వేసింది రుక్మిణి 'ఊహు?...అది కాదండీ...' అంది బిస్కెట్ అందుకొంటూ.

'మీరు మా మారేజ్ ఫొటోస్ చూళ్లేదు కదూ?' అడిగాడతను.

'లేదండీ!' అంది రుక్మిణి.

అతను లేచి టేబుల్మీదున్న ఓ ఆల్బమ్ ఆమెచేతికిచ్చాడు. ఒక్కొక్కపేజీ చూడసాగింది రుక్మిణి.

'ఓ ఫొటో చూపిస్తాను. తలంబ్రాలు పోసేప్పుడు సావిత్రి ఎంత కోపంగావుందో చూడండి!' ఆమెకి చేరువగావంగి ఆల్బమ్ ఆమె వళ్లో ఉండగానే ఓపేజీ తిప్పి చూపించాడతను. రుక్మిణికి ఆ ఫొటో చూస్తే నవ్వాగలేదు.

సావిత్రి కాఫీలు ట్రేలోపెట్టుకొని లోపలి కొచ్చింది. వాళ్ళని చూడగానే ఆమె మొఖం చిన్న బోయింది.

ముగ్గురూ కాఫీలు త్రాగారు. సావిత్రి మూగ దానిలా కూచుంది. అతనే ఏవేవో మాట్లాడాడు.

'ఇక వెళ్తానే!' అంది రుక్మిణి సావిత్రితో.

సావిత్రి లేచి నుంచుంది.

'వెళ్తానండి! నమస్తే!' అతనితో అని బయటకి నడిచింది రుక్మిణి.

సావిత్రి గేటువరకూ వచ్చింది. ఏదో విలు వయిన వస్తువు పోగొట్టుకొన్నదానిలా ఆమె ముఖం వాడిపోయింది.

'నువ్వూ, మీ శ్రీవారూ ఓసారి మా యింటికి రారాదూ, ఓ చిన్నపార్టీ ఇస్తాను...' అంది రుక్మిణి గేటుదగ్గర నుంచుని.

'ఊహూ! ఆయన కొకళ్ళ ఇళ్ళకి వెళ్ళడం ఇష్టం వుండదు......' మరోవేపుకి చూస్తూ అంది సావిత్రి.

రుక్మిణి విస్మయంతో ఆమెవంక చూసింది

'సరే! ఇక వెళ్ళు......' అంటూ చివాలున వెనక్కితిరిగి వెళ్ళిపోయింది సావిత్రి.

రుక్మిణి తెల్లబోయింది. ఆమె కళ్ళల్లో ఉక్రోషం తొంగిచూసింది. కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయి. ఇంటివేపు మెల్లగా నడువసాగింది. సావిత్రి అలా ప్రవర్తించగలదని ఎప్పుడూ ఊహించు కోలేదు తను. అలా ఆమె మారిపోవడానికి కారణం అస్పష్టంగా అలుక్కుపోయినట్లు కనిపిస్తోంది అదే కారణం అనుకోడానికి మనసు ఒప్పుకోడంలేదు. అది కాకుండావుంటే బావుండుననిపిస్తోంది.

ఇంటికి వచ్చేసరికి సత్యం, బావగారూ ఎక్క డెక్కడో తిరిగొచ్చేశారు. సత్యవతి వంటింట్లో హడా వుడిగావుంది. తనూ ఆమెకి సాయపడసాగింది రుక్మిణి.

సాయంత్రమయేసరికి పనంతా ముగించుకొని వరండాలో కుర్చీలో కూర్చుంది రుక్మిణి. ఇల్లంతా నిశ్శబ్దంగావుంది. మేడపైన అతను తన వంకే చూస్తూ కిటికీదగ్గర కూర్చున్నాడు. లేచి లోపలికి వెళ్ళిపోవాలనుకొంది కానీ 'అతను చూస్తే మనకేం?' అనుకొని కూర్చుండిపోయింది. అక్కయ్యా బావా గుడికి వెళ్ళారు. రోడ్డుమీద సావిత్రీ ఆమె భర్తా ఎక్కడికో వెడుతూ కనిపించారు. తమ ఇంటికేసైనా చూడకుండా సావిత్రి వెళ్ళిపోవడం రుక్మిణి మనసుకి బాధ కలిగించింది. క్రమేణా చీకటి వ్యాపిస్తోంది. వీధిలో మునిసిపల్ దీపాలు వెలిగినయి. లోపలికి నడిచి లైట్ స్విచ్ఆన్ చేసిందామె. లైట్లు వెలగ లేదు. బయటకూడా దీపాలన్నీ ఆరిపోయినయి. క్రొవ్వొత్తికోసం సత్యం పుస్తకాల అల్మారాతీసి వెది కింది రుక్మిణి. ఓమూల క్రొవ్వొత్తి ప్రక్కనే కొన్ని నీలంరంగు కాయితాలు కనిపించినయి.

క్రొవొత్తి వెలిగించి ఆ కాగితాలు తీసి చూసిం దామె. లోపల అందమయిన దస్తూరి, ఓ ఆడపిల్ల దని తెలిసిపోతోంది.

'ఏమండీ,

నిన్న సినిమాకి రాలేకపోయాను క్షమించండి. స్కూలు మానేయాలంటే భయం వేసింది నా ఫ్రెండ్సు దరూ నాతో కలిసే స్కూలుకొచ్చారు. మీరు నా కోసం హాలు దగ్గర ఎదురుచూసి ఉంటా రనుకొంటాను. ఏం చేయను. వచ్చే ఆదివారం తప్ప కుండా ఏదోహ సినిమాకి వెళ్దాము. ఈ సంగతి చెప్ప టానికి ప్రొద్దున్నే డాబామీదకొచ్చి మిమ్మల్ని పిలి చాను. కాని మీ అక్కయ్యకూడా అక్కడే వడు కొందని తెలీలేదు. ఆవిడ లేచి నుంచునేసరికి భయం వేసి వెళ్ళిపోయాను. మిమ్మల్ని పిలవడం ఆవిడ వినేదేమో నని భయంగా వుంది. మీది మరీ బండనిద్ర. రేపైనా మెలకువగా వుండండి. ఏ సినిమాకి వెళ్ళాలో రాత్రి కాలోచించి చెప్పండి...మీ ఇందిర...'

ఉత్తరం చదివి ఆశ్చర్యంతో మునిగిపోయింది రుక్మిణి. ఏదో ఖంగారుగా కూడా ఉంది. ఆ పిల్లేదో చేయరాని పనిచేస్తున్నట్లు అనిపించింది. మిగతా ఉత్తరాలేవీ చదువ బుద్ధికాలేదు. వాటన్నిటినీ యథా స్థానంలో ఉంచేసింది. అయితే సత్యం చాలా పెద్ద వాడయి పోయాడన్నమాట....

రెండ్రోజులు గడిచినయి. అక్కయ్యా బావా వెళ్ళిపోయ్యారు. 'మా ఫ్రెండ్స్‌తో సినిమాకు వెడుతున్నాను...' అని వెళ్ళిపోయాడు సత్యం. రుక్మిణి కాలెండరు చూసింది. ఆ రోజు ఆదివారం. ఇందిర సత్యానికి వ్రాసిన ఉత్తరం గుర్తు కొచ్చిందామెకి. అవును వాడు ఇందిరతో సినిమాకి వెళ్తాడు.

మధ్యాహ్నం రెండయిపోయింది. ఎండ కొంచెం ఎక్కువగానే వుంది. తల్లి నిద్రపోతోంది. తండ్రి ఆఫీసుకు వెళ్ళిపోయాడు మామూలుగా. నిద్రపోడానికి విశ్వప్రయత్నం చేయసాగింది రుక్మిణి. కానీ నిద్ర పూర్తిగా తేలిపోయింది. ఏవేవో ఆలోచనలు. సావిత్రి తనకి ప్రాణ స్నేహితురాలు. చిన్నప్పట్నుంచీ ఇద్దరూ పరస్పరం ఎంత ప్రేమగా ఉండేవారో గుర్తు తెచ్చుకోడానికి బోలెడు సంఘటనలున్నాయి. ఓ సారి తనకి జ్వరంవచ్చి రెండ్రోజులు స్కూలు మానివేస్తే ఆ రెండ్రోజులు సావిత్రి స్కూలు మానేసి తనదగ్గరే కూచుంది. మరోసారి తను అకస్మాత్తుగా దగ్గర్లో ఉన్న చిన్నాన్నగారి ఊరువెడితే, సావిత్రి తన కోసంవచ్చి, చెప్పకుండా తనువెళ్ళిపోయిందని ఏడుస్తూ కూర్చుందిట. అమ్మ ఇప్పటికీ ఈ సంగతి చెప్పి నవ్వుతూంటుంది. అలాంటి సావిత్రి ఇప్పుడు తనని చూసి ఈర్ష్య పడుతోంది. సావిత్రేకాదు. అసలు తమ ఆడజాతే అంత. వాళ్ళల్లో ఎప్పుడూ ఈర్ష్య రగుల్తూ ఉంటుంది. తల్లికి క్రొత్తగా పెళ్ళయిన కొడుకునీ, కోడలినీ చూస్తే ఈర్ష్య, అత్తారింటి గురించి గొప్పలుచెప్పే కూతురిని చూస్తే ఈర్ష్య, అమ్మాయిలకి పరిచయంలేని అమ్మాయి లందరిమీదా ఈర్ష్య, స్నేహితురాండ్రమీద మరో రకపు ఈర్ష్య, అక్కకి చెల్లెలిమీద ఈర్ష్య, ఆడబిడ్డలకి వదినంటే ఈర్ష్య, అంతా ఈర్ష్యే. ఆడదానిలోని ఈ విపరీతశక్తే ఆమెని అణగద్రొక్కేస్తోంది. తోటి ఆడదానిమీద ఈర్ష్య ఆమెని మొగాడికి బానిసగా చేస్తోంది. రుక్మిణి కళ్ళవెంబడి నీళ్ళు కారిపోతున్నయి. మనసంతా తెలియని ఆవేదనతో నిండిపోయింది. చాలాసేపటికి మగతగా నిద్ర పట్టింది. ఏవేవో పిచ్చికలలు. అక్కా బావా విపరీతంగా నవ్వుతున్నారు. సావిత్రి భర్తమీద వాలిపోయి తన్మయత్వంతో చూస్తోంది. ఇందిరా సత్యం సినిమాలో ప్రక్కప్రక్కనే కూర్చున్నారు. మీనాక్షి ఆమె భర్త నవ్వుకొంటూ నడచి వెడుతున్నారు. మేడమీద అతను తన దగ్గరగావచ్చి భుజంచుట్టూ చేతులువేసి నవ్వుతూ 'ఎందుకలా భయపడతావు?' అంటున్నాడు. ఎవరో తట్టినట్లయి ఉలిక్కిపడి లేచింది రుక్మిణి. తల్లి దగ్గరే నుంచొనివుంది.

'ఏమిటే ఆ కలవరింతలు—లే ఇక—అయిదున్నరవుతోంది......సాయంత్రం నిద్ర పోకూడదు...' అందామె.

లేచి కూర్చుంది రుక్మిణి. మనసంతా భారీ అయిపోయింది...మేడమీద కుర్రాడు ఇంకా కళ్ళల్లోనే మెదులుతున్నాడు. తను కనబడినప్పుడు అతని కళ్ళల్లో ఏదో వెలుగు కనిపిస్తుంది ఎందుకనో?

'కొంచెం కాఫీ కాస్తావుటే?'

'ఇప్పుడే తీసుకొస్తానమ్మా!' లేచి వంటింట్లోకి నడిచింది రుక్మిణి. సన్నని కూనిరాగం తీస్తూ స్టవ్ వెలిగించింది.

'అదేమిటే...అతను కలలో కొచ్చాడు!' అనుకొని సిగ్గుపడిందామె.

ఆ క్షణాన్న ఆమె తల్లినీ, తండ్రినీ, ఇందిరనీ, సత్యాన్నీ, సావిత్రినీ, అక్కయ్యనీ, మీనాక్షినీ—అందరినీ మరచిపోయింది. ఆఖరికి తనని గూడా.

సంపాతి

శ్రీ బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి

(ఎక్కడన్నా ఒక పక్షి అయినా అవుపించి అమ్మవారిజాడ చెబుతుందేమోనన్న వేదనతో రామదూతలైన కపులూ—అన్నకోసం ఆర్త్రతాణుడికోసం ఆకలితో ఏకాగ్రదృష్టితో వున్న సంపాతీ—కలయికా, స్వామి అనుగ్రహమూ.)

నీవారశూకతస్వీ
భావిత నాసాగ్రవాస పరమేశ దిదృ
క్షావాప్తిలోన తారక
రావము సౌభ్రాత్రమోచు రాగిల వించున్ !

పొరలుచు నెట్లొ వానర స
మూహము జేరి మఱింక జెప్పుడా !
ఎరుగుదురే జటాయువును?
ఎక్కడ నుండెను రామచంద్రుు? డ
య్యిరువురి ప్రేమనామముల
కే తపియించితి నిన్నియేండ్లు! నా
కెలికలు మొల్చినట్టు లవి
పించెడు వీనామధురాప్తవాక్యముల్ !!

ఏనాడో రవిమండలంబునకు
మేమేగంగనేగన్ జ్వలత్
భానుజ్వాలలమండి రెక్క, లెచటన్ బడ్డామొ
మా సోదరుల్ !
ఆ నాటింబడి నేటిదాక సుఖవార్తాకర్ణనేలేని
నా యీ నిష్ప్రాత్మను నేడు
రామకథలోనేవింటి సౌమత్యముల్ !!

అని సంపాతి వచించు వృద్ధకథన
వ్యాహార గంభీరతల్
విని పొంగెత్తిన రామదండు నగవుల్ చిప్పిల్లచున్
ఉప్పరంబున మ్రోగ్గోమ్మెగి శమించె
రాయి విపరన్ పొంగా జలంబట్టులై!!
మనమం దూగెడి తూగులో
కనుల గ్రమ్మన్ నీరు పక్షీంద్రుడున్—

సీతాదర్శనదుర్లభాధ్వగతరస్వేభావతప్తుల్—
నిరాశాతీవ్రస్మృతి నగ్గిలోబడి
తనుల్ చాలించగాబోవు మీ
చేతోద్వ్యక్తత వించునే శుభసమున్ జేరెన్‌గదా
మిమ్ములన్ బ్రీతిన్ దింటకు!!
నంత యాకలెటు దీరెన్ రామగాథాశ్రుతిన్

రక్కసవోలెనై పదితలల్‌గల రక్కసివేడు
రావణుం డుక్కున,
రెబ్బపాయవలెనున్న పసిండివెలుంగు తల్లి
నీ దిక్కుగ దక్షిణాపథము
తేరున గొంచు జనంగ జూచితిన్!
ఱెక్కలులేని పక్షిని
మఱేమి యొనర్చెద! నేడ్చుచుండితిన్!!

తల్లిని జూచినందుకు ముదంపడువాడనా!
శోకపాకసంవేల్లితగాంచి
ఖేదమున వేపను డౌదునా!
శక్తిహీనజీవల్లఘిమానదగాహ
లెటువంటియున్ వృథయేగదా!
విశువ్యల్లపితంబులేనుగద!
ఐనను స్వామికి స్వాగతించెదన్!

క్లిశ్యంబైనదెయౌను కార్యమిది!
కిష్కింధాగ్రహారీకలాపశ్యల్

మీకును గానిదిన్ గలదె!
ఇక్ష్వాక్వన్వయానర్ఘరత్నశ్యామోజ్జ్వలమూర్తి
రామవిభు సత్యక్రోధ సంబాధిత
భ్రశ్యద్దైత్యము గాదటే జగము!
విభ్రాంతాత్మ లౌటేలనో!

అనవిని కీశబృందమని, రౌ నటులే విహగాధిపా!
త్వరంజని గొనితెత్తు మేమిటకు—
స్వాదుసుసాధుమనః పచేళిమస్వనసుఖముల్
భవచ్ఛ్రవణ వాక్యములన్
గపిరాజుకున్, మహేశనిభుడు రామచంద్రునకు
చక్కగ జెప్పిట దెత్తుమంచునున్.

చని, యా మర్కటవీరు లీ కథను
సోత్సాహంబుగా
వానరేశ నరేశుల్ వినజెప్ప,
నా విభులు విశ్వాసించి వెన్వెంట వచ్చిన
దూరాననె జూచి తెక్కు లెటువచ్చెన్—యేమొ!
కొండంతగంతున రామప్రభుపాదపద్మములపై
తూలెన్ వాలి సంపాతితాన్!

కృచ్ఛ్రంబైన తపస్యపండినది
తంద్రీ నేటికీతీరుగా!
త్వచ్ఛీరమ్యముఖారవిందముగనన్ బ్రాప్తేది!
శోకీభవోద్యచ్ఛామ్యంబగు
నీరసాననము నేదర్శింపలేనో ప్రభూ!
త్వచ్ఛీమంతముగాంతు రాక్షసవధాంతానన్!
ఇటేలెంతునే—

ఈ బాంధవ్యము నెట్లు జూచినను నేడేగాదు-
మీ తాతలన్ నే బాళంబుగ గారవించితి!
వికుంఠేశత్వశోభాచిరేచ్ఛాబోధన్
బడియుంటి నిందనుక నోప్పామీ!

ఇకేమో! మరేమో!
బాహ్యాంతరముల్ ఫలించు నొకరూపున్‌దాల్చియుంచెంచితిన్.

చూచితి నేను జానకిని!
శోకము పొంగిన ధూమరేఖయై—
నీచుడు రావణావశదు
నిండుకులానికి మండుమంటగా జూచితి!
దుఃఖభారమున శోషితుడైతిని!
నేటి తెక్కలే ఏచిన—
నాడెవాని సమయించి జగజ్జననిన్ వెలార్తునే!!

ఓమినసామాలై ప్రకృతియున్ బురుషుండుగ్ మీరు
జానకీరాముల భేదమోద
మధురార్ద్ర మహస్విత దీనబంధులై—
ప్రామిన ప్రేమ నా కనులవంటను బండుడు!!
బంధముక్తతావ్యోమము నంటుదున్—
మళ్ళల బుట్టుట గిట్టుట గోరనో ప్రభూ!

అను సంపాతి మనోనివేదనములో
నావేదనా నిమ్నధారను
రామేశ్వరు డెంచి వాని శిరమున్ రాచెన్—
గరుత్తుల్ స్పృశించెను శ్రీహస్తము చాచి—
నా యుభయరాశీ భావనామ్లానమైచవె
నామీదుగ నీలమేఘ మొక డాశారామభద్రమ్ముగా—!!

క్రోటను మొక్కలు

శ్రీమతి పరిమళా సోమేశ్వర్

సాయంత్రం ఐదుగంటలయింది. అప్పుడే అలసిపోయి యింటికి వచ్చేను యూనివర్శిటీనుండి.

నన్ను చూడగానే 'ఒరేయ్ శీనూ! అక్కొచ్చిందిరా. పనిమనిషిని బాత్‌రూమ్‌లో వేణ్ణీళ్ళు అవీపెట్టమనిచెప్పు' అంటూ కేకేసింది కార్తీక దీపాలకు వత్తులుచేస్తున్న అమ్మ. శీను పరుగెత్తుకువెళ్ళి ఒక్కనిమిషంలో తిరిగివచ్చేడు.

'నీళ్ళు, సబ్బు, టవల్—అన్నీ రెడీ!' అని చెప్పేడు.

రెండో చెల్లెలు ఊర్మిళ — మూడేళ్లది — 'బొతక్కా! నీ చీరా, జాకెట్టూ నేను పట్టుకుంటాను. ఇటివ్వు' అంటూ బాత్‌రూమ్‌వైపుకు వెళ్తున్న నా చేతిలోని బట్టలను లాక్కుంది.

దాని చేతిలోనుండి నేలమీదకు జీరాడుతున్న చీరను చూస్తూనే అమ్మ గద్దించింది. 'ఒసేవ్, రాక్షసిముండా! నీకెన్నిసార్లు చెప్పాలే, పెద్దక్కయ్య బట్టలు ముట్టుకోవద్దని? క్రిందపడేసి అలా యీడుస్తుంటే మాసిపోవూ?' అంటూ.

ఊర్మిళ చిక్కమొహంవేసి నిల్చుంది.

దాని చేతిలోనుండి బట్టలు తీసుకుని నేను బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయేను.

నేను స్నానంచేసి వచ్చేసరికి టిఫిన్ ప్లేటులో పెట్టి, పక్కనేమంచినీళ్లగ్లాసు, ఒకజగ్గూ, కాఫీ ఫ్లాస్కుఅవీ డైనింగ్ టేబులుమీద రెడీగా అమర్చి ఉంచేడు శీను.

శీను మల్టీపర్పస్ పన్నెండో క్లాసు—ఇంగ్లీషు మీడియంలో—చదువుతున్నాడు. సాధారణంగా ఆ వయసులో ఉన్న మగపిల్లలు యిలాంటి 'సర్వీంగ్'ని అరచి మొత్తుకున్నా చెయ్యరు యింట్లో ఎవరికీనీ. కాని శీను వాడి వయోధర్మాన్నికూడా అతిక్రమించి చేస్తున్నాడంటే మా యింటి వాతావరణం మహిమ అది! ఆ రకమైన వాతావరణానికి కేంద్రాన్ని నేనను కుంటే జుగుప్సతో కూడిన బాధ కలుగుతుంది నాకు.

మా అమ్మగన్నసంతానంలో నేను పెద్దదానిని. నా తరువాతది విజయ. బి. యస్సీ చదువుతోంది. తరువాత శీను. ఆఖరిది ఊర్మిళ.

నాన్న రిటైర్డు హెడ్‌మాస్టారు.

నేను ఎమ్మే పి హెచ్చిడీ. యూనివర్శిటీలో హిస్టరీ 'రీడర్'గా పనిచేస్తున్నాను. నా వయసు ముఫ్ఫైనాలుగు.

ప్రస్తుతం మా కుటుంబాన్నంతటినీ పోషించేది నేనే. అందుకే యింట్లో అంతా నన్ను 'దేవత'లా చూస్తారు.

ఎప్పటిలానే ఆరోజుకూడా అమ్మా వాళ్లంతా నాకుచేస్తున్న 'మర్యాదలు' చూస్తుంటే అసహ్యం వేసింది నాకు. ఎవరో వెయ్యిశూలాలు ఒక్కసారిగా నా గుండెలోకి గుచ్చినట్లు విలవిలలాడిపోయేను.

'అమ్మా! నేనుకూడా నీ కూతురినే. వీళ్లందరిలా ఒకప్పుడు నేనుకూడా నీ ఒళ్లోపడుకుని, నీ కొంగుపట్టుకుని తిరుగుతూ నీచేత తిట్లుతిన్న దాన్నే. కాని యీరోజు నన్నిలా 'సింహాసనం'మీద కూర్చోపెట్టి గౌరవిస్తావెందుకు? ఎవరో పరాయి వ్యక్తికి చేసినట్లు ఏమిటి నాకీ మర్యాదలు? నాకు కావలసింది నీ ప్రేమమ్మా! ప్రేమ!' అంటూ

ఓసారి అమ్మతో చెప్దామనుకుంటాను. కాని ఎన్నిసార్లు ప్రయత్నించినా దుఃఖంతో నాకంఠం పూడుకుపోతుంది. నా కళ్ళలో నీరు క్రమ్ముకుంటుంది. ఏదో తెలియని 'ఇన్ఫీరియారిటీ' నన్నావరిస్తుందాసమయంలో,

ఫలహారం కాఫీ ముగించుకుని యివతలకు వచ్చేను. ఆ యింట్లో నేను ఒంటరిదానిని. నాతో ఎవరూ చనువుగా మాట్లాడరు. ఆఖరికి నాన్నకి కూడా నేనంటేభయమే. ఇంత వయసొచ్చినా నాకింకా పెళ్ళిచెయ్యలేదనీ, యికముందుకూడా చెయ్యలేననీ, సాహసించి ఎవడైనా నన్ను పెళ్ళిచేసుకున్నా ఆపైన సంసారాన్ని యీదే నాథుడెవరనీ—యిదీ ఆయన బాధ. దానికి తోడు అన్యాయంగా ఒక ఆడపిల్ల జీవితం నాశనం చేసేనన్న 'గిల్టీకాంక్షెన్స్'. దాంతో ఆయన నావంక కన్నెత్తి చూడటానికికూడా సిగ్గుపడతారు.

రోజులానే నాన్నగారి గదిలోకి వెళ్ళి ఆయన ఆరోగ్యాన్ని గురించి పరామర్శించేను. అదేం చిత్రమో. నేను ఆయన గదిలోకి ఎప్పుడు వెళ్ళినా ఆయన చేతిలో ఏదో ఒక పుస్తకమో పేపరో తప్పనిసరిగా ఉంటుంది. ఆయన దంతిగా చదివే స్వభావంకూడా కాదు. కాని నేను రోజూ ఆయన దగ్గరకువెళ్ళేసమయం తెలుసు కనుక సూటిగా నావంక చూడటం తప్పించుకుందామనే ఉద్దేశ్యంతో చేతిలో ఏదో ఒకటి పట్టుకుంటారు.

ఆ సంగతి నాకు తెలుసు నాకు తెలుసునని ఆయనకీ తెలుసు. అందుకే జుగుప్సాకరమైన ఆ నాటకానికి త్వరగా స్వస్తిచెప్పి యివతలపడ్డాను.

తరువాత తోటలోకి వెళ్ళేను. నాతో యీ యింట్లో స్నేహపూర్వకంగా మాట్లాడేది యీ పూలమొక్కలే!

తోటలోఉన్న ఓ చిన్నరాతిగట్టుమీద కూర్చున్నాను. నా కెదురుగా రెండువైపులా విరగబూచిన రకరకాల పూలు. మధ్యనే సన్నని బాట. ఆ బాట కిరువైపులా క్రోటనుమొక్కలు. అక్కడేకాదు, పూదోటలో చాలా ప్రదేశాల్లో, మట్టికుండీలలో అనేకజాతుల క్రోటనుమొక్కలు వివిధవర్ణాల్లోనూ ఉన్నయ్. విరగబూచిన మందారలు, ముద్దబంతుల మధ్య—ఎంత అందంగాఉన్నా ఏమిటో ఆ క్రోటన్సుమొక్కలు వెలవెలా బోతున్నయ్.

ఈ మధ్య ఎందుకో ఆ క్రోటను మొక్కలను చూస్తుంటే ఒక రకంగా భయం, జాలీకూడా కలుగుతున్నయ్ నాకు. నా జీవితానికీ వాటికీ ఏదో అవినాభావ సంబంధముందనీ, నాలో నేను భరించలేని ఏదో దుష్కృతం ఆ క్రోటనుమొక్కల్లో ప్రతిఫలిస్తోందనీ నా భావన.

అలా శూన్యహృదయంతో ఎంతసేపు కూర్చుండిపోయేనో! దశమిచంద్రుడు కొబ్బరిఆకుల సందుల నుండి మెల్లగా తోటలోకి ప్రవేశిస్తున్నాడు. ఆ వెలుగు కిరణాలు మృదువుగా నా చెంపలను తాకి గిలిగింతలు పెట్టినయ్. ఏదో ఒక విచిత్రమైన కంపనం నా శరీరంలోని అణువణువునూ ఊపివేయసాగింది.

పగలల్లా యూనివర్శిటీలో విద్యార్థినీ విద్యార్థులు, తోటిఉపాధ్యాయులమధ్య గడుపుతూ నా వ్యక్తిగత విషయాలను, నా తీరనికోరికలను అన్నీ మర్చిపోతాను. కాని యింటికి వచ్చేక యిలా ఒంటరిగా కూర్చుంటే ఏవేవో ఆలోచనలు నన్ను ముసురుకుంటయ్. చల్లని సాయంత్రంవేళ ఏకాంతంగా కూర్చుంటే నా మనసు క్రమంగా వశం తప్పిపోతూంటుంది. నా శరీరం ఏవో తీయని అనుభూతులకోసం అలమటిస్తుంది.

నాలోని 'అలజడి' నేను భరించలేనంత తీవ్రంగా తయారయ్యేసరికి చటుక్కున లేచి లోపలికి వెళ్ళేను. నన్ను నేను మర్చిపోదామనే ఉద్దేశ్యంతో శీను, విజయా వాళ్ళు చదువుకునే గదిలోకి వెళ్ళేను.

విజయంటే నా అంతరాంతరాల్లో ఎందుకో నాకు చచ్చేభయం. అది చాలా పెంకిఘటం. ముక్కుకు సూటిగాపోయే రకం. ఆ గుణాలు నాలో లేకపోవటం వల్లనో ఏమో అదంటే నాకు యిష్టంలేదు.

అదీకాక మిసమిసలాడే యిరవైఏళ్ళ వయసు దానిది. నిండుయౌవనం తొణికిసలాడే దాని శరీరం

లోని వంపులు, పాలమీగడవంటి దానిబుగ్గలు చూస్తుంటే నా వంటికి కారం పూసుకుంటున్నట్టుగా ఉంటుంది. అది ఏలా చూసినా, ఏ భంగిమలో నిల బడ్డా, ఏ చీర కట్టుకున్నా నా కంటికి అందంగానే కనిపిస్తుంది. అందుకే అదంటే వళ్ళుమంట నాకు.

నిజానికి ఒక రకంగా విజయకంటె కూడా నేను అందంగానే ఉంటాను. కాని నా అందంలో 'జీవం'లేదు ఒకరిని ఆకర్షించే శక్తి 'యిప్పుడు' నాలో లేదు.

అసలు విజయ అందమంతా దాని వయసు లోనే ఉంది. కలలుకనే కళ్ళు, మిడిసిపడే అవయవాలు, అనుభవాలెరుగని అమాయకత్వం, అనుభూతులకోసం అర్రులు చాచే ఆ ప్రథమ యౌవనం— అదో చిత్రమైన దశ. ఒకప్పుడు నేనుకూడా అలాటి 'దశ'లో ఉన్నదాన్నే.

కాని నా లాగా విజయ జీవితం మోడైపోదు. బి.యస్సీ ప్యాసవగానే దానికి పెళ్ళి చేసేస్తానంటున్నాడు నాన్న.

నాక్కూడా బియే ప్యాసవగానే నాన్న పెళ్ళి చేసేస్తే నేనీ నాడు స్వంత చెల్లెలినిచూసి ఈర్ష్య పడే దౌర్భాగ్యపు స్థితిలో ఉండే దానిని కాను. బి. ఏ. అవగానే ఎం. ఏ. కావాలన్నాను. మొదటి కూతుర్ని కదా అని ముచ్చటపడి చదివించేడు నాన్న: ఆ పైన 'పి హెచ్చిడీ' చేస్తానని పట్టుబట్టేను. తలూపేడు నాన్న. నేను కలలు గన్నట్టుగానే నాలుగేళ్ళ తరువాత 'డాక్టర్ జ్యోతిర్మయి' నయ్యేను. అప్పటికి నా వయసు ఇరవై తొమ్మిది దాటింది. నాన్న తొందరపడి సంబంధాలు వెతికితే అప్పటికన్నా అయ్యేదేమో పెళ్ళి. కాని అప్పటికే నాన్న స్థితి శారీరకంగా, ఆర్థికంగా దిగజారిపోయింది. వెంటనే ఉద్యోగంలోకి చేర్పించేడు నన్ను. క్రమంగా మా యింటి పరిస్థితులు నా 'జీతం' లేనిదే రోజు వెళ్ళనంతగా పరిణమించినయ్. రక్తమాంసాలను పంచియిచ్చిన తల్లిదండ్రులలోనే 'స్వార్థం' తలెత్తింది. ఆ స్వార్థం వెనుక ఉన్న ఆవేదన కూడా ఏమంత చిన్నదికాదని నాకు తెలుసు. ఏమైతేనేం చివరికి బలి అయ్యింది నా జీవితమే.

నేను గదిలోకి వెళ్ళేసరికి శీను కుర్చీలో కూర్చుని శ్రద్ధగా చదువుకుంటున్నాడు. వంచిన తల ఎత్తకుండా. కాస్త పరిశీలనగా చూస్తే ఎవరికైనా తెలిసిపోతుంది వాడి బుద్ధిమంతనం అంతా వట్టి 'పోజ్'నని. వాడి తాపత్రయమంతా నామెప్పునుపొంది 'ఓ ఫైవ్‌రుపీస్' సంపాదించి స్నేహితులతో సర్దాగా హోటలుకి. సినిమాకి పోవాలనే నెలకోసారి వాడికా 'మామూలు' యివ్వటం నా కలవాటే. మొన్ననే ఫస్టు తారీకు.

'ఏరా శీనూ! ఇంగ్లీషు పేపరిచ్చేరా?' అనడిగేను.

'ఇచ్చేరక్కాయ్ నూటికి అరవై మూడు మార్కులు'. గర్వంగా సమాధానమిచ్చేడు.

నేను ఎక్కడ నమ్మనోనని టేబులుమీద రెడీగా పెట్టిన 'ఆన్సర్ పేపరు' తీసి చూపించేడు శీను.

వాడు ఎంత కొంటెపిల్లడైనా చదువులో మాత్రం చాలా చురుకు అందుకే వాడేమడిగినా యిస్తాను నేను.

ఆ తరువాత విజయవైపుకు తిరిగినయ్ నా కళ్ళు. ఎప్పుడు దాంతో మాట్లాడదామన్నా ఏదో 'ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు' నన్ను వశంచేసుకుంటుంది. అది నావంక సూటిగా చూస్తే సిగ్గుగా, దిగులుగా ఉంటుంది నాకు. నిర్మలంగాఉన్న దాని కళ్లను చూడగానే నల్లనివలయాలేర్పడిన నా కళ్ళు గుర్తుకువచ్చి బాధగా ఉంటుంది నాకు. అదీకాక అది నా వంక చూసినప్పుడల్లా సగం నెరిసిన నా తల వెంట్రుకలను, బిగువు సడలిపోతున్న నా నిరర్థక శరీరాన్నీ గేలిచేస్తున్నట్టు నా అనుమానం. అది వట్టి నా అనుమానం కాదు. నిజం. దాని స్వభావం నాకు తెలియదు గనకనా.

విజయ మంచంమీద వెల్లకిలా పడుకుని గోడకు నిల్చోపెట్టిన దిండుకు తలానించి నిర్లక్ష్యంగా పాఠం పుస్తకంలోని పేజీలను తిరగవేస్తోంది. నేను వచ్చినసంగతి తెలిసి కూడా అదలా తనకేం పట్టనట్టుండేసరికి నాకు బాధనిపించింది.

ఐనా గంభీరంగా ముఖంపెట్టి దానిని కూడా పలకరించేను. 'నీకా పేపర్లు ఏమిచ్చేరే విజయా?'

'ఇవ్వాళ బోటనీ, కెమిస్ట్రీ పేపర్లిచ్చేరు.'

'మార్కు లెలా వచ్చినయ్ ?'

'బోటనీలో 40% కెమిస్ట్రీలో 23%'

'కెమిస్ట్రీలో తక్కువ మార్కులు వచ్చేయ్?'

'పరీక్షల్లో చదవలేదు సరిగ్గా.'

'చదవలేదని తెలుస్తూనే ఉంది. ఎందుకు చదవలేదా అంట?' కొస్త హెచ్చుస్వరంలోనే అన్నా.

చివ్వునలేచి కూర్చుంది విజయ. 'ఎందుకు చదవలేదేమిటి? చదవబుద్ధి కాలేదు, చదవలేదు. అంతే. అదీకాక కెమిస్ట్రీ అంటే చచ్చే 'బోర్' నాకు. మా లెక్చెరర్ చెప్పే పాఠాలు ఆవిడకే సరిగ్గారావు. బోర్డుమీద ఒక 'ఈక్వేషన్' వేసిందంటే దానిని 'బాలెన్సు' చెయ్యటానికి అరగంట తన్నుకుంటుంది మా లెక్చెరర్. అదీకాక మాకు కెమిస్ట్రీ థియరీ ఎప్పుడూ సాయంత్రం లాస్ట్ పిరియడ్ ఉంటుంది. అలసిపోయి ఉండటంవల్ల అందరికీ ఎప్పుడు ఇంటికి వెళ్తామా అనే అంటుంది తప్ప పాఠం విన బుద్ధి కాదు.' మార్కులు మంచిగా రాకపోవటానికి తన బాధ్యత ఏమంతలేదని విడమర్చి చెప్పేసింది విజయ.

అది చెప్పిన కారణాలు నిజమే కావచ్చు. కాని అసలా కుండబద్దలుకొట్టినట్లు నిజం చెప్పేసరికి నన్నవమానించినట్లు 'ఫీ'లయ్యాను. దాని వయసులోని ఆడపిల్లకు అంత బలమైన వ్యక్తిత్వం ఉండటం 'శుభ'లక్షణం కాదని నా ఉద్దేశ్యం. మార్కులు తక్కువ వచ్చినా ఎక్కువే వచ్చేయనో, లేదా పేపర్లింకా యివ్వలేదనో అది అబద్ధమాడితే నాకంత కోపం వచ్చేదికాదు.

'చదవటం చేతకాక ఏవో సాకులు చెప్పటం నేర్చుకున్నావ్. అసలు నీకు బుర్ర కుదురుంటేనా చదివేందుకు? ఎంతసేపూ ఆ అమ్మాయేం చీర కట్టుకుందీ, ఏ లెక్చెరర్ 'హెయిర్‌స్టైల్' అందంగా ఉందానీ, 'నవరంగ్'లో ఏం పిక్చర్ వచ్చిందనీ — యివేగా ఉమెన్సు కాలేజీలో మీరుచేసే ఘనకార్యాలు! పైగా లెక్చెరర్లకే వంకలుపెట్టటం మొదలెట్టేవ్?' అని వెంటనే అది ఎక్కడ ఎదురుతిరుగుతుందోనని గబగబ యివతలకి వచ్చేసేను.

రాత్రి భోజనాలైనాక రోజూలాగానే ఒక యింగ్లీషు నవల చేతిలో పట్టుకుని మంచం మీద వాలేను. కళ్లెం తెగిన గుఱ్ఱంలా పరుగులు పెట్టే మనసును అదుపులోపెట్టే ఉద్దేశ్యంతో తీరిక సమయాల్లో సాహిత్యపఠనం చెయ్యటం అలవాటు చేసుకున్నాను. ఐతే నేను చదివే పుస్తకాల్లోకూడా నేను నేటిని మర్చిపోదామని ప్రయత్నిస్తున్నానో ఆ ప్రేమ, వెన్నెలరాత్రులు, సన్నజాజులు, సెక్సూ అన్నీ ఉన్నయ్. కాని వాటిలో నేను పొందే అనుభూతి పరోక్షమైన దవటంవల్ల నన్నంతగా ఊపి పారవేయవు. అదీకాక అనుభవాలెరుగని నేను ఆయా పాత్రలతో తాదాత్మ్యంపొందుతూ ఒక చిత్రమైన సంతృప్తిని పొందుతూంటాను. తెల్లవారింది. ఎప్పటిలానే టూత్‌పేస్టు దగ్గరనుండి అన్నీ సీను, ఊర్మిళ, అందిస్తుంటే పనులన్నీ ముగించుకుని, భోజనంచేసి తొమ్మిదిన్నరకల్లా యూనివర్శిటీ బస్సు స్టాపులో ఉన్నాను.

అక్కడ నాకు కొంచెం దూరంలో నా దగ్గర చదువుకుంటున్న యూనివర్శిటీ విద్యార్థినులిద్దరున్నారు. వాళ్ళు నన్ను చూడగానే 'విష్' చేసేరు. నా దగ్గరగావచ్చి నిలబడ్డారు.

నా విద్యార్థు లందరికీ నేనొక ఆరాధ్యదేవతని. హిస్టరీలాటి రసహీనమైన సబ్జక్టును కూడా మనసుకి హత్తుకుపోయేటట్లు చెప్తానని నాకు మంచి పేరుంది యూనివర్శిటీలో.

నా 'డిగ్నిటీ'ని నిలబెట్టుకునే ఉద్దేశ్యంతో ఎక్కువగా వాళ్లతో సంభాషణని పొడిగించలేదు నేను.

బస్సు వచ్చింది.

అందరూ చిలచిలమంటూ ఎక్కుతున్నారు. మర్యాదకోసం ముందు నన్నెక్కనిచ్చి ఆ తరువాత ఆ విద్యార్థినులిద్దరూ ఎక్కేరు. వాళ్ళు నా పక్కనే కూర్చుని నాకు వినపడేట్లుగా నిన్న క్లాసులో నేను చెప్పిన పాఠాన్నిగురించి చర్చించుకుంటున్నారు.

బస్సులో చాలామంది యూనివర్శిటీకి సంబంధించినవాళ్లే. అందులోని ఆడవాళ్లంతా రకరకాలుగా కత్తిరించిన బ్లౌజుల్లో, రంగురంగుల చీరల్లో, వివిధరకాల 'హెయిర్‌స్టైళ్ల'లో కన్నులపండువగా ఉన్నారు. వాళ్లందరిలో ఏకొద్దిమందో తప్ప మిగతా వారంతా పెళ్లికానివారే. అలాటివారిలో 75 శాతం యికముందుకూడా పెళ్లికాదని నిశ్చయంగా చెప్పగల వయసులో ఉన్నారు. ఈ హైదరాబాద్‌లోనేకాదు. భారతదేశంలోని అన్నినగరాల్లోనూ, పట్టణాల్లోనూ యిలాటి వయసుమీరిన అవివాహితల సంఖ్య అధికంగానే ఉంది. దీనికి కారణం నేటి విద్యాధికులైన యువకుల్లో నానాటికీ తీవ్రతరమౌతున్న కట్నాల దాహమని కొందరూ, చదువుకుని ఉద్యోగం చేస్తున్న కూతుళ్లకు పెళ్లిళ్లు చేసేస్తే, సంసారాలు గడచేదెలా అని వాపోయే మధ్యతరగతి కుటుంబాల్లోని తల్లిదండ్రుల స్వార్థగుణమని కొందరూ అంటుంటే అసలు శారదాబిల్లు ప్రవేశపెట్టిన తేదీయే మంచిదికాదనీ, అందువల్లనే మన దేశంలో 'ముదికన్య'ల సంఖ్య క్రమంగా అధికమైపోతోందనీ వాదిస్తాడు ఒక జ్యోతిష శాస్త్రపారంగతుడు. ఏది యేమైనా ఒకప్పటి బాలవితంతువుల్లా యిప్పటి వసుమీరిన అవివాహితలు సంఘంలో హృదయవిదారకమైన 'సమస్య'లై కూర్చున్నారు.

బయటకు వచ్చినప్పుడు కలకలలాడుతూ చీకూ చింతా లేనట్లు కనిపించేవాళ్లందరి గుండెల్లోను ఎన్నివిషాదపులోతులున్నాయో వారిలో ఒక దాన్నైన నాకు బాగా తెలుసు. ఐతే అప్పుడప్పుడు బస్సులో కిటికీలకు దగ్గరగా కూర్చుని రోడ్డుమీద పోతున్న జంటలను చూడగానే వారి ముఖాల్లోకి చటుక్కున పాకే నీలినీడలు కూడా 'అరుదై'నవేం కావు.

జిలుగువెలుగుల వేషధారణతో తమలో రగిలే అగ్నిపర్వతాలను చల్లార్చుకునే యీ కృత్రిమజీవుల దౌర్భాగ్యానికి జాలిపడే దెవ్వరు?

బస్సులో కూర్చున్నంతసేపూ నాలో రోజూ యివే **ఆలోచనలు.**

బస్సు ఆర్ట్సుకాలేజీముందు ఆగింది. నా ఆలోచనలుకూడా నిల్చిపోయినయ్.

మళ్లీ క్లాసులు, విద్యార్థులు, కొలీగ్సు—అదో సందడి.

సాయంత్రం యింటికి తిరిగి వచ్చేసరికి ఎన్నడూ లేనిది యిల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఆ అసహజమైన నిశ్శబ్దతను చూసేసరికి నా గుండెలో దడపుట్టింది.

నన్ను చూస్తూనే వంటింటి గుమ్మందగ్గర కూర్చున్న అమ్మ గట్టిగా శోకాలు పెట్టసాగింది. కుర్చీలో కాళ్లు పెట్టుకుని కూర్చున్న నాన్నగారు వెంటనే లేచి తన గదిలోకి వెళ్లిపోయేరు. ఊర్మిళ బొటనవేలు చీక్కుంటూ కూర్చున్నదల్లా అమ్మ గట్టిగా ఏడవటంతో వేలు తీసేసి బిక్కమొహం వేసింది.

నాకేం అర్థంకాలేదు. 'అమ్మా! ఏమయిందే? ఎందు కేడుస్తావ్?' అన్నాను ఆత్రంగా.

ఆయుర్వేద భూషణ
పండిత నోరి రామశాస్త్రులవారి
*** క్షీరవర్ధని ***
చనుబాలను వృద్ధిచేయు రసాయనము. దీనిని వాడుటవలన చనుబాలు స్వచ్ఛమై సమృద్ధిగా పసిపాపకు సరిపోవునట్లుచేసి, లేత పిల్లల యారోగ్యమును కాపాడును.
వెల 100ml రు. 3/- : 200ml రు. 5/-
*** జీవనవటి ***
ధాతు పుష్టికి, నరముల పటుత్వమునకు ప్రసిద్ధి గాంచినది. శుక్లనష్టము, నపుంసకత్వము లచే పీడింపబడు వృద్ధులకు నైజము శక్తి నిచ్చి, ఓజస్సును వృద్ధి చేయును.
వెల 30 మాత్రలు రు. 6/-
మానని దీర్ఘవ్యాధులకు పోస్టుద్వారాకూడ సలహో యిచ్చి, ప్రత్యేక చికిత్స చేయబడును. క్యాటలాగు, సలహా ఉచితము.
డాక్టరు నోరి వెంకటేశ్వరశాస్త్రి.
A.V.A.C., A.L.I.M.
చీఫ్ ఫిజిషియను. ఆయుర్వేద నిలయం,
పోస్టుబాక్సు 32, **విజయవాడ-1. ఆంధ్రప్రదేశ్.**

'ఇంకా ఏమవ్వాలే తల్లీ. ఆ పాపిష్టిముండ కొంప ముంచేసిందేవ్' అంటూ మళ్ళీ రాగాలు తీయ సాగింది అమ్మ.

విషయం చెప్పకుండా అలా ఏడుస్తున్న అమ్మని చూస్తుంటే అసలే కుతూహలంగా ఉన్న నాకు చిరాకేసింది. 'ఒరేయ్ శీనూ' అని పిల్చేను గట్టిగా.

శీను గదిలోనుండి వచ్చేడు తలొంచుకుని.

'ఏం జరిగిందిరా అసలు?' అసహనంగా ప్రశ్నించేను.

'మరే విజయక్కా' అంటూ చప్పున ఆపేసేడు అమ్మవంక బెరుకుగా చూస్తూ.

'ఏమయిందిరా - విజయకు? చెప్పి చావూ?' పిచ్చిగా అరిచేను.

'మరే. ప్రకాశరావుగారి రెండో అబ్బాయి వేణుగోపాల్ లేడూ......అతన్ని పెళ్ళిచేసుకుందిట విజయక్క. వాళ్ళిద్దరికీ నెల రోజుల క్రితమే రిజిస్టర్ మారేజి అయిపోయిందట. వేణుకి తిరుపతిలో ఉద్యోగం దొరికింది. అందుకని తిరుపతి వెళ్ళిపోతున్నానంటూ చీటీ వ్రాసి వెళ్ళింది విజయ'.

కొంతసేపు స్తబ్ధంగా నిల్చుండిపోయేను శీను మాటలు విని.

నాకు వాడి మాటలు వింటే ఆశ్చర్యం కలగలేదు. ఇలాటి దేదో జరుగుతుందని ముందే తెలుసు నాకు. కాని ఎదురు చూసిన విషయమే అయినా హఠాత్తుగా నా ఊహ నిజమవటంతో విభ్రాంత పోవలసి వచ్చింది.

మాట్లాడకుండా నా గదిలోకి వెళ్ళేను. స్నానం చేసేను. బట్టలూ అవీ అన్నీ నేనే తెచ్చుకున్నాను. వంట యింట్లోకి వెళ్ళేను. ఆ రోజు టిఫిన్ చేసిన సూచనలేం లేవు నేనే స్టౌ వెలిగించి కాఫీ కాచుకుని తాగేను. ఎవరూ నాకు 'సేవలు' చెయ్యనందున నా మనసు హాయిగా ఉంది.

ఇల్లంతా స్తబ్ధంగా ఉంది. ఎవరిలోనూ ఉత్సాహం లేదు. నాకు మాత్రం ఎందుకో మనసు తేలికై పోతోంది. ఇన్నాళ్ళూ రగుల్తున్న అగ్నిపర్వతం యీ నాడు బద్దలై పోవటంవల్ల నాలో ఒక భయంకరమైన ప్రశాంతత ఏర్పడింది.

ఇకనుండి మిడిసిపడుతూ నా కంట్లో నలకలా ఉంటూ వస్తున్న విజయను చూడవసరం లేదు. అందుకే నా కదోరకం తృప్తిగా ఉంది.

నా గదిలోకి వెళ్ళేను. బీరువాలోని అద్దం ముందు నిల్చున్నాను. తదేకంగా అద్దంలోకే చూస్తున్న నాకు నా ప్రతిబింబం నవ్వినట్లయి ఉలికిపడ్డాను.

'నువ్వు చెయ్యలేకపోయిన పనిని, నువ్వు చెయ్యాలని తీవ్రంగా వాంఛించిన పనిని విజయ చేసేసింది. అందుకే ఆమె జీవితం ధన్యమైంది. నీలో ఆ చొరవ, ధైర్యం, రసపిపాస లేవు అందుకే నువ్వు 'మోడు'లా అయిపోయేవు. నీ జీవితాని కింక వసంతంలేదు' అంటూ అద్దంలోని 'జ్యోతి' హేళిస్తోంది.

నా ప్రతిబింబాన్ని నేను భరించలేకపోయేను. అక్కడనుండి కదలి తోటలోకి వెళ్ళేను—యీసారి నాన్నని పలకరించకుండానే గట్టుమీద కూర్చున్నాను. నా కెదురుగా రెండువైపులా విరగబూచిన రకరకాల పూలు మధ్యనే సన్నని బాట. ఆ బాట కిరువైపులా క్రోటను మొక్కలు. రంగురంగుల ఆకులతోఉన్న ఆ క్రోటను మొక్కలను చూస్తుంటే ఉదయం బస్సులో నేను చూసిన అమ్మాయిలు గుర్తుకు వచ్చేరు. విరగబూచిన మందారాలు, ముద్దబంతులమధ్య ఆ క్రోటను మొక్కలు ఎందుకలా వెలవెలా బోతున్నాయో, అర్థమయింది నాకు. చెట్టుకు పూలు, కాయలూ ఎలా అందాన్నిస్తాయో అలాగే స్త్రీకి వివాహం, మాతృత్వం, సౌందర్యాన్ని, పరిపూర్ణతని యిస్తాయ్. పైపై ఆకర్షణలేతప్ప జీవితంలోని అతిముఖ్యమైన ఆనందానుభూతులకు దూరమైన మేమంతా క్రోటను మొక్కలు లాటివాళ్ళమే!

మళ్ళీ తెల్లవారింది. రోజులానే బస్సులో యూనివర్శిటీకి పోవటం, తిరిగి రావటం ఇంటికి వస్తున్నప్పుడల్లా గృహవిషయాలమీదనే నా ఆలోచనలు. 'నాన్నగారి కళ్ళజోడు బద్దలయింది. కొనాలి. అమ్మ జాకెట్లు చిరిగిపోయినయ్. నాలుగు గుడ్డలు పట్టించాలి. శీనుగాడి ఎక్స్‌కర్షన్‌కి నలభై రూపాయలు. విజయకి—అన్నట్టు దానికి నే నివ్వవలసిన దేంలేదు.'

కలగూరగంప:

"బ్రహ్మోత్తర ఖండము"

పద్య కావ్యము

ప్రసంగ వశమున దాళపత్ర గ్రంథముల దుస్థితిని గూర్చి ప్రస్తావింప, సహృదయులగు శ్రీ మామిడిమడ రామచంద్రయ్యజోషిగారు, తమ గ్రామముననున్న కొన్నితాళపత్ర గ్రంథములను నా కందజేసిరి. వానిలో 'పరమభాగవతాంబరీషరాజవిలాసము'ను 'మే' భారతిలోఁ బ్రకటించితిని. ప్రస్తుతము 'ప్రాంతకోట పుల్లయ్యకవి'చే రచితమైన 'బ్రహ్మోత్తర ఖండ' మను మహాపురాణమును గూర్చి తెల్పఁదలఁచితిని.

ఇది 'గుమడవెల్లి శింగపట్నంకు ప్రబంధాల లక్ష్మయ్య కొమారుఁడు—జంగయ్య' (ఇతఁడు వ్రాయసకాఁడు) వ్రాసియిచ్చినదట! ఇప్పటికి 107 సంవత్సరముల క్రింద రౌద్రినామసంవత్సరమున నతఁడా గ్రంథమును వ్రాసికొనినట్లు అందే కలదు. అక్షరములు సుందరముగ నున్నవి. అనాయాసముగఁ జదువ వచ్చును.

ఈ గ్రంథ మింతవఱకు [1]కవుల చరిత్రలలో స్థానము సంపాదింపకొనకపోవుటచే 'నముద్రిత' మనియు, నింతవరకు అలభ్యమనియు భావింపఁబడు చున్నది.

ఇది తొమ్మిదాశ్వాసములుగల మహాప్రబంధము. గ్రంథకర్త పుల్లయ్యకవి. పీఠికమూలమున నీ క్రింది వివరములు తెలియుచున్నవి.

నివాసము:—వీరు 'వీరనారాయణపుర'మని ఖ్యాతిగాంచిన ప్రాంతకోట గ్రామనివాసులు. అది శ్రీశైల పశ్చిమమున—సంగమేశ్వర, కపిలేశ్వర, సిద్ధేశ్వర మల్లేశ్వరాది లింగభాసురం బనుటచే, నిది కర్నూలు మండలమునందలి నందికొట్కూరు తాలూకాలోని ప్రాంతకోటయే యనుటలో నెట్టి సందేహమునులేదు.

వీరు నియోగులు. అనుమకొండ ప్రథమ శాఖీయులు. కాశ్యప సగోత్రులు. కాత్యాయన సూత్రులు. వీరి వంశవృక్ష మిది.

కస్పామాత్యుఁడు
(వంశ మూల పురుషుఁడు)
|
అక్కన
|
పోతరాజు
|
పెదవీరమరాజు
|
రేఖన (భార్య, అక్కమాంబ)
|
పుల్లయ (ఏతద్గ్రంథకర్త)
|
రామలింగఁడు

కృతి కర్త్రు కాల నిర్ణయమునకు గ్రంథమున నాధారము లేనియుఁ గన్పింపదు.

గ్రంథవిషయము:—కృత్యాది స్తోత్రములలో మొదట నన్నయగారి 'శ్రీ వాణీ' త్యాది పద్యమునుబోలిన—

'శ్రీ వా క్పర్వతజా సరోజముఖులన్
జెన్పొంద నిత్యంబు
వక్షోవక్త్రాంగములం ధరించి
సుమనఃకోదండకేళీకళాప్రావీణ్యంబుల
సౌఖ్యముల్గను హరి బ్రహ్మ త్రినేత్రాఖ్యులన్
సేవింతు న్నుతియింతు నెంతు
సకల శ్రేయోకా వచో రూఢికిన్.'

అను పద్యముచే వీరు అద్వైతియని తెలియుచున్నను, విశేషించి శివభక్తుఁడు. ఈ విషయమును పీఠికలోని యితర దేవతాస్తుతి తెలియఁజేయుచున్నది. పై పద్యము తర్వాత క్రమముగా శ్రీశైల మల్లికార్జున స్తుతి, భ్రమరాంబాస్తుతి, విఘ్నపతిస్తుతి,

1. చాగంటివారి కవితరంగిణులు. ఖండవల్లి లక్ష్మీరంజనంగారి సాహిత్య చరిత్ర సంగ్రహము. బులుసు వేంకటరమణయ్యగారి కవి సప్తశతి.

వీరభద్రస్తుతి, వాణీస్తుతి గలవు. తర్వాత నొక సీసపద్యమున పురాతనాధునాతనకవిప్రశంస గలదు: ఇం దాతఁడు వాల్మీక్యాది సంస్కృత కవులను, నన్నయ మొదలు – నాచనసోమనివఱకుఁగల యాంధ్ర కవులను స్మరించెను.

ఈ గ్రంథము శ్రీశైలమల్లేశున కంకిత మొనర్పఁబడినది. అయినను పూర్వకవులవలె 'భగవంతుఁడు స్వప్నములోఁ గనిపించుట, కృతిపతిత్వ మర్థించుట' మొదలగు కల్పనముల జోలికిఁబోలేదు. 'ఆప్తులు–బంధుగులు శ్రీశైలపతి ప్రేరణమునఁ గాఁబోలు తన్ను 'బ్రహ్మోత్తర ఖండాంధ్రీకరణము'నకుఁ బ్రేరేపించిరని సత్యమును స్పష్టముగా వ్యక్తపఱచినాఁడు. షష్ఠ్యంతములుగా నెనిమిది కందములు వ్రాసి పీఠిక ముగించెను.

వ్యాసరచితములైన యష్టాదశ పురాణములలోఁ బదమూఁడవది స్కాందపురాణము. అది (1) ఖండాత్మకము, (2) సంహితాత్మకము నని రెండువిధములుగాఁ గలదు. అందు ఖండాత్మకమగు స్కాందమున 7 ఖండములుగలవు[2]. అందు మూఁడవది బ్రాహ్మఖండము. దానియందు మూఁడుభాగములుగలవు. 1. సేతుమాహాత్మ్యఖండము 2 ధర్మారణ్యఖండము 3. బ్రహ్మోత్తరఖండము. ఇదిగాక సంహితాత్మక స్కాందమునందు 5-వ దగు బ్రాహ్మసంహిత యందును బ్రహ్మోత్తరఖండముగలదు.

ఈ పురాణమును పిడుపర్తి బసవన ద్విపదలో వ్రాసెనఁట! అది యలభ్యము. మండపాక కామకవియు పట్టమట్ట సోమనాథుఁడును దీని నాంధ్రీకరించి యున్నట్లు కవిచరిత్రలవలనఁ దెలియుచున్నది. అందు పట్టమట్ట సోమనాథుని కృతి ముద్రితము.

శివపారమ్యబోధకమగు నీ పురాణమును ప్రాఁతకోట పుల్లయ్యకవి రసవంతముగా రచించినారు! ఇందలి కథావివరములివి!

ప్రథమాశ్వాసమున:–శివపంచాక్షరీమహిమ.

ద్వితీయాశ్వాసమున:– మాఘకృష్ణ చతుర్దశీ దివోపవాస, శివపూజా జాగరణ మాహాత్మ్యము.

తృతీయాశ్వాసమున:– త్రయోదశి ప్రదోష పూజా మాహాత్మ్యము.

చతుర్థాశ్వాసమున:–సోమవార వ్రత మాహాత్మ్యము.

పంచమాశ్వాసమున:–శివభక్త పూజామహిమ.

షష్ఠాశ్వాసమున:–విభూతిమహిమ.

సప్తమాశ్వాసమున: – ఉమామహేశ్వరమహిమ.

అష్టమాశ్వాసమున:–రుద్రాక్షమహిమ.

నవమాశ్వాసమున:–పురాణశ్రవణమహిమ.

ఈతఁడు తన గ్రంథమున కందము నధికముగాఁ బ్రయోగించుచు (522) నచ్చటచ్చట మాలిన్యాది విశేష వృత్తముల వాడుచు, మొత్తము 1671 గద్యపద్యముల రచించెను. ఇందు భాష సంపూర్తిగ సలక్షణమనుటకు వీలులేదు. అచ్చటచ్చట– 'ఇటీవలి గ్రంథము'లం దుదాహరింపబడిన 'పట్టుక' మొదలగు లక్షణవిరుద్ధములగు పదములు గలవు. క్త్వార్థ సంధులు గావింపబడినవి అట్లయినను చక్కని రచన యనుట కెట్టి సందియమునులేదు. వ్యర్థపదప్రయోగములులేక చక్కని ధారాశుద్ధితో, రసోచితముగా నితఁడు పద్యముల రచించెను.

దాశార్హుఁడను మహారాజు నెదుర్కొనిన యొక రాక్షసుని వర్ణనమును జూడుఁడు.

'ఘోరాకార కరాళ దంష్ట్రుం
డధిక క్రోధోద్ధతుం డుగ్రసంచారుం
డూర్ధ్వ పిశంగకేశుఁ
డసితకాష్ఠభృద్వరోన్నత్య
దుర్వారోదగ్రశరీరి
దావదహనజ్వాలాజ్వలజ్జిహ్వుఁ
డింద్రారాతిప్రవరుం డొకం
డెదుట నుద్యద్యుద్ధసన్నద్ధుఁడై.'

ఇట్లు నాతని శైలి యామూలాగ్రము సరస మనోహరముగా నున్నది. పూర్వకవుల పద్యములలోఁ దనకు నచ్చినవానికి నితఁడు సంవాదిరచనలు గావించెను.

ఆంధ్ర విమర్శకులు మఱికొంత పరిశీలింప వలసిన కవులలో ప్రాఁతకోట పుల్లయ్య కవిగారు నొకరు! ఆంధ్రులు స్మరింపఁదగిన గ్రంథములలో నిదియు నొకటియై ముద్రణ భాగ్యమునకు త్వరలో నోచుకొనఁగలదని యాశించుచున్నాను.

వింజమూరి శేషఫణిశర్మ.

---

2. (1) మహేశ్వరఖండము (2) వైష్ణవ ఖండము (3) బ్రాహ్మఖండము (4) కాశీఖండము (5) అవంతిఖండము (6) నాగరఖండము (7) ప్రభాస ఖండము.

గ్రంథ విమర్శలు

మానవుడే మా సందేశం

[కవితాసంకలనం; సంకలనకర్త; జలజశ్రీ; ప్రచురణ, చైతన్య సంస్కృతి; జడ్చర్ల; మహబూబ్‌నగర్‌జిల్లా; 98 పేజీలు; వెల రూ. 2.]

ప్రయాణ సాధనాలు ప్రపంచాన్ని చిన్నదిగా చేసి వెయ్యటాన దేశదేశాల సాహితీప్రక్రియలతోనూ ప్రతి దేశమువారూ పరిచయం చేసుకోగలుగుతున్నారు. చదువరులలో ఆకలి పెరుగుతున్నది. ఎప్పటికప్పుడు విశ్వ సాహిత్యంలో వస్తున్న చైతన్యవంతమైన మార్పుల్ని చూసి వాటి ఛాయలను, తమ భాషలో చూడాలని ఉవ్విళ్లూరటం జరుగుతున్నది. అలాగే తమ భాషలోనూ నూతన ప్రయోగాలను అర్థంచేసికొని ఆనందించటానికి వాళ్లు సంసిద్ధంగా ఉంటున్నారు. నేటి కవి ఎవరైనా నూతనప్రయోగం కవిత్వంలో చేస్తే దాని ప్రభావాన్ని కనుగొనటానికి ఎంతో కాలం వేచిఉండనక్కరలేదు చదువరులుకూడ అగస్త్యులై తమ భాషలో ఎప్పటికప్పుడు వస్తున్న నూతన రీతులను ఆపోశన చేసికోవాలనుకుంటున్నారు. కవులకూ, చదువరులకూ సేతువు నిర్మించి యిచ్చి కావ్యసంకలనాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. కవిత్వంలో వస్తున్న మంచిచెడ్డలన్నింటినీ కావ్యసంకలనాలు ప్రతిబింబించటం అవసరం. 'లోకోభిన్నరుచిః' అని ఉండనే ఉన్నది. ఎవరికే ప్రయోగం నచ్చుతుందో, ముందరి రోజుల్లో ఏ ప్రయోగాన్ని ప్రజ లాదరిస్తారో కావ్యసంకలనకర్తలు జోస్యం చెప్పనక్కర లేదు. ఈ దశాబ్దంలోవచ్చిన, వస్తూన్న కావ్యప్రయోగాలను తగుమాత్రంగా పరిచయంచేసిన కావ్యసంకలనం 'మానవుడే మా సందేశం.'

'మానవుడే నా సందేశం
మనుష్యుడే నా సంగీతం'

అనే శ్రీ శ్రీ వాక్యాలలోని ఒక వాక్యాన్ని ఈ కావ్యసంకలనానికి పేరుపెట్టుకొని, దీన్ని ఆ మహా కవికే అంకితమివ్వటం సముచితంగా ఉన్నది. యుగకర్త శ్రీ శ్రీ గురించి శ్రీ కె. వి. రమణారెడ్డిగారి సమగ్రమైన పరిచయమూ, శ్రీ శ్రీ గురించి రమణా రెడ్డిగారిదే

'పాడుతా శ్రీ శ్రీ గురించి
మీటుతా వందన విపంచి'

అనే పెద్దగీతమూ గ్రంథారంభంలో చేర్చబడ్డాయి. శ్రీ శ్రీ 'ఖడ్గసృష్టి' గీతాన్ని రంగుకాగితం పైన అందంగా ముద్రించారు. శ్రీ శ్రీ ముద్రనుండి విడివడి స్వతంత్రతను నిల్పుకొన్న పలుమంది కవుల గీతా లిందులో ఉన్నాయి.

ఈ కావ్యసంకలనానికి అలంకారప్రాయమైన రమణారెడ్డిగారి పరిచయవ్యాసంనుండి కొన్ని వాక్యాలీసమీక్షలో ఉదహరించటం సబబనుకుంటాను. శ్రీ శ్రీ కవిత్వపు క్రమపరిణామాన్ని గూర్చి చర్చించి, శ్రీ శ్రీకి గల ప్రేరణలను పేర్కొన్న తర్వాత, శ్రీ శ్రీ కవిత్వపు తత్వాన్నీ శక్తినీ ఉగ్గడించి "శ్రీ శ్రీ సమాజపురోగతికి కవిత్వచిహ్నమై జాతిమనస్సులో పీఠం వేసుక్కూర్చున్నాడు" అని క్లుప్తంగా శ్రీ శ్రీ శక్తిని అంచనా వేశారు. యుగకర్త శ్రీ శ్రీ ఎంత గొప్పవాడైనా శ్రీ శ్రీ తదనంతర కవుల కవిత్వానికి వైశిష్ట్యమూ వైపుల్యమూ ఉన్నాయని వాటిని గమనించితీరాలనీ శ్రీ రమణారెడ్డి ఉద్ఘోషిస్తున్నారు "శ్రీ శ్రీయుగం మరెన్నాళ్లు? గద్యాన్ని పద్యానికిచ్చి పెళ్లిచేసినవాడు, వచనకవిత్వ విజృంభణాన్ని నవయుగోదయంగా భావించడు. సామాజికదృక్పథాన్ని కవిత్వానికి అలవరచిన వాడు, అభ్యుదయకవిత్వం కనుమరుగవడం చూచి తనకాలందగ్గరకు వచ్చిందనుకోడు. ఛందోబంధోబస్తులూ, వ్యాకరణాల సంకెళ్లులేకుండా కవి మనస్సులో భావం ఎలాంటి తీగలు సాగితే అలా కాగితం మీద పెట్టవచ్చునన్నవాడు, ఛందస్సు సరేసరి శబ్ద స్వరూపమే—కొద్దిగానైనా తెలీని అపశబ్దభయంలేని

'అప్పళాచార్యు'లను చూచి శిఖరంవంటి తన శిరస్సు దించుకోడు. ఇవన్నీ ఎలాగూ తప్పవు. కవిత్వం ఒక ప్రవాహం. దాని వెంబడి కలవదుంగలూవస్తాయి, చెత్తాచెదారమూ వస్తుంది. ఒక సంప్రదాయానికి ఆద్యస్థానంలో ఉన్న వ్యక్తికి, కాలక్రమంలో ఆ చెట్టున పుట్టే కుక్కమూతిపిందెలకుకూడా బాధ్యత ఎందుకుండాలి? ఎవరి యోగ్యతాయోగ్యతల బాధ్యత వారిదే. నవకవిలోకానికి శ్రీశ్రీ నియంతకానట్లే బాధ్యుడూ కాదు. ఇతరకవులకు శ్రీశ్రీ తండ్రికాదు; అన్న మాత్రమే.'' ఈ మాటలు అధునికాంధ్రకవిత్వాన్ని సానుభూతితో చదివే పాఠకులందరూ ఆలోచింపదగ్గవి; అట్లాగే 'మహాప్రస్థానం' వ్రాసిన శ్రీశ్రీయే జీవితాంతమూ ప్రగతివాదకవిత్వం వ్రాయనక్కరలేదు. ఆ కార్యాన్ని తరువాత కవులు సమర్థవంతంగా నిర్వహింపగలరు. ఐతే రమణారెడ్డిగారన్నట్లే యీ కవిత్వ ప్రవాహంలో కలవదుంగలూ, చెత్తాచెదారమూ వస్తాయి. 'మానవుడే మా సందేశం' అనే యీ కావ్యసంకలనంలో స్వచ్ఛమైన కవితాప్రవాహమూ, కలవదుంగలూ, చెత్తాచెదారమూకూడ ఉన్నాయి.

మొట్టమొదటనే ఇస్మాయిల్‌గారి 'మెటమార్ఫోసిస్' అనే గేయం ముగ్గులు పెట్టినట్లుగా అచ్చువేయబడింది. 'ఇంగ్లీషులో E. E. Cummings లాంటివాళ్ళు యీ విధమైన చమత్కృతిని కవిత్వంలోనూ, అచ్చులోనూ చూపెట్టారు. కొత్త ప్రయోగంపట్ల చురుకుదనం ఉన్న పాఠకులు చూపే ఆసక్తి తప్పించి, యిట్టి ప్రయోగాలకు ఇంగ్లీషు కవిత్వంలోనూ పెద్దఆదరం ఉన్నట్లు కన్పించదు. అసలు తెలుగు కవిత్వం చదివేవారెంతమందికి తెలుసు 'మెటమార్ఫోసిస్' అంటే? ఈ గీతంలో భావం ఉత్తమమైనది, వెల్లడించిన పద్ధతీ ఉత్తమమైనదే, అయితే దాని గమనం—లేక ఛందస్సు కొత్తది, తొలిగా తెలుగు కవిత్వానికి యిముడని దిమ్మా. శ్రీశ్రీ తన సిరిపిరిసువ్వలిస్సు గేయాలలోను, ఆరుద్ర తన 'త్వమేవాహమ్' కావ్యంలోనూ కొన్ని చోట్ల యీ పదాల విరుపునూ, పదాలతూగునూ చూపెట్టారు. ఐతే ఆంధ్ర పాఠకలోకం వీటిని జీర్ణించుకోలేక మొదట ఉపేక్షచేసి, తర్వాత నిర్లక్ష్యం చేసింది. మరి యీ కొత్తప్రయోగం సరికొత్తదైనందున అది పొందే ఆదరాన్ని వేచి చూడాలి.

'ఎలిజీ కాదు ఎపాలజీ'లో సోమసుందర్ కొత్త ప్రయోగాలమెరపులతాకిడికి దిగ్భ్రాంతుడై, యిదంతా కవిత్వంకాదు క్షమించమని భగవంతుణ్ణి వేడుకుంటూ 'కొంచ మంత్రగేజి, కించిదపస్వరం మిళాయించి బనాయిస్తున్నాము కవిత్వాలు' అని విస్ఫూహము వెళ్ళగక్కి తామొకప్పుడు కొత్తదారులు తొక్కామన్నది మరచిపోయి, అర్థంలేని 'కన్సర్వేటిజమ్' ప్రకటించి, ఎవ్వరూ అడగని, ఎవ్వరికీ అక్కర్లేని 'ఎపాలజీ' యిచ్చారు ఒక అభ్యుదయకవి యీ విధమైన తిరోగమన వాదాన్ని ప్రకటించటం ఆ ఉద్యమానికే సిగ్గుచేటు! ఇది క్షమార్హం కాదు, ఉపేక్షామాత్ర దండ్యమే.'

ప్రగతి మార్గాన్ని చాటేగేయాలు, సామాన్యుని జీవితంగురించి మథనపడి ఆ వ్రాసిన గీతాలు శ్రీయుతులు సి. విజయలక్ష్మి—ఎక్స్—రే—ఐస్; ఆరుద్ర—'మంత్రపుష్పం'; జలజశ్రీ—'శాంతికవాదం'; గజ్జల మల్లారెడ్డి—'భక్తిరసం'; వే. నరసింహారెడ్డి—'సత్యమప్రియమ్'; వరవరరావు — 'ఫర్మానా' సి. నారాయణరెడ్డి — 'మధ్యతరగతిమందహాసం'; శీలా వీర్రాజు—'ఆకలి మంటల్ని ఆర్పుదాం రండి'; దాశరథి అమావాస్య దీపాలు'; ఎన్నదగినవి; మెచ్చదగినవి. పై వారు ప్రసిద్ధమైన కవులు కాబట్టి మెచ్చుకోవటంకాక వారి కావ్యఖండికలలోని ప్రగతి మార్గాన్ని చూచి మెచ్చుకోవటమే. కొత్తకవులు, కవిత్వం వ్రాస్తూ యింకా కవులనే పేరును స్థిరపరచుకోనివాళ్ళూ, ఆ పేరును స్థిరపరచుకోలేనివాళ్ళుగూడ యీ సంపుటంలో దర్శనమిస్తారు.

'జన్మెత్తిన మానవునికి జీవితమే పోరాటం' అంటారు సి. విజయలక్ష్మి.

వాళ్ళు వరసకషాపులో అధునాతన షైలాకులు
తీరిగ్గా కూర్చుండిరి బాలీసుల నానుకొని
నుదుటినుండి బిందువులుగ స్రవించు పవిత్రరక్తం
తాకటు వాళ్ళు కంటూ జలగల్లా తాగుతారు.

అని జరుగుతున్న అన్యాయాన్నిగూర్చి ఆక్రోశించారు. అంతలోనే

'తత్త్వవేత్త తరువాత లోకంలో అబ్జర్వర్
కవికంటె ఎవడులేడు'

అనే ఉపదేశం చేశారు. కవి తనకు తానే వ్యాఖ్యాత కానక్కరలేదు కవి చెప్పదలచుకొన్న నీతి సూటిగా ఉండనూ కూడదు.

'అణువు గుండెలో మనిషికి
అమరత్వం లభించాక
ఈ కెరటం తరగమీద
ఆ మేఘం తునకమీద
చెరగనట్టి గీతంగా
చిరకాలం జీవిస్తా'

నని ఆరుద్ర కలకంటారు.

'గతి తార్కిక భౌతికవాదం
బ్రతుకును మార్చే నవీనవేదం
సమానత్వమును సాధించుటకు
సామ్యవాద మొకటేమార్గం'

జలజశ్రీగా రీవిధంగా తన సామ్యవాద పంథాలో గీతాన్ని అందులో ఉపదేశాన్ని అందించారు. అభ్యుదయ కవులలో తారా జువ్వలా వెలిగిన శ్రీ గజ్జల మల్లారెడ్డి గేయం పత్రికలలో పడి బహుళప్రచార మందినది. అన్యాయాన్నిగూర్చి సూటిగా ఆక్రోశించే ధోరణి యీ గేయంలోనూ కన్పిస్తుంది.

'మేధావుల తలలపైన
మూఢత్వం మేడగట్టి
అమావాస్య నిశిరాతిరి
దివాంధాలపండుగ గద!
....
తెలుగునాట భక్తిరసం
తెప్పలుగా పారుతోంది
డ్రయినేజీస్కీము లేక
డేంజరుగా మారుతోంది'

యీ పలుకులు చిరస్మరణీయాలు. శ్రీ వేముగంటి నరసింహారెడ్డిగారి 'సత్యమప్రియమ్'లో వ్యంగ్యాత్మకభావన పుష్కలంగా ఉన్నది.

'నిద్ర నెరుగని మనస్సుతో నడుస్తున్నాను
గుండెలోన కొండంత కుంపటిని దాచుకున్నాను
నలుగురిలో ఏడ్వటం నాగరికత కాదని
యోగిలా నవ్వటం నేర్చుకున్నాను.'

వరవరరావుగారి 'ఫర్మానా' గూడ వ్యంగ్యాత్మక భావనలో ఉదాత్తంగా ఉన్నది.

పి. వా. రె గారి 'మధ్యతరగతి మందహాసం'లో సామాన్యులు తమ ఆశలనూ, ఆశయాలనూ ప్రతిబింబించటం చూసి అందంగా సంతృప్తిగా మందహాసం చేస్తారు.

కవి హృదయంలోని రాగాలాపన దీనుల పాలిటి బాధలగూర్చి ఘూర్ణిల్లగా 'ఆకలిమంటల్ని ఆర్పుదాం రండి' అని సమాజంలోని ప్రగతిశక్తులను తట్టి శీలా వీర్రాజుగారు తమ సంకల్పాన్ని విప్పించారు.

కొంతకాలం క్రితం 'భారతి'లో ప్రకటింపబడి రసజ్ఞుల మనస్సులలో నిలిచిపోయిన దాశరథిగారి 'అమావాస్య దీపాలు' గీతం నవీన కవితామార్గంలో అభ్యుదయ కవిత్వానికి ఉత్తమలక్ష్యంగా నిలుస్తుంది. శాంతిప్రియులైన మానవులు యుద్ధాన్ని 'ఎరెస్టు' చెయ్యగా

'సైనికుని శిరస్త్రాణంలో
పాలిడల్లిన గూడు శుభం' చెప్తుంది.

అంతేనా 'మరఫిరంగిలో,
మందు దట్టించే చోట
పిచ్చుక పెంట సిల్లాడింది'

దాశరథి విలక్షణమైనకవి. ప్రణయమూ అభ్యుదయ ప్రళయమూ రూపు గైకొనిన ప్రజా చైతన్యానికి కవిత్వ ప్రతిబింబం దాశరథి.

కవిత్వంపట్ల ఆసక్తి సన్నగిల్లి, డబ్బొచ్చే విద్యలపట్లనే ఆదరం చూపిస్తున్న యీ తెలుగుజనం నడుమ ''కవి గావించావేంరా నన్ను'' అని శ్రీ కె. వి. రమణారెడ్డిగారు నివేదనలో ప్రశ్నించారు. ఈ కావ్యసన్యాసంలోని భాష ఒకచోట సంస్కృతపదభూయిష్ఠంగానూ, ఒకచోట శిష్టవ్యావహారికంగానూ, ఒకచోట ప్రాంతీయపు పలుకుబళ్లతోనూ కలగాపులగమై అన్న

వ్యస్తంగా ఉన్నది. అభ్యుదయాన్ని కవిత్వంతో అర్థించకపోయినా, ఒక్కొకచోట అభ్యుదయం అభిలషిస్తున్నట్లు వెలుకులతో—

“గద్దెమీద పెద్దవాడు
నేలవైపు చూస్తాడని
జాలితోడ చూస్తాడని”

ఆశించినట్లుగా చెప్పి ఆశ అడియాసలయినందుకు కుమిలిపోయి తెప్పరిల్లుకున్నారు శ్రీ సూఫిశ్రీ “అంతర్ద్రర్శనం”లో. – శ్రీ వేగుంట మోహనప్రసాద్ “ఆఖరి ఆశ్రమం”లో తెగిపోయిన అనుభూతులతో, తెగిపోయిన పదచిత్రాల నందించారు. “వెలుగు చల్లారిపోతున్న జీవితం” తమ దుఃఖానికి హేతువుగా స్పష్టం చేశారిగీతంలో.

ఇంకా ఈ కావ్యసంకలనంలో దిగంబరకవి ‘నిఖిలేశ్వర్’గారి “ఒకగంట బీచికెదురుగా శేబిల్‌పై” దృశ్యాన్ని కవిమాచి, మనని చూసేటట్లుచేసి

“ఇది బ్రతుకు
మిగిలిపోయిన జీవితసారము”

అనే తత్వాన్ని వెల్లడించారు. వీరందించిన పదచిత్రాలను కవులు మాత్రమే అందుకోగలరు. శ్రీశ్రీకి అంకితమిచ్చిన ఈ కావ్య సంకలనం చివర కాళోజీ రచన ‘మనవంటివాడు’ (శ్రీశ్రీ) గీతాన్ని చేర్చటం ప్రశస్తంగా ఉన్నది. దానవరాజ్యంలోనుండి “మానవుడే మా సందేశం” అని చాటే శీలా వీర్రాజుగారి చిత్తరువు చక్కగావచ్చింది. తెలుగులో కావ్యసంకనాలు కొంది గానేవచ్చాయి. రెండురూపాయలకే లభించే ఈ కావ్య సంకలనం కవితాభిమానులెల్లరూ, కొని చదివి దాచుకోతగినది.

వైతరణి

[వైతరణి; కవి: శ్రీ పి. వి. కృష్ణారావు; ప్రచురణ: ఫ్రీవర్స్‌ఫ్రంట్, హైదరాబాదు; ప్రతులకు: చింతల నర్సింహులు అండ్ సన్స్; హన్మకొండ; 50 పేజీలు; వెల ఒకరూపాయి]

‘అభ్యుదయ కవి’ అనే మాటలోనే పునరుక్తి ఉన్నదంటారు శ్రీ కొడవటి కుటుంబరావు. సమాజాభ్యుదయాన్ని వాంఛించనివాడు కవి యెలాగౌతాడు?” “శ్రీ కైవల్యపదంబు నొందుటకునై” కవిత్వాన్ని సాధనంగా యెంచిన వాళ్ళు ‘జగద్హితము’ కోసమే కవిత్వం చెప్పారు. కాని అభ్యుదయకవిత్వమనేది ఒక కాలపు కవిత్వానికే పేరుగా స్థిరపడిపోయింది. రెండవ ప్రపంచయుద్ధానికి పూర్వమే ఆంధ్ర సాహిత్యప్రియులు కొందరు ప్రపంచచరిత్రను కళ్ళువిప్పిచూశారు. ఫ్రెంచి, బోల్షివిక్ విప్లవాలు వాళ్ల రక్తంలో జీర్ణించుకుపోయాయి. మానవజాతియందు ‘ఏకరక్తబంధు’వులని త్వరితంగానే గుర్తించారు. ఖండాంతరాలలోనైనా, పొరుగునైనా ఎక్కడున్నా మనిషికష్టాలకు కరిగిపోయి సుఖాలపట్ల ఆనందోత్సాహాల్ని వెల్లడిస్తూ తమ శ్రుతి కలిపారు. ‘ప్రజలకోసం’ కవిత్వాన్ని వ్రాస్తున్నామని సంప్రదాయం విడవకుండానే ఛందస్సును ఛేదిస్తూ భాషానియమాలను సడలించి రచనలు చెయ్య నారంభించారు. అభ్యుదయకవుల నహార్థంచేసికొని సంప్రదాయం తప్ప కొత్తవెలుగు చూడలేనివారు, అభ్యుదయకవులు వ్రాస్తున్న భాష ప్రజల కర్థంకావటంలేదని దోషారోపణచేశారు. కాని అభ్యుదయకవులు ప్రజలకోసం (సామాన్యప్రజల కోసం) కవిత్వాన్ని అంకితమిస్తామన్నారుగాని అక్షరాస్యులందరికీ అర్థమయే వచనమే వ్రాసి, కవిత్వానికి అవసరమైన కాంతాసమ్మితత్వాన్ని సద్యఃపర నిర్వృతినీ ఉపేక్షిస్తామనలేదు. ఏనాడో నన్నయ్యగారు సెలవిచ్చిన ‘విశ్వశ్రేయః కావ్యమ్’ అన్నది వీరి కవిత్వానికిగూడ గమ్యం.

ఒక దశాబ్దంపాటు రసజ్ఞులను మైమరపించింది అభ్యుదయ కవితోద్యమపు వెల్లువ. భావకవులు పలువురు గట్లు తెంచుకొని అభ్యుదయ ప్రవాహంలో కలిశారు. ఈ వెల్లువ క్రమంగా సమతీరాన ప్రవహించి, నెమ్మదిగా సారినా సాహిత్యప్రియుల హృదయ క్షేత్రాల ఆర్తిని తీరుస్తూనే ఉన్నది. అభ్యుదయ కవిత్వమిచ్చే నూతనశక్తి కెదురుచూచే వారికి శ్రీ పి. వి. కృష్ణారావుగారి ‘వైతరణి’ మంచి ‘టానిక్’.

‘వైతరణి’ కావ్యంలో మురికికూపాలలోనూ, దుర్గంధం కొడుతున్న కాలువల వొడ్డున నివసించే వారి జనుల బాధల గాథలు గీతాలద్వారా వ్యక్తమౌతున్నవి. కవి హరిజనోద్ధరణకై స్వయంగా కృషి

చేసినవాడు. ఈ కావ్యం వ్రాయటానికి ఆవేశాన్ని ప్రసాదించిన హరిజనులకు కృతజ్ఞత అర్పిస్తూ తన విన్నపంలో 'నన్ను వాళ్ళ గుడిసెల్లోకి రానిచ్చారు. గుడిశముందు మురికి గుంటల ఒడ్డున నులక మంచం కోడుపొందించి దగ్గరకు రావచ్చునో లేదో అనే భయభ్రాంతి పొడుస్తూంటే సగంచెప్పి సగం చెప్పక, పూర్తిగా బాధచెప్పటానికి మాటలు రాక అర్జీ రాసికోవటానికి యిళ్ళల్లో కాగితంలేక చేతుల్లో కలాలులేక ఏకలవ్యులలా నాకు వారి బొటిమన వ్రేళ్ళిచ్చారు. ఒక లక్ష బొటిమనవ్రేళ్ళ నేను వ్రాశాను—చదివాను' అని చెప్పారు. ఈ కవి మనసా, వాచా, ఆచరణ రూపేణా హరిజనోద్ధరణ కోరుకుంటున్న వాడు. ఉపదేశాన్ని సంఘపరంగా చేసినా కావ్యశిల్పాన్ని మాత్రం విడువని నిపుణుడు. కావ్యమంతా చదివిన సహృదయుల కనుగొలుకులలో రెండు కన్నీటి బొట్లయినా విలువగలిగిన అనుభూతిని ప్రసాదించాడు.

బాణాన్ని లాగి విడుస్తున్నట్లు ఆరంభంలోనే మురికిపేటల గూర్చి చెప్తూ

'ఒక్కొక్క నగరం దేహంమీద
మానని రాచపుండు'

అంటారు. వెన్వెంటనే మురికిపేటలో మసలే మూగ జీవాలు

'బురదలో పురుగులు మసలినట్లు
ఎన్నడూ మోములెత్తి మిన్నువైపు చూడక
వేడికి ఎండి చలికి స్రుక్కి
గాలికి వాలి తుపానులో త్రుళ్ళిపడి
ఈ బంధన సత్యమని
ఈ బ్రతుకు అనిత్యమని'

మెట్టవేదాంతంతో జీవించటం చూచి ఆక్రోశంతో విలపించారు. కవిగా తన బాధ్యతయెరిగి సమాజంలో వాళ్ళ దుస్థితిగుఱించి నిస్సంకోచంగా, నిర్భయంగా, చెప్పవలసిన విధంగా చెప్పారు. వాళ్ళజీవితాలు 'బాధల మహాభారత' మట. సమాజం హరిజనుల పాలిట మౌనం వహించి పట్టనట్లుండటం యీ కవి సహింప లేకపోయారు. శ్మశానాలకు వేరుగా చోటువిడమర్చిన యీ హర్మ్యాలలోని మనుష్యులు తమ నగరంలో, తమ కళ్ళెదుటనే 'సజీవమానవాస్థిపంజరాలు మసలుతూంటే' ఊరుకోవటం దారుణమంటారు. ఈ దీనులలోనూ రకరకాలు—వాళ్ళ 'ఒకడు గుహుడు, ఒకడు చెప్పులుకుట్టేవాడు; ఒకడు అంధుడు; ఒకడు బంధువు' అని పేర్కొని ఆలోచనా పరుల మనస్సులను కలచివేశారు. ఈ కావ్యంలోనే

'నివాసం=కుటీరంలో—తుపానులో
ఆశ=ఆరుతూ—వెలుగుతూ
విశ్వాసం=వికసిస్తూ—హ్రస్వమౌతూ
ఓర్పు=మసీభవిస్తూ—అవిరౌతూ
బ్రతుకు=దుఃఖంలో—నిర్వీర్యతలో'

అనే పాదాలు అత్యుత్తమ కావ్యఖండికలుగా పేర్కొనదగినవి. శ్రీ శ్రీ 'మహాప్రస్థానం'లోని 'అవతరిగట్టు'అనే గేయంలో ప్రదర్శించిన శిల్పనైపుణ్యం వీరి మాటల్లో, మరింతగా అందాన్ని సంతరించుకున్నది. 'వైతరణి' ఒడ్డున జీవించే యీ దీనుల కథలు చదువుతూంటే శ్రీ అనిసెట్టి సుబ్బారావుగారి 'ఎవరిపిల్లలోయి మీరు' అనే గీతం స్మృతిపథంలోకి వచ్చి, అభ్యుదయకవిత్వం మళ్లీ యిన్నాళ్లకి, యిన్నేళ్లకి, ఖాయిలాపడిలేచిన రోగిలా కాకుండా, నిద్రించి లేచిన మహోన్నతునిలా దర్శన మివ్వటం అత్యంతానందకరం.

'మహాగుహలు' అనే గీతంలో వివిధవృత్తుల వలన జీవించే యీ దీనులు

'మానవులు మాలిన్యంచేసే చోట్లను
ఓర్పు చీపుర్లతో తుడిచినవారు'గా పేర్కొని

వైతరణీతీరంలో

ఉపయోగకరమైన
సరికొత్త గ్రంథములు

వ్యవసాయము – ఫిషరి – కోళ్ళ పెంపకం – ఆడవులు – తోట పని – యింజనీరింగ్ – వైద్యము – వివిధ సాంకేతిక విషయములపై గ్రంథములు గలవు. కేటలాగు ఉచితము.

ఇంగ్లీషులో వ్రాయండి :

N. K. PAUL & SONS,
P. B. No. 12202, Calcutta—5.

'సహస్రజీవనదుల మహాగుహాలు
ఇట శతసహస్రఘటవాఘటికులు'గా వారిని వర్ణించారు. కవి తాత్వికచింతనతో మురికిపేటల ఉనికికి కారణాల నన్వేషిస్తూ

'ఆటవిక ప్రకృతికి చీరగట్టి
చెట్ల జలపాలు కత్తిరించి
భూమిమీద బుల్‌డోజరు పరుగెత్తించి
పలుమూలల ఎల్లలు నాటించి
రాజ్యం స్థాపించిన అధికార కేంద్రీకరణలో
కొందరు నిరధికారులై
జలపాలులేని జాట్ల చిత్రజాబ్లై
బుల్‌డోజరు నడువనిచోట్ల మురికిపేటలై'

అని వాస్తవాన్ని జంకుకొంకులేకుండ వెల్లడించారు. వారెందుకు పతనమవుతున్నారో తెలిస్తే హృదయమున్న ప్రతిమనిషీ బాధతో ఘూర్ణిల్లుతాడు:

"ఆ పేటలో వ్యక్తులు క్రూరులై
ప్రస్తుత ధర్మం పాటించని నీచులై
మీ గుండెల్లో పుండ్లై
ఈ సంఘం ఏలే రాజులకు వ్రణాలై
మనశాస్త్రచర్యలు పుట్టించిన చికిత్సలకు
అతీతులై'

అని బాధతో అర్ధాంతరంగా మాటలు పెగలక ఆగిపోయారు. వేదనాజనితమైన ఉత్తమభావం అవ్యక్తమేనేమో! దానిని కవిగూడ కొంతవరకే వ్యక్తం చేయగలడు.

ఈ చిన్నకావ్యంలో రసవత్తరం కాని పంక్తి లేదనాలి. రసజ్ఞులైన పాఠకులంతా చదివితీరాలి.

"చెంబెడు మంచినీళ్లకు
జలమేధయాగం
కుంచెడు ఉప్పునీళ్లకు
సప్తసముద్రయానం"

అనేమాటలు చదవగానే నవ్వులోనే ఏడుపువచ్చేస్తుంది. 'చీకటి' అనే గేయం అత్యుత్తమం. చివరగా "ఏదో ఉషస్సు తొలివెలుగువచ్చి తమస్సును తొలేస్తుందా?" అని ప్రశ్నించారు.

శ్రీశ్రీకూడ "నిజంగానే నిఖిలలోకం నిండు హర్షం వహిస్తుందా?" అని ప్రశ్న గుర్తువే వదిలారు కవి ప్రశ్నిస్తున్న యీ సమస్యకు పరిష్కారం మన సమాజంలో ఎప్పటికి వస్తుందో?

హరిజనులలో 'అంబేద్కర్' పుట్టినట్లే యీ వైతరణీ తీరంలో ఏవైనతేయుడో పుట్టకపోడని కవి ఆశిస్తారు.

పేదవాడింటి పెళ్లిలోనూ మానవానుభూతులు ఎంత ఆర్ద్రమో, ఎంత సహజమో 'కొత్తపందిరి'లో కళ్లకు కట్టించారు. మురికిపేటల్లోని మనుష్యులు కట్టేస్తేనే సంపన్నుల బంగరు బిందెలు నిండుతున్నాయి. ఈ సత్యాన్ని గుర్తించమంటూ

పిహారుపడ్డ కష్టాల్ని దోచారు
మిమ్మల్ని దోచారు
ఈ భాగ్యాలకు వారసులై
వైతరణి ఆవలిగట్టున
లక్కయిళ్లు గట్టించారు.

ఈ విధముగా వివరించి వాళ్లను 'కళ్లుతెరచి చూడు' అని హెచ్చరిస్తున్నారు.

ప్రస్తుత సమాజవ్యవస్థ మారాలని వాంఛించే ప్రగతివాదుల కీ కావ్యం ఆనందమిస్తుంది. వారిని 'కానరాకే కదలించి'; మునుముందుకు నడిపిస్తుంది.

చలి నెగళ్లు

[స్వచ్ఛంద కవితా సంకలనం; కవి — వరవర రావు; ప్రచురణ: స్వేచ్ఛాసాహితి; హనుమకొండ; 76 పేజీలు; వెల : రూ. 2.]

సామాజికప్రగతివాదము అభ్యుదయ కవితోద్యమంతో ఆంధ్ర సాహిత్యంలో ప్రవేశించింది. పూర్వకవులకు సామాజికాభ్యుదయంపట్ల ఆసక్తి లేదని చెప్పలేముగాని, వారి కవితాధ్యేయం ఆముష్మిక చింతనవైపే మొగ్గింది. 'జగద్ధితము'కోసమే కవిత్వం వ్రాస్తున్నట్లు చెప్పుకొన్నవారిలో గూడ తగినంతగా 'లోకవృత్త పరిశీలనం' కన్పింపదు. ప్రజలకోసం ప్రజాకవిత్వం వ్రాయాలనే సంకల్పంతో అభ్యుదయ

కవులు ప్రవేశించారు. వస్తూనే భావకవిత్వాన్ని నిరసించారు సంభోగ, వియోగ శృంగారాలు రెండూ వారి కామోదయోగ్యాలు కాలేదు. శృంగారాన్ని మించినవీ, కవిహృదయాన్ని కదిలించేవీ వారికి ఎన్నో కావ్యవస్తువులు కన్పించాయి. 'భిక్షువర్షీయసి'; 'దేశచరిత్రలు'; 'ఎవరిపిల్లలోయి మీరు'; 'త్వమేవాఽహమ్' వంటి కావ్యఖండికలు విస్తృతంగా వచ్చాయి. వీరి కావ్యాలలో 'ఆకలి' ప్రధానేతివృత్తంగా చోటు చేసుకొన్నది. వ్యంగ్యాత్మకభాషణము, సూటిగా—ఎలుగెత్తి చాటిచెప్పే వివాదాలు ఆక్రమించుకొన్నాయి. ఒక మహావెల్లువ వచ్చి సారస్వతక్షేత్రాన్ని పునీతం చేసింది. వెల్లువ తగ్గినా ప్రవాహపుగతి మంద్రస్థాయిలో శ్రావ్యంగా వినిపిస్తూనే ఉన్నది. శ్రీయుతులు గజ్జల మల్లారెడ్డి; పి. విజయలక్ష్మి; శీలా వీర్రాజు; వరవరరావు ప్రభృతులు అభ్యుదయ కవిత్వపు మహాప్రస్థానంలో ఈ దశాబ్దంలో పేరెన్నికగన్నవారు. వీరిని రెండవ తరగతి అభ్యుదయ కవులని అనుకోవటం పొరపాటు. పై నలుగురూ ప్రతిభావంతులే. అందరివీ స్వంతగొంతుకలే. పైవారిలో శీలా వీర్రాజు; వరవరరావుగారలలోని సౌందర్యదృష్టి ప్రత్యేకమైనది. వీరిద్దరూ పదచిత్రాలను వ్రాయటంలో చిత్రకారుల ప్రతిభను చూపుతారు. వీర్రాజుగారిది వచనకవుల మార్గం. వరవరరావుగారిది దాశరథివలె ప్రణయమూ, ప్రళయమూ కలగలిపిన ప్రత్యేక మార్గము. ఐతే దాశరథిని వరవరరావు ఎక్కడా అనుకరించరు. స్వచ్ఛందమైన కవిత్వపుజాలు వరవరరావుగారి 'చలినెగళ్లు'లో ద్యోతకమవుతున్నది. అచిరకాలంలోనే సామాజిక ప్రగతిమార్గంలో నాయకత్వం పొందిన వరవరరావు కవితల సంపుటి 'చలినెగళ్లు'.

'తోటకు నీళ్ళు కడుతున్న కాపుబిడ్డ
కమ్మని జానపద గీతానికి
సంగీత భంగిమలు కూరుస్తున్నది
కాలువనీళ్ళు—సీమకోళ్ళు
పచ్చని ఉడుపులు ధరించిన మొక్కజొన్నపడతి
పరవశత్వంలో గాలితోలపాటకు తూలిపోతున్నది
మిరపకాయ తోటలో మెరిసిపోతున్న
బంతిపూవుటంతి
కాపువాని పాటకు లయ గలిపే లంబాడి
నృత్యం చేస్తున్నది.
ఎవరికళ్ళూ నిర్మలంగా నిష్కపటంగా
కన్పించడం లేదు
అందరి కళ్ళనూ ఏదో పొర—
తెల్లని తెర కప్పివేసింది.
మల్లెలవంటి మంచు కరిగి
ఉల్లములందు మంచితనం పెరిగి
మంచివాని కంఠం కంచయి మ్రోగాలి
మంచివాని కష్టం కనకమయి పండాలి.'

అని ఆశతో పలికేరు—

'మంచు తెరలు'లో

'హిమ సముదాయం చూసినపుడు
ఢాకా సాలెవాని శ్రమ గుర్తుకు
తెచ్చుకోమంటుంది ప్రకృతి'

'మోడు వారిన వృక్షసితంతువు
శిశిరునితో పునర్వివాహం చేసుకొనే పొద్దున
మధ్యన గట్టిన మేలి తెరలాపోల్చుకొమ్మంటుంది
కందుకూరినాటి సమాజము'

అని చక్కని ఉపమానాల నందించారు.

'హిమ యవనిక'లో

'అటు చంద్రాస్తమయానికి
ఇటు సూర్యోదయానికి మధ్యన
ఇంకా మేలుకోని మనుష్యుల
ఏలుకొంటున్నది మంచురాజరికం'

'రాత్రి గులాబీ ఇంటికి
విందుకుపోయిన భ్రమరము
గులాబీ రెక్కలాంటి చెక్కిళ్ళపై మైమరచి
రెక్కలు తీయబోయి
గులాబీ ఎడదను వేళ్ళాడే
మంచుతెరమాటున బందీయై పోయినది'

'భళ్ళున తెల్లవారు వింక భయంలేదు'; 'శిశిరోషస్సు'; 'మంచుతెరలు'; 'హిమయవనిక' అనే శీర్షికలుగల నాలుగు గీతాలూ ఈ సంపుటిలోకెల్ల మేలైనవి. తన కావ్యసంపుటిలోని సంకేతార్థాలను వరవరరావు ముందుగానే వివరించారు.

'ఒక అవ్యవస్థితమయిన సామాజిక వ్యవస్థకు సంకేతంగా 'చలివేకువ'ను గ్రహించాను.

'భళ్లున తెల్లవారు నింక భయం లేదను కున్నాను. తెల్లవారితే కుళ్లు తెల్లమవుతుందను కున్నాను. రాత్రయితే గడిచిపోయింది. కాని ఇంకా 'తెల్లవారలేదు'. ఇది రాత్రీ, దినమూ కాని వేకువ. ఈ వేకువ మొగాన ఇంకా మంచుతెరలు జారిపోలేదు. ఇంకా మనుషుల్లోని భయాలు, సందేహాలు, ఆకలి, దారిద్ర్యం, అనారోగ్యం తొలిగిపోలేదు. అయితే ఆశ కూడ మలిగిపోలేదు.'

'చలి'-సంకేతంగా తీసుకొని సమాజాన్ని చిత్రించే ప్రయత్నం ఇందులో మూడు గేయాల్లో ప్రముఖంగా కనిపిస్తుంది. అవి హిమయవనిక, శిశిరోషస్సు, మంచు తెరలు-ఆ మూటికీ Back-Ground గీతం 'భళ్లున తెల్లవారు నింక భయం లేదు.' తన కావ్యేతివృత్తాలగుణించీ, వాటి ప్రయోజనం గూర్చీ, తా నుపయోగించిన సంకేతాలనూ వాటి అర్థాలను విడమర్చి చెప్పారు. కవి తన కవిత్వానికి స్వయంగా వ్యాఖ్యాత కావాలా? అక్కర్లేదు. అక్కర్లేదనే శ్రీ వరవరరావు అంటారు. తాను ధ్వని (Suggestion) మూలకంగా కవిత్వంలో చెప్పదలచు కున్నది స్పష్టంగా చెప్పలేకపోయానని మనసులో ఏమూలో సంకోచం వ్యాకోచించినపుడే ఇలా వాచ్యంగా ఆముఖాన్ని ఆశ్రయిస్తాడేమో కవి—

సమాజంలోని నేటి స్థితిగతులు అస్పష్టంగా, సందిగ్ధంగా, అవ్యక్తంగా ఉన్నాయి. ఈ కవి 'చలి వెగళ్లు' వేశారు. చలిమంటల చెంతపొందే అనుభూతి అనిర్వచనీయమైన మధురానుభూతి. అట్లాగే వరవరరావు కవిత్వంలో పదచిత్రాలను వివరించకూడదు. చదివి ఆ ఆనందాన్ని అనుభవించాలి అంతే. అందుకే అందమైన కొన్నిపదచిత్రాలను ఉదహరిస్తాను. శిశిరోషస్సులో

మంచిసీరనుకొని రాత్రి మల్లెపూవు తాగిన
మంచునీరు గడ్డకట్టి కుత్తుక జారడంలేదు.'
'మామిడాకు హృదయం తడుపుతున్నది మంచు
నెలత.'
'కృషీవలుని అనాచ్ఛాదిత దేహానికి
దుక్కిటెద్దుకు—మోటబారుకు చలి ఉండదు.
మంచెమీద తెల్లవారి కడ విద్యుద్దరలేచిన
కాపుకన్నె విదిల్చిన జడ
మంచుకుబుసం విడిచిన నల్లతాచు

....

మంచుముత్తెపు బులాకీ పెట్టుకొన్న
కురుమ వాని కొత్తకోడలు—శనగ సిగ్గరి—

అని ప్రకృతిని పరికించి నిలువెల్లా కరిగిపోయిన భావుకుడు పలికినమాటలు సహృదయులను పరవశుల్ని చేస్తాయి.

పైన పేర్కొన్న నాలుగు గీతాలు గాక మిగిలిన గీతాలు ఈ సంపుటంలోఉన్నా అవి ఈ గేయాలు కదిలించినంతగా చదువరులను కదిలించవు. కాని అన్నీ గీతాలలోనూ ప్రగతివాదము, దానితోనే సౌందర్యదిదృక్షా తొంగిచూస్తాయి.

ప్రతిగ్రామమూ పంచాయితీ స్థావరమైపోతున్న
ఈ రోజుల్లోనూ
తెల్లగా పూయటంతప్ప మరేమి తెలియని
మల్లెపూవునుచూస్తే జాలివేస్తున్నది
పొరుగువాని తేనెపట్టులోంచి ఎగిరివచ్చిన
తేనెటీగ మా ఇంట్లో గులాబీరసం తాగడం
ఇరుకుగా చుట్టూ గోడలు కట్టుకొన్న
ఈ వాడూ తప్పడం లేదు.'

'అడ్ అవర్స్' అనే గీతమింతకు ముందే 'రాత్రి' అనే కవితా సంకలనంలో చేర్చబడినది. ప్రగతివాదాన్ని సమర్థించే ఉత్తమ కావ్యఖండికలలో యిది వొటని చెప్పవచ్చు.

'అవినీతి విచారణ కమిటీ ఆఫీసరు విసిరేసిన
ఖాళీసీసా గాజుపెంకుచేసిన గాయానికి
ముసలి స్వీపరుమంచమెక్కిన ఘడియ'
దినమంతా రిక్షావాని కాళ్లు గడించిన గవ్వలు
సగం జువ్వాలో—సగం గస్తీ పోలీసు జేబులో
పేదవాని కళ్ళను హేళన చేస్తున్నవి.
పచ్చగడ్డి పరుపుమీద పిచ్చివాడు
స్వర్గాలు చవిచూస్తున్నాడు.
పిచ్చివాని తైలహీనకేశవలయాల్లో

మున్సిపాలిటీ దీపాలు రోదచేస్తున్నవి
వాని వెచ్చని కౌగిట్లో వెన్నెల మైమరచింది'

ఈ విధంగా సమాజంలోని అక్రమాలను తీవ్రంగానూ, వ్యంగ్యంగానూ దుయ్యబట్టి యీ కాళరాత్రిలో నుండి ఉషోదయంపట్ల గంపెడాశ పెట్టుకున్నాడు కవి. రాఖీబంధన్, తీయనిపాట, అందనిఆకాశం, జవహర్‌లాల్, నేను, ఆకలి అనే గీతాలంతగా పాఠకులను కదిలించవు.

'అమ్మమ్మ చెప్పిన కథలా
అద్భుతంగా లేదు జీవితం' అనే గీతంలోని శిల్పం గడుసరిగా, సరిక్రొత్తదిగా ఉన్నది.

అభ్యుదయ కవితోద్యమం నిరాటంకంగా తన మహాప్రస్థానాన్ని కొనసాగిస్తుందని, తన గమ్యాన్ని చేరుకుంటుందనీ నమ్మకం కలిగించే కొలదిమంది కవులలో శ్రీ వరవరరావు ముందు వరుసలో నిలిచి 'పదండి ముందుకు' అని పాడతారు. 'చలిగవెళ్ల హిమాన్ని కరిగించి ఉషస్సును' ప్రసాదిస్తాయని యీ కావ్యాన్ని చదివిన తరువాత పాఠకులు గుండెలనిండా గాలి పీల్చుకొంటారు.

—రామమోహనరాయ్.

"అర్థశాస్త్ర మూలసూత్రాలు— సరళ పాఠ్యక్రమం"

[మూలం: పి. నికిటిన్. అనువాదం: వై. విజయకుమార్, విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, విజయవాడ-2. వెల రు. 8/-]

పి. నికిటిన్ అను రష్యన్ రచయిత 1959 లో 'అర్థశాస్త్ర మూలసూత్రాలు-సరళ పాఠ్యక్రమం' అను యీ గ్రంథాన్ని వ్రాసినాడు. ఆనాడు యీ గ్రంథానికి యునైటెడ్ సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్‌లోని విజ్ఞానశాస్త్ర అకాడమీయొక్క బహుమతి లభించినది. తర్వాత యిది సంస్కరించబడి ప్రచురింపబడినది. ఇప్పుడు శ్రీ వై. విజయకుమార్ దానిని అనువదించి, తెలుగు పాఠకలోకానికి అందించినారు.

'అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేయదలచుకొన్న వారెవరికైనా యీ గ్రంథం సహాయకారిగా ఉండగలదు'—అని ప్రస్తుత ప్రచురణ కర్తలు విశ్వసిస్తున్నారు. ఇది ఆమూలాగ్రం మార్క్సిస్టు దృక్పథంతో వ్రాయబడినది. 'అర్థశాస్త్రం మానవ సామాజిక జీవితంయొక్క పునాదినిగురించి వివరిస్తుందిగాన, మార్క్సిజం—లెనినిజంలో యిది ఒక ముఖ్యభాగమయింది' అని రచయిత నమ్మకం. లెనిన్ యొక్క అనుయాయులద్వారా, సోవియట్ కమ్యూనిస్టుపార్టీద్వారా 'అర్థశాస్త్రం నిర్మాణయుతంగా అభివృద్ధి చేయబడింది' అని ఆయన ఉద్ఘాటిస్తున్నారు. (పేజి 20). కాగా, కమ్యూనిస్టు అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేయదలచుకొన్నవారికి యీ పుస్తకం సహాయకారిగా ఉండవచ్చు.

నికిటిన్ సిద్ధాంతం ప్రకారం అర్థశాస్త్రం సామాజిక ఉత్పత్తి విధానాన్నిగురించి తెలియజేస్తుంది. ప్రజలమధ్యవున్న ఆర్థిక సంబంధాల అభివృద్ధిని గూర్చిన శాస్త్రమే అర్థశాస్త్రం. అది ఒక చారిత్రక శాస్త్రం. 'చారిత్రకాభివృద్ధి గమనం తప్పనిసరిగా కమ్యూనిస్టు ఉత్పత్తివిధానానికి ఎలా దారితీస్తుందో' యీ శాస్త్రం తెలియజేస్తుందట. (పేజి. 18)

'అర్థశాస్త్ర మూలసూత్రాలు'—లో రెండు భాగాలున్నాయి. మొదటి భాగంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంయొక్క స్వరూప స్వభావాలు, అదనపు విలువ, దోపిడీ విధానం, ఆర్థిక సంక్షోభాలు, సామ్రాజ్యవాదం, ప్రపంచ పెట్టుబడిదారీ విధానం యొక్క సాధారణ సంక్షోభం— మొదలయిన విషయాలు మార్క్సిస్టు పరిభాషలో వివరింపబడినాయి. రెండవ భాగంలో రచయిత కమ్యూనిస్టు ఉత్పత్తి విధానాన్ని గురించి స్థూలంగా చర్చించాడు. కమ్యూనిస్టు విధానంలో రెండు దశలున్నాయి—ఒకటి సోషలిస్టుదశ. రెండవది కమ్యూనిస్టు దశ. ఆయా దశలలోని ప్రధానమైన విషయాలు—అనగా, సోషలిస్టు సమాజంలో ఉత్పత్తి సంబంధాలు, సరకు ఉత్పత్తి, ద్రవ్యం, వ్యాపారం, వేతనాలు, ఉత్పత్తి ఖర్చులు, ధర, సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలు కమ్యూనిస్టు సంబంధాలలోనికి అభివృద్ధిచెందుట—సోవియట్ రష్యా

అనుభవాన్ని ప్రమాణంగా తీసుకొని రచయిత చర్చించినాడు.

ఈ గ్రంథంలో నికిటిన్ తన విశ్వాసాలను వాక్కు చెప్పటానికే అత్యధిక ప్రాధాన్యం యిచ్చాడు. ఆయన మతం ప్రకారం:-1. 'అర్థశాస్త్రం ఒకవర్గ వ్యథాపంగల, పక్షపాతంతో కూడిన శాస్త్రం.' (పేజి 18). 2. 'సామాజిక నియమాలు మన యిష్టానిష్టాలతో నిమిత్తం లేకుండ అమలు జరుగుతుంటాయి'. (పేజి. 14). 3. 'అర్థశాస్త్రం కమ్యూనిజంయొక్క విజయం అనివార్యమని రుజువు చేస్తుంది.' (పేజి. 21). 4. 'శ్రమ ఒక్కటే విలువకు మూలం.' (47). 5. 'వ్యవసాయం వెనుకబడి యుండుటకు ప్రధాన కారణం భూమిపైన ప్రయివేట్ యాజమాన్య ముండుటయే (పే. 177). 6. 'ప్రజలకు స్వేచ్ఛా సౌఖ్యాలను తెచ్చిపెట్టగల మార్గం సోషలిజం'. (పేజి 269). ఈ సూత్రాలతో ఏకీభవించేవారు యీ పుస్తకాన్ని ఒక ప్రామాణిక శాస్త్ర గ్రంథంగా భావిస్తే ఆశ్చర్యపడనవసరం లేదు.

ఈనాడు ప్రపంచంలో మూడు రకాలైన ఆర్థిక విధానాలు అమలులో ఉన్నాయి. ఒకటి ప్రయివేటు రంగానికి అధిక ప్రాధాన్యం యిచ్చే కాపిటలిస్టు ఆర్థిక విధానం రెండు పబ్లిక్ రంగానికే పట్టం గట్టి పోషలిస్టు విధానం. మూడు పై రెండింటినీ సమన్వయపరచే మిశ్రమ ఆర్థిక విధానం. ఈ మూడు విధానాల తీరుతెన్నులూ-లోటుపాటులూ తులనాత్మకంగా తెలుసుకొన గోరువారికి యీ గ్రంథం ఎక్కువగా తోడ్పడదు. ఎందుచేతనంటే రచయిత యీ పుస్తకంలో కమ్యూనిస్టు సిద్ధాంత కర్తలు ప్రతిపాదించిన 'రూళ్లక్కర ఆర్థిక సూత్రాలనే' క్రోడీకరించటం జరిగింది.

—వి. ఆర్.

విశ్వనాథనాయక విజయనాటకము

ఆంధ్రచారిత్రక నాటకం. రచయిత-శ్రీ శిష్ట్లా రామకృష్ణశాస్త్రి; పుటలు-114. వెల రూ. 1-75 ప్రాప్తిస్థానం: రచయిత, ఆంధ్ర శాఖాధ్యక్షుడు, మద్రాసు విశ్వవిద్యాలయం, చేపాకు, మద్రాసు-5.

కింకిణులు

ఖండకావ్య సంపుటి. రచయిత-శ్రీ బొడ్డు ప్రకాశం పుటలు-78 వెల-1-50. ప్రాప్తిస్థానం-శ్రీ బొడ్డు ప్రకాశం, రిటైర్డ్ తహసీల్దారు, మూడవలైను, కోబాల్డ్‌పేట, అరండల్‌పేటపోస్టు, గుంటూరు-2.

శివమహిమ్నః స్తోత్రం

సంస్కృతం-ఆంగ్లానువాదం. ఆంగ్లానువాదకుడు-శ్రీ పిశిపాటి కృష్ణమూర్తి. పుటలు-102. ప్రాప్తిస్థానం-శ్రీ పిశిపాటి కృష్ణమూర్తి, 5677 సెయింట్ మేరీస్ రోడ్, సికిందరాబాద్ (ఎ. పి.).

కృష్ణమూర్తి పద్ధతిలో ముందడుగు

శ్రీ కె. ఎస్. కృష్ణమూర్తిగారి పద్ధతిలో సాగే జ్యోతిషవిషయకవ్యాసం. పుటలు-22. వెల-తెలియదు. ప్రాప్తిస్థానం-'అదృష్టం' కార్యాలయం, 6/865 బ్రాహ్మణవీధి, హనుమకొండ, వరంగల్-1.

పదార్చన

కవితాసంకలనం. శ్రీమతి జిలుగుమూడి అమ్మగారిపై రచించిన కవితల సంకలనం. సంకలనకర్త-శ్రీ తంగిరాల కేశవశర్మ. పుటలు-130. వెల-రూపాయిన్నర. ప్రాప్తిస్థానం-మాతృ శ్రీ పబ్లికేషన్స్, బాపట్ల, గుంటూరుజిల్లా.

మానవుడు,.మానవసంఘం

రచయిత-శ్రీ చదలవాడ పిచ్చయ్య. పుటలు-80. వెల-1-50. ప్రాప్తిస్థానం-వేంకట్రామా అండ్ కో, పబ్లిషర్స్, మద్రాసు, సికిందరాబాద్, ఏలూరు.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by Radhakrishna at the Andhra Patrika Press, 6 & 7, Thambu chetty Street, Madras-1.
Editor : S. Sambhu Prasad.

శీఘ్రంగా అన్ని రకాల బాధల ఉపశమనం





పునొప్పి :
మృతాంజనాన్ని వీపు, పెద ఎముకమీద, మర్దనా చెయ్యాలి.

బెణుకులు :
బెణికినచోట అమృతాంజనం మర్దనా చెయ్యాలి. వేడినీళ్లతో కాపడంకూడా పెట్టవచ్చు.

75 ఏళ్ల పైగా
ప్రఖ్యాతి చెందిన
అమృతాంజనము

అమృతాంజనము



MRJ